


సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 144

బుధవారం 14-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 144

బుధవారం 14-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




మూడు రోజుల తర్వాత...

భారత మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ రజత పతకం కేసు మళ్లీ వాయిదా. -14లో



మూసీ నది మురిసేలా..

అటు వాణిజ్యం, ఇటు పర్యాటకానికి ఊత మిచ్చేలా రివర్ ఫ్రంట్ అభివృద్ధి -16లో



వైద్యురాలి కేసు సీబీఐకి..

కోల్‌కతా వైద్యురాలి రేప్, హత్య కేసు దర్యాప్తునకు సీబీఐ రంగంలోకి దిగింది. మరోవైపు సమ్మె విరమిస్తున్నట్లు 'ఫోర్డా' ప్రకటించింది.

- వివరాలు 6లో



లక్షల్లో గిగ్ జాబ్స్

పండుగల పుణ్యామా అని ఈ ఏడాది దాదాపు 7 లక్షల గిగ్ వర్కర్లకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయని అంచనా.

- వివరాలు 15లో



...అలా పంచుకున్నారు!

భారత్, పాక్ మధ్య ఆస్తులు, అప్పులు మొదలు సైన్యం, సాంస్కృతిక సంపద దాకా సజావుగా పంపిణీ అయ్యేందుకు పెద్ద కసరత్తే జరిగింది.

- వివరాలు 6లో



నేడు 'కాగ్నిజెంట్'కు శంకుస్థాపన

దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ హైదరాబాద్‌లో నిర్మించనున్న కొత్త క్యాంపస్‌కు సీఎం రేవంత్ బుధవారం శంకుస్థాపన చేయనున్నారు.

- వివరాలు 5లో

మళ్లీ భూసర్వే.. పహాణీల నమోదు!

- ఆర్‌వోఆర్ ముసాయిదా చట్టంపై సందేహాలకు నిపుణుల సమాధానాలు
- పార్ట్–బీలో పెట్టిన 18 లక్షల ఎకరాల పరిస్థితి ఏంటి?
- ధరణి పోర్టల్‌లో తప్పొప్పులకు అవకాశం ఉంటుందా?
- గత చట్టానికి, ఈ ముసాయిదాకు తేడా ఏంటి?.. మ్యాప్ కావాలంటే సర్వేయర్ కావాల్సిందేనా?
- ఇలాంటి ఎన్నో సందేహాలపై స్పష్టత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల రికార్డులను పారదర్శకంగా నిర్వహించడం కోసం 'రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)–2024' పేరిట ప్రభుత్వం కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకురానుంది. దీనికి సంబంధించి ముసాయిదా ప్రతిని ప్రజలకు అందుబాటులో ఉంచింది. అందులోని అంశాలపై ప్రజల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానించింది. దీనితో వేలాది మంది నుంచి స్పందన వస్తోంది. కానీ ఇందులో సలహాలు, సూచనల కన్నా సందేహాలే ఎక్కువగా ఉంటున్నాయని రెవెన్యూ వర్గాల సమాచారం. ముసాయిదాపై ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకునే అవకాశం

మిగతా 2వ పేజీలో ▶

మురికి కూపం.. పురుగుల బియ్యం

నాసిరకం ఆహార పదార్థాలే విద్యార్థులకు వడ్డింపు

సంక్షేమ హాస్టళ్లలో దారుణ పరిస్థితులు



జనగామ జిల్లాకేంద్రంలోని ధర్మకంచ ఎస్సీ బాలికల ప్రీ, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహంలో నిలిచిపోయిన మురుగునీరు



హైదరాబాద్ జాంబాగ్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో వండిన అన్నం దుస్థితి ఇది

- ఏసీబీ ఆకస్మిక తనిఖీల్లో వెలుగులోకి
- రాష్ట్రవ్యాప్తంగా 10 హాస్టళ్లలో ఏకకాలంలో సోదాలు
- పూర్తి అపరిశుభ్ర వాతావరణంలో కొనసాగుతున్న వసతిగృహాలు
- అధ్వానంగా మరుగుదొడ్లు, బాత్‌రూంలు.. వంటగదులదీ అదే పరిస్థితి
- రికార్డుల్లో అవకతవకలు..విద్యార్థుల సంఖ్యలో వ్యత్యాసాలు
- మెనూకు మంగళం.. అరటిపండ్లు, గుడ్లకు కోత
- మొక్కుబడిగా వచ్చిపోతున్న వార్డెన్లు
- తూనికలు, కొలతల అధికారులు శానిటరీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో జాయింట్ ఆపరేషన్

సాక్షి, హైదరాబాద్:

రాష్ట్రంలోని పలు సంక్షేమ హాస్టళ్లు దారుణమైన పరిస్థితుల్లో కొనసాగుతున్నాయి. విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వారికి మంచి అల్పాహారం కాని, భోజనం కాని అందడం లేదు. నాసిరకం కంది పప్పు, కూరగాయలు, పురుగులు పట్టిన బియ్యంతో వండిన ఆహార పదార్థాలనే వడ్డిస్తున్నారు. మెనూ పాటించడం లేదు. రోజూ ఇవ్వాల్సిన అరటిపండ్లు, గుడ్లు లాంటివి ఇవ్వడం లేదు. వసతి గృహాల్లో పారిశుధ్యం ఆనవాళ్లే లేవు. మరుగుదొడ్లు, స్నానాల గదులతో పాటు వంటశాలల్లోనూ అపరిశుభ్ర వాతావరణం కొనసాగుతోంది. కొన్నిచోట్ల విద్యార్థులతోనే గదులు, ఆవరణ శుభ్రం చేయిస్తున్నారు. విద్యార్థులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సరిగ్గా లేదు. మొత్తం విద్యార్థుల సంఖ్యకు, హాజరు పట్టీలో నమోదు చేసిన సంఖ్యకు, వాస్తవంగా తరగతి గదిలో ఉన్నవారి సంఖ్యకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. కొన్నిచోట్ల వార్డెన్లు అందుబాటులో లేరు. వారు ఇష్టారాజ్యంగా వచ్చి వెళుతున్నారు. మంగళవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఈ విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఎవరికి వారు అందినంత దండుకునే వ్యవహారంగానే హాస్టళ్ల పనితీరు ఉన్నట్లు ఈ సోదాల్లో బయటపడింది. డీజీ సీవీ ఆనంద్ ఆదేశాలతో ఏసీబీ అధికారులు, స్థానిక తూనికలు, కొలతల అధికారులు, శానిటరీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఆడిటర్లతో కూడిన 10 బృందాలు.. రాష్ట్రంలోని 10 సంక్షేమ హాస్టళ్లలో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించాయి. అత్యంత అధ్వాన పరిస్థితుల మధ్య విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నట్టు గుర్తించాయి. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులతో

మిగతా 12వ పేజీలో ▶

'కట్టలు' తెగిన అవినీతి



సాక్షి, హైదరాబాద్: అవినీతి పుట్టలు బద్దలవుతున్నాయి. 'కట్టల'పాములు బయటికొస్తున్నాయి. అవినీతి నిరోధక విభాగం చేపడుతున్న వరుస తనిఖీలు, ఆకస్మిక 'ఆపరేషన్లు'సత్ఫలితాలనిస్తున్నాయి. గతానికి భిన్నంగా ఇటీవలి కాలంలో పక్కా స్కెచ్‌తో రంగంలోకి దిగుతున్న ఏసీబీ అధికారులకు అనేక అవినీతి తిమింగలాలు చిక్కుతున్నాయి. ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కింది స్థాయి అధికారులకు పూర్తి స్వేచ్ఛ లభించింది. దీంతో వారు దూకుడు పెంచారు. అవినీతి అధికారుల భరతం పడుతున్నారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్, ఆర్టీఏ.. ఇలా ఏ శాఖనూ వదలకుండా ముమ్మర దాడులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే 105 కేసులు నమోదు చేశారు. గతంలో బాధితులు చేసే ఫిర్యాదులు, వారందించే సమాచారం ఆధారంగా అవినీతి అధికారులను ట్రాప్ చేసేవారు. ఎక్కువగా ఆదాయానికి మించి ఆస్తుల కేసుల నమోదుకే పరిమితం అయ్యేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మార్చిన ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి.. ప్రత్యేకంగా ఒక డిపార్ట్‌మెంట్‌ను ఎంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఏక కాలంలో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీని వాడుకుంటూ క్షేత్ర స్థాయిలో అవినీతి అధికారులకు ఏమాత్రం అనుమానం రాకుండా 'ఆపరేషన్లు'పూర్తి చేస్తున్నాయి. ఏసీబీ డీజీ సీవీ ఆనంద్‌కు విజిలెన్స్ శాఖను సైతం అప్పగించడంతో.. ఏసీబీ తనిఖీలతో పాటు విజిలెన్స్ సోదాలూ తీవ్రమయ్యాయి. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హెచ్ఎండీఏ టౌన్‌ప్లానింగ్ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ రూ.వందల కోట్ల అవినీతి, గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల అవినీతి తదితర కేసులు వెలుగులోకి వచ్చాయి.

ఏసీబీ ఆకస్మిక తనిఖీల్లో వెలుగులోకి..
- పక్కా స్కెచ్‌తో రంగంలోకి దిగుతున్న అధికారులు.. క్షేత్రస్థాయిలో స్వేచ్ఛగా దాడులు, సోదాలు
- గతానికి భిన్నంగా ప్రత్యేకంగా ఓ డిపార్ట్‌మెంట్‌ను ఎంచుకుని ఆపరేషన్లు
- రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు
- వలలో పడుతున్న భారీ తిమింగలాలు

105
ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన కేసులు

ఏసీబీ ఇటీవల నమోదు చేసిన ప్రధాన కేసులు కొన్ని..

జనవరి 2024: హెచ్ఎండీఏ టౌన్ ప్లానింగ్ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కేసు సంచలనం సృష్టించింది. ఏసీబీ అధికారులు రూ. వందల కోట్ల అవినీతి సొమ్మును వెలికి తీయడంతో పాటు పలువురిని అరెస్టు చేశారు.

ఫిబ్రవరి 2024: గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ జగజ్యోతి ఈ ఏడాది ఫిబ్రవరి 19న రూ. 84 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఆ అధికారి ఇంట్లో జరిపిన సోదాల్లో రూ.65 లక్షల నగదు, రెండున్నర కిలోల బంగారం దొరికింది.

మార్చి 2024: మార్చిలో మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా రూ.19 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

మే 2024: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు ఇల్లు, బంధువుల ఇళ్లలో చేసిన సోదాల్లో రూ.కోట్ల ఆస్తులతో పాటు, బినామీల ఆస్తులకు సంబంధించిన పత్రాలు లభించాయి.

ఆగస్టు 2024: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్ ఇంట్లో చేసిన తనిఖీల్లో రూ.2.93 కోట్ల నగదు సహా రూ. 6 కోట్లకు పైగా ఆస్తులు ఏసీబీ గుర్తించింది.

డిసెంబర్ 2023: గతేడాది డిసెంబర్‌లో వెలుగులోకి వచ్చిన గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించిన కుంభకోణంలో ఇప్పటివరకు రూ.700 కోట్ల అవినీతిని అధికారులు గుర్తించారు. మాజీ మంత్రి ఓఎస్డీ కల్యాణ్, పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ రాంచందర్ నాయక్ సహా పలువురిని అరెస్టు చేశారు.

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా తప్పించుకోలేరు: ఏసీబీ డీజీ

'లంచం తీసుకునేవారు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏసీబీ అధికారుల నుంచి తప్పించుకోలేరు..'అని 'ఎక్స్'లో చేసిన ఓ పోస్టులో ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. సోమవారం రాత్రి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి రూ.8 లక్షలు లంచం తీసుకుంటూ అధికారులకు చిక్కారని తెలిపారు.



రేపు మూడో విడత రుణమాఫీ

- వైరా బహిరంగ సభలో నిధులు జమ చేయనున్న సీఎం రేవంత్
- రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు రుణాలకు వర్తింపు



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ మూడో విడత కింద గురువారం ఖమ్మం జిల్లా వైరాలో జరిగే బహిరంగ సభలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మేరకు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయనున్నారు. ఈ నెల 2వ తేదీన అమెరికా, దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లిన సీఎం బుధవారం హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. గత నెల 18న రుణమాఫీ ప్రారంభం కాగా ఇప్పటి వరకు రెండు విడతల్లో రూ.1.50 లక్షల వరకు రుణమాఫీ కింద 17.55 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.12,224 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. రూ.2 లక్షల వరకు రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కాగా అధికారంలోకి వచ్చిన తర్వాత 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆ మేరకు రుణమాఫీని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ క్రమంలోనే తాజాగా మూడో విడత రుణమాఫీ చేయనుంది. అయితే రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్న రైతులు.. ఆ అదనపు మొత్తాన్ని ముందుగా బ్యాంకులకు చెల్లిస్తేనే వారికి రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్న రైతులు ఎంతమంది ఆ అదనపు మొత్తాలను చెల్లించారు? ఇంకా ఎంతమంది చెల్లించాల్సి ఉంది? చెల్లించని వారికి ఇప్పుడు రుణమాఫీ కాకపోతే తర్వాత చేస్తారా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

కరప్షన్, కలెక్షన్.. కాంగ్రెస్ విధానం: సుదర్శన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కలెక్షన్ సెంటర్లు కాంగ్రెస్‌కు అలవాటని, ఆ పార్టీ నేతలు అన్ని చోట్లా వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను పీడిస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. ఆయన మంగళవారం పార్టీ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రవాణా శాఖలో ప్రతి జిల్లాలో అక్రమంగా రూ.కోటి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రైస్ మిల్లర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి కూడా కాంగ్రెస్ నేతలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరం కాగా, రూ.18 వేల కోట్లతో ప్రభుత్వం ముగించే ప్రయత్నం చేస్తోందని ఎద్దేవా చేశారు. రవాణా శాఖలో అవినీతిపై మంత్రి పొన్నం శ్వేతపత్రం విడుదల చేయాలని ఎర్రోళ్ల డిమాండ్ చేశారు.



అయ్యో! అది మనింటి శిలాఫలకమండీ!

సీతారామకు 67.05 టీఎంసీల కేటాయింపు

- సీడబ్ల్యూసీ నుంచి హైడ్రాలజీ క్లియరెన్స్ తీసుకొచ్చాం
- వ్యయం, బెనిఫిట్ కాస్ట్ రేషియో అప్రూవల్స్ కూడా తెచ్చాం
- 2026, ఆగస్టు 15 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తాం
- విలేకరుల సమావేశంలో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మంగళవారం జలసౌధలో విలేకరులతో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా 67.05 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించుకోవడానికి అనుమతిస్తూ కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) హైడ్రాలజీ క్లియరెన్స్ జారీ చేసిందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్టు అనుమతులపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని విజయం సాధించిందన్నారు. ఈ నెల 15న సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు పంప్‌లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. మంగళవారం ఆయన జలసౌధలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులు కేవలం రూ.3,500 కోట్లు ఖర్చు చేస్తే పూర్తయ్యేవని, కమీషన్లు, పర్సెంటేజీల కక్కుర్తితో రీఇంజనీరింగ్ చేపట్టి రెండు ప్రాజెక్టులను సమీకృతం చేసి సీతారామ ప్రాజెక్టుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నామకరణం చేసిందని ఉత్తమ్ ఆరోపించారు. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.18,286 కోట్లకు పెంచి ఐదింతలు చేసిందని మండిపడ్డారు. రాజీవ్ సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టుల ద్వారా 4లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేదని, సీతారామ ప్రాజెక్టు అంచనా వ్యయం ఐదింతలు పెంచినా ఆయకట్టు 3.29లక్షల ఎకరాలకు తగ్గిందన్నారు. పంప్‌హౌస్‌ల విద్యుత్ వినియోగ సామర్థ్యాన్ని 349 మెగావాట్ల నుంచి 694 మెగావాట్లకు, సేకరించాల్సిన భూములను 2,482 ఎకరాల నుంచి 3,656 ఎకరాలకు పెంచడంతో ఆర్థికభారం పెరిగినా ఒక్క ఎకరా ఆయకట్టు పెరగలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి సీతారామ ప్రాజెక్టుపై రూ.7,436 కోట్ల వ్యయంతో 39శాతం పనులను మాత్రమే పూర్తి చేసిందని, 90శాతం పనులు పూర్తిచేశామని హరీశ్‌రావు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు సాధించినట్టు హరీశ్ చెప్పుకోవడంలో వాస్తవం లేదన్నారు. ప్రాజెక్టు వ్యయ అంచనాలు, బెనిఫిట్ కాస్ట్ రేషియోలకు సైతం తామే అనుమతులు తీసుకొచ్చామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు పనులను 2026 ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామన్నారు. త్వరలో జరగనున్న గోదావరిబోర్డు సమావేశంలో ప్రాజెక్టుకు ఆమోదం లభిస్తే..తదుపరి సీడబ్ల్యూసీలోని టెక్నికల్ అడ్వైజరీ కమిటీ(టీఏసీ) అనుమతి కోసం డీపీఆర్ వెళుతుందని, దీంతో ప్రాజెక్టుకు అనుమతులు లభించినట్టేనని ప్రకటించారు.

కమీషన్లు వచ్చే పనులే చేశారు : పొంగులేటి

హరీశ్‌రావు చెప్పుకున్నట్టు సీతారామ ప్రాజెక్టు మోటార్లను బీఆర్ఎస్ ప్రభుత్వమే బిగించిందని, మోటార్లకు ఎక్కువ కమీషన్లు, లాభాలు వస్తాయనే ఆ పనులు చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. రూ.430 కోట్ల విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని గత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు మోటార్ల డ్రై రన్ నిర్వహించలేదన్నారు. ఖమ్మం జిల్లాపై ఎంత ప్రేమ ఒలకబోసినా జిల్లా ప్రజలు బీఆర్ఎస్ నేతల మాటలను నమ్మరని స్పష్టం చేశారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో ఆ పార్టీకి జిల్లా ప్రజలు ఒకటే సీటు ఇచ్చారని, ఇకపై ఆ ఒక్క సీటు ఇవ్వబోరని తెలిపారు. నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టుల పనులను దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 75% పూర్తి చేస్తే ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ తామే చేసినట్టు పత్రికల్లో యాడ్స్ జారీ చేసిందన్నారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల అవసరాలకు సాగర్ టెయిల్‌పాండ్‌లోకి గోదావరి నీళ్లను ఎత్తిపోయాలని వైఎస్ ప్రభుత్వం నాడే నిర్ణయం తీసుకుందని, దీనిని కొత్తగా హరీశ్‌రావు సూచించాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కీర్తిప్రతిష్టల కోసం పాకులాడలేదు

- లక్షలాది ఎకరాలకు గోదావరి జలాలను అందించడమే లక్ష్యం
- వైఎస్సార్ నా అభిమాన నాయకుడు
- భావోద్వేగంతో మాట్లాడిన తుమ్మల



ఖమ్మం వన్‌టౌన్: 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఏనాడూ తాను కీర్తి ప్రతిష్టల కోసం పాకులాడలేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీతారామ ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని చెబుతూ మంగళవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షలాది ఎకరాలను గోదావరి జలాలతో తడిపి సస్యశ్యామలం చేయడమే లక్ష్యం తప్ప తనకు స్వార్థ రాజకీయాలు లేవన్నారు. తాను నీటిపారుదల మంత్రిగా ఉన్నప్పుడు బడ్జెట్ తక్కువగా ఉండడంతో అప్పటి అవసరాల దృష్ట్యా దేవాదుల ప్రాజెక్టు నిర్మించాల్సి వచ్చిందన్నారు. అదే సమయాన దుమ్ముగూడెం వద్ద ప్రాజెక్టు నిర్మించాలని చెబితే అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర రెడ్డి దుమ్ముగూడెం ప్రాజెక్టును ఇందిరాసాగర్–రాజీవ్‌సాగర్ పేరుతో విభజించారని గుర్తు చేశారు. దురదృష్టవశాత్తు తన అభిమాన నాయకుడైన వైఎస్సార్ మృతితో ప్రాజెక్టు కుంటుపడిందన్నారు. విపక్ష నేతలు గోదావరి నీళ్లు చల్లుకోవాలనుకుంటే ఈనెల 15న వైరాకు రావాలని, అక్కడ వారి తప్పులు చెప్పి నీళ్లు చల్లే బాధ్యత తాను తీసుకుంటానని తుమ్మల వ్యాఖ్యానించారు.

ఇళ్లులేని పేదలకు పీఎంఏవై ఫలాలు అందాలి

ఆ మేరకు సహకరించండి
- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ
- గత ప్రభుత్వంలా వ్యవహరించొద్దని సూచన



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని పేదలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) ఫలాలను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం అందించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం కిషన్‌రెడ్డి సీఎం రేవంత్‌కి లేఖ రాశారు. సొంతిల్లు అవసరమున్న ప్రజలు లక్షలాదిమంది ఉన్నా.. 2018లో కేంద్ర ప్రభుత్వం ఇళ్ల కోసం నిర్వహించిన సర్వేలో గత ప్రభుత్వం భాగం కాలేదని, జాబితా కూడా పంపలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేద ప్రజలకు ఆశ చూపించి మభ్యపెట్టిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సహకారం తెలంగాణ ప్రజలకు అందకుండా అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో తాను చేపట్టిన పర్యటనల్లో చాలా మంది ప్రజలు సొంతింటి నిర్మాణం కోసం అభ్యర్థించారని తెలిపారు. ఇదే విషయాన్ని ఈనెల 9న జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లగా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన ప్రతిపాదనలు వస్తే ఇళ్లను కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారని కిషన్‌రెడ్డి వివరించారు. ఈ విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ వహించి, కేంద్ర ప్రభుత్వం ఇళ్ల కోసం నిర్వహించనున్న సర్వేలో పాల్గొనాలని కోరారు. గ్రామీణ తెలంగాణలో సొంతిల్లు అవసరం ఉన్న పేద కుటుంబాల జాబితాను వీలయినంత త్వరగా తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి అందించాలని సూచించారు. ఆ మేరకు సంపూర్ణ సహకారం అందిస్తారని కోరుకుంటున్నట్లు రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

విద్యారంగంపై వాళ్లది నేరమయ నిర్లక్ష్యం

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కిషన్‌రెడ్డి ధ్వజం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యారంగంపై కాంగ్రెస్, గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు నేరమయ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి,, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తాజాగా ప్రకటించిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో... రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యంలో నిర్వహించే విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల పనితీరు బయటపడిందని వివరించారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఉస్మానియాకు 70వ ర్యాంకా?

'ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ ఓవరాల్ విభాగంలో.. ఉస్మానియా వర్సిటీ 70వ ర్యాంకుతో సరిపెట్టుకుంది. కొన్నేళ్లుగా ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకోవడం అటుంచితే, ఉన్న స్థానాన్ని నిలబెట్టుకోవడంలోనూ విఫలమై మన యూనివర్సిటీలు దిగజారుతున్నాయి. కళాశాల విభాగంలో టాప్ 100లో తెలంగాణ నుంచి ఒక్క కాలేజీకీ స్థానం దక్కలేదు.'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితైతే మరింత అధ్వానంగా ఉంది. ఐటీ క్యాపిటల్‌గా చెప్పుకునే తెలంగాణలో పాఠశాలల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ సదుపాయం లేదు.. 24వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా పెట్టారంటే పేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలపై వీరికున్న ప్రేమేంటో అర్థమవుతోంది''అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

ఢిల్లీలో పోరాటం... రాష్ట్రంలో రెడ్ కార్పెటా?

- అదానీ–సెబీ ఆరోపణల వ్యవహారంపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ప్రశ్నించిన కేటీఆర్
- అదానీతో దేశానికి నష్టమైనప్పుడు.. తెలంగాణకు ఎలా లాభమో చెప్పాలి



సాక్షి, హైదరాబాద్: హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ–సెబీ ఆరోపణలపై దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చిన కాంగ్రెస్ పార్టీ, తాము అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం అదే కంపెనీకి స్వాగతం పలకడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. అదానీ విషయంలో జాతీయ కాంగ్రెస్‌కు ఒక నీతి..రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు మరో నీతా? అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. ఒకవైపు అదానీ–సెబీ ఆరోపణలపై జేపీసీ వేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిస్తుంటే, ఇక్కడ కాంగ్రెస్ ముఖ్యమంత్రేమో అదానీకి స్వయంగా రెడ్ కార్పెట్ పరుస్తూ ఆయన కంపెనీకి ద్వారాలు తెరుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఏకంగా అదానీకే అప్పగిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. 'మీరు అదానీ–సెబీ ఆరోపణలపై దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిస్తే.. అదానీ–కాంగ్రెస్ మిలాఖాత్‌పైనా, లోపాయికారీ ఒప్పందాలపైనా తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ప్రశ్నిస్తున్నారు'అని రాహుల్‌గాంధీని ఉద్దేశించి కేటీఆర్ స్పష్టం చేశారు. అదానీ వల్ల దేశానికి నష్టం అన్నప్పుడు.. తెలంగాణ రాష్ట్రానికి మాత్రం లాభమెలా అవుతుందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్‌లో ఈ ద్వంద్వ వైఖరి కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు అధికారమిచ్చిన పాపానికి.. తెలంగాణను అదానీకి అప్పగించాలని చూస్తే సహించమని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టే పార్టీ బీఆర్ఎస్ అనే విషయాన్ని ఎప్పటికీ గుర్తుపెట్టుకోవాలని కేటీఆర్ హెచ్చరించారు.

బాన్సువాడ ఉప ఎన్నిక ఖాయం: కేటీఆర్

బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నిక ఖాయమని, పార్టీ మారిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెపుతారని కేటీఆర్ అన్నారు. పోచారంను అన్ని విధాలా గౌరవించినా కార్యకర్తల రెక్కల కష్టంపై గెలిచి స్వార్థం కోసం పార్టీని వీడారన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు మంగళవారం నందినగర్ నివాసంలో కేటీఆర్‌ను కలిశారు. కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేసిన వారిని వదిలిపెట్టేది లేదని కేటీఆర్ అన్నారు. త్వరలో మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఇతర నేతలతో కలిసి తాను బాన్సువాడలో పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. కాగా, గురుకుల పాఠశాలల్లో సమస్యలపై ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం సంతోషకరమైన అంశమని కేటీఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

... మళ్లీ భూసర్వే

▶ మొదటి పేజీ తరువాయి

ఉంటుంది. సందేహాలకు అధికారికంగా జవాబు ఇచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో 'ఆర్‌వోఆర్–2024' ముసాయిదా చట్టంలోని అంశాలపై ప్రజల నుంచి ఎక్కువగా వస్తున్న సందేహాలను 'సాక్షి' సేకరించింది. వాటిని భూచట్టాల నిపుణుడు ఎం.సునీల్‌కుమార్, ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డితోపాటు కొందరు రెవెన్యూ అధికారుల ముందుపెట్టి.. ఆయా సందేహాలకు సమాధానాలను రాబట్టింది. ఆ సందేహాలు, సమాధానాలు ఇవీ..

సందేహం: కొత్త ఆర్‌వోఆర్ చట్టం తేవాల్సిన అవసరమేంటి?
సమాధానం: ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం లోపభూయిష్టంగా ఉంది. చాలా సమస్యలకు అందులో పరిష్కారం లేదు. సాదాబైనామాల పరిష్కార నిబంధన లేదు. అప్పీలు వ్యవస్థ లేదు. రికార్డులో ఏ సమస్య వచ్చినా కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి. ధరణి పోర్టల్‌లో సవరణలు చేసే అధికారాన్ని కూడా ఆ చట్టం ఎవరికీ కల్పించలేదు. ధరణి సవరణలకు చట్టబద్ధత కావాలంటే చట్టం మారాల్సిందే.

ధరణి సమస్యలను ఈ చట్టం ఎలా పరిష్కరిస్తుంది?
ధరణి పోర్టల్‌లో చేర్చకుండా పార్ట్–బీ పేరిట పక్కన పెట్టిన భూములను రికార్డుల్లోకి ఎక్కించడానికి కొత్త చట్టంలో నిబంధన ఉంది. దాదాపు 18 లక్షల ఎకరాల భూమికి ఈ చట్టం ద్వారా మోక్షం కలుగుతుంది. ధరణిలో చేర్చిన తర్వాత నమోదైన తప్పుల సవరణకు కూడా చట్టబద్ధత ఏర్పడుతుంది.

రైతుల వద్ద ఉన్న పాస్‌బుక్‌లు రద్దవుతాయా?
రద్దు కావు. ప్రస్తుతమున్న ధరణి రికార్డు కొనసాగుతుంది. కానీ తప్పొప్పులను సవరించవచ్చు. భవిష్యత్తులో ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టి, కొత్త రికార్డు తయారు చేయాలనుకుంటే మాత్రం కొత్త రికార్డుతోపాటు కొత్త పాస్‌బుక్‌లు వస్తాయి. ముసాయిదా చట్టంలో ఈ మేరకు నిబంధన ఉంది.

'ధరణి' స్థానంలో భూమాత పోర్టల్ వస్తుందా?
ధరణి పోర్టల్ స్థానంలో కొత్త పోర్టల్ వస్తుంది. అయితే భూమాత అనే పేరు ఏదీ ముసాయిదా చట్టంలో లేదు. ధరణి అనేది ఆర్‌వోఆర్ రికార్డు నిర్వహించే పోర్టల్. ఈ పోర్టల్ స్థానంలో కొత్త పోర్టల్ వస్తుంది.ప్రభుత్వం ఇష్ట ప్రకారం ఏ పేరైనా పెట్టవచ్చు.

ఇప్పుడు జరుగుతున్న రిజిస్ట్రేషన్ వ్యవస్థలో ఎలాంటి మార్పులొస్తాయి?
స్లాట్ బుకింగ్ కొనసాగుతుంది. కానీ రిజిస్ట్రేషన్ అనంతరం మ్యుటేషన్ ప్రక్రియలో కొన్ని మార్పులుంటాయి.

ఆటోమేటిక్ మ్యుటేషన్ రద్దు అవుతుందా?
పాత చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ జరిగితే ఆటోమేటిగ్గా మ్యుటేషన్ జరిగిపోతుంది. కొత్త చట్టం ముసాయిదా ప్రకారం ఈ మ్యుటేషన్ ఆగిపోదు. కానీ సరైన కారణాలుంటే మ్యుటేషన్ నిలిపేయవచ్చు. డబుల్ రిజిస్ట్రేషన్లకు, మోసపు లావాదేవీలకు ఈ నిబంధనతో చెక్ పడుతుంది. వారసత్వం, భాగం పంపకాలు, కోర్టు కేసులు, ఇతర మార్గాల్లో వచ్చే భూములపైనా విచారణ జరిపి మ్యుటేషన్ చేస్తారు.

ఈ చట్టం అమల్లోకి వస్తే భూముల సర్వే మళ్లీ నిర్వహిస్తారా?
భూములను మళ్లీ సర్వే చేయాలనే చట్టం చెబుతోంది. ముసాయిదా చట్టం ప్రకారం భూఆధార్ కార్డు జారీ చేయాలంటే సర్వే చేయాల్సిందే. తాత్కాలిక భూఆధార్ ఇవ్వాలన్నా రికార్డుల ప్రక్షాళన చేయాల్సిందే. భూఆధార్ కార్డు ఇవ్వాలా, వద్దా అన్నది ప్రభుత్వ అభీష్టం. ఈ మేరకు చట్టంలోని నిబంధనల్లో వెసులుబాటు ఉంది.

ఈ చట్టం వస్తే మళ్లీ పహాణీ రాస్తారా?
పహాణీలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్న నిబంధన 1971 చట్టంలో ఉంది. కానీ 2020లో తొలగించారు. మళ్లీ ఇప్పుడు అప్‌డేట్ చేసే నిబంధన పెట్టారు. ముసాయిదాలోని సెక్షన్ 13 దీని గురించే చెబుతోంది.

ఈ చట్టంతో అసైన్డ్ భూములకు హక్కులు వస్తాయా?
ఆర్‌వోఆర్ చట్టం అన్ని సమస్యలకు పరిష్కారం చూపదు. అసైన్డ్ భూములకు పట్టా హక్కు కావాలంటే మారాల్సింది ఆర్‌వోఆర్ చట్టం కాదు.. పీవోటీ చట్టం. కాబట్టి ఈ చట్టం ద్వారా అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు రావు.

కౌలు రైతుల పేర్లు నమోదు చేస్తారా?
కౌలుదారుల నమోదు ప్రక్రియ కూడా ఆర్‌వోఆర్ చట్టం పరిధిలోకి రాదు. కౌలుదార్ల చట్టం–1950, రుణ అర్హత కార్డుల చట్టం– 2011 ప్రకారం కౌలుదారుల నమోదు జరుగుతుంది. ఆ చట్టాల పరిధిలో కౌలుదారుల గుర్తింపు జరుగుతుంది.

ఈ చట్టం ప్రకారం కాస్తు కాలం నమోదు ఉంటుందా?
1996లో గ్రామ రెవెన్యూ లెక్కల నిర్వ హణ గురించి ప్రత్యేక జీవో వచ్చింది. ఆ జీవో ప్రకా రం పహాణీల నిర్వహణ ఉంటుంది. ఆర్‌వోఆర్ చట్టం పరిధిలోకి ఈ అంశం రాదు. కాస్తు కాలం ఉంచాలా, వద్దా అన్నదానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చు.

ఈ చట్టం ద్వారా టైటిల్ గ్యారంటీ ఇస్తారా?
కొత్త చట్టానికి ల్యాండ్ టైటిల్‌కు సంబంధం లేదు. ఈ చట్టం హక్కులకు స్పష్టత మాత్ర మే ఇస్తుంది. టైటిల్ గ్యారంటీ ఇచ్చేది వేరే చట్టం.

మ్యుటేషన్ సమయంలో మ్యాప్ కావాలన్న నిబంధన రైతులను ఇబ్బంది పెట్టేది కాదా?
ఆర్‌వోఆర్ చట్టంలోని అన్ని నిబంధనలు వెంటనే అమల్లోకి వచ్చేవి కాదు. కొన్ని వెంటనే అమల్లోకి వస్తే.. మరికొన్ని భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పొందుపర్చినవి. ఈ మ్యాప్ నిబంధన అమలు విషయంలో ప్రభుత్వానికి సమయం ఉంటుంది. వ్యవస్థ పూర్తిస్థాయిలో ఏర్పాటైన తర్వాతే అమల్లోకి వస్తుంది. ఒకవేళ మ్యాప్ నిబంధన అమల్లోకి రావాలంటే సర్వేయర్ల వ్యవస్థను పటిష్టం చేయాల్సి ఉంటుంది.

(సాదాబైనామాలు, భూఆధార్‌కార్డులు, కోర్టులు, అప్పీళ్లు, ట్రిబ్యునళ్ల ఏర్పాటుకు సంబంధించిన సమాచారం రేపటి సంచికలో..)

21, 22 తేదీల్లో ఇంజనీరింగ్ సీట్ల మార్పిడి

- స్లైడింగ్‌కు 2 రోజుల పాటు అవకాశం
- గతంలో ఈ అవకాశం కాలేజీలకే
- ఇప్పుడు తొలిసారిగా సాంకేతిక విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో
- 3 వేల సీట్లల్లో మార్పిడికి చాన్స్
- వెంటనే స్పాట్ అడ్మిషన్లు
- ఈ నెలాఖరు నుంచి ఇంజనీరింగ్ క్లాసులు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీ సీట్ల మార్పిడి (స్లైడింగ్)కి ఈ నెల 21, 22 తేదీల్లో అవకాశం కల్పించాలని సాంకేతిక విద్య విభాగం నిర్ణయించింది. స్లైడింగ్ ప్రక్రియను ప్రతీ ఏటా కాలేజీలే చేపట్టేవి. ఈసారి సాంకేతిక విద్య కమిషనరేట్ దీన్ని నిర్వహిస్తోంది.స్లైడింగ్ పేరుతో ప్రైవేటు కాలేజీలు కొన్నేళ్ళుగా సాగిస్తున్న సీట్ల వ్యాపారానికి చెక్ పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. తుది విడత సీట్లను సోమవారం కేటాయించారు. ఇంకా 5,039 సీట్లు మిగిలిపోయాయి. స్లైడింగ్ తర్వాత మిగిలిపోయే సీట్లను కలుపుకుని స్పాట్ అడ్మిషన్లు చేపట్టాలని నిర్ణయించారు. మొత్తం మీద ఈ నెలాఖరుకు కౌన్సెలింగ్ ముగించుకుని ఇంజనీరింగ్ క్లాసులు మొదలు పెట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

స్లైడింగ్‌కు 3 వేల సీట్లు

జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు వచ్చిన వాళ్ళు రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు వదులుకుంటారు. అలాగే తుది దశ కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటా కింద ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు వచ్చిన విద్యార్థులు ప్రైవేటు కాలేజీల్లో సీట్లు వదులుకుంటారు. ఈ రకంగా తుది దశ కౌన్సెలింగ్ నాటికి ప్రతీ ఏటా దాదాపు 3 వేల మంది స్లైడింగ్ ద్వారా సీట్లు మారుతుంటారు. కాలేజీలో తుది దశ కౌన్సెలింగ్‌లో సీట్లు వచ్చిన వాళ్ళు ఈ నెల 17 నాటికి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. ఇలా చేయని పక్షంలో ఆ సీటును ఖాళీ అయినట్టుగా ప్రకటిస్తారు. విద్యార్థులు సీట్లు రద్దు చేసుకున్నా వాటినీ ప్రకటించాల్సి ఉంటుంది. అప్పటికే ఆ కాలేజీలో చేరిన విద్యార్థులు నచ్చిన బ్రాంచీలో ఖాళీలుంటే స్లైడింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ప్రైవేటు కాలేజీలు ర్యాంకర్ల చేత తొలి దశలోనే కౌన్సెలింగ్‌లో పాల్గొనేలా చేసేవి. తుది దశ ముగిసిన తర్వాత సీటు రద్దు చేసుకునేలా చేసేవి. ఈ సీటును స్లైడింగ్ ప్రక్రియలో ఎక్కువ రేటు పెట్టి ఇతర బ్రాంచీల్లో ఉన్నవారికి అమ్ముకునేవి. ఇప్పుడు ప్రభుత్వమే స్లైడింగ్ చేపట్టడం వల్ల ఆ అవకాశం ఉండే వీల్లేదు.

స్పాట్‌లో కంప్యూటర్ సీట్లు కష్టమే

ఈ ఏడాది కంప్యూటర్, అనుబంధ బ్రాంచీల్లో సీట్లు పెద్ద ఎత్తున భర్తీ అయ్యాయి. స్పాట్ అడ్మిషన్లలో ఈ సీట్లు పొందే అవకాశాలు తక్కువనే అధికారులు అంటున్నారు. గత ఏడాది సీట్లు పెద్ద ఎత్తున మిగిలిపోయాయి. జేఈఈ కౌన్సెలింగ్ ఇప్పటికే ముగిసింది. దీంతో జాతీయ కాలేజీల్లో సీట్లు వచ్చిన విద్యార్థులు రాష్ట్ర కాలేజీల్లో మొదటి, రెండో దశ కౌన్సెలింగ్ తర్వాత మళ్ళీ రాష్ట్ర కాలేజీలకు దరఖాస్తు చేయలేదు. గత ఏడాది అన్ని బ్రాంచీల్లో కలిపి తుది దశ కౌన్సెలింగ్ తర్వాత 19,154 సీట్లు మిగిలిపోయాయి. ఈ ఏడాది మాత్రం 5,039 సీట్లు మాత్రమే మిగిలాయి. కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లో 2023లో తుది దశ కౌన్సెలింగ్‌లో 5,723 సీట్లు మిగిలితే... ఈ ఏడాది తుది దశ కౌన్సెలింగ్ నాటికి కేవలం 1,225 సీట్లు మిగిలాయి. ఇవి కూడా మారుమూల ప్రాంతాల కాలేజీల్లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎక్కువగా ఆశించే కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లో స్పాట్ అడ్మిషన్లలో పెద్దగా సీట్లు వచ్చే అవకాశం కన్పించడం లేదు.

గురుకుల విద్యార్థినికి అండగా సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: గురుకుల పాఠశాల భవనం పైనుంచి కిందపడి తీవ్ర గాయాలపాలైన విద్యార్థిని కొయ్యడ కార్తీకకు సీఎం రేవంత్‌రెడ్డి అండగా నిలిచారు. సీఎం సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో కార్తీకకు వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం కార్తీక కోలుకుంటోంది. ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కార్తీక ఈ నెల 9న ప్రమాదవశాత్తు స్కూల్ మూడో అంతస్తు నుంచి పడిపోయింది. దీంతో విద్యార్థిని నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. నిమ్స్ న్యూరో సర్జన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమల్ బృందం మంగళవారం కార్తీకకు ఆపరేషన్ నిర్వహించింది. ప్రస్తుతం విద్యార్థిని కోలుకుంటున్నట్లు డాక్టర్లు తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు నిమ్స్ డైరెక్టర్ బీరప్పతో మాట్లాడి కార్తీక కోలుకునేంత వరకు వైద్యం అందించాలని సూచించారు.

తెలంగాణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా వెంకటస్వామి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా యడవల్లి వెంకటస్వామి నియమితులయ్యారు. తెలంగాణతో పాటు మొత్తం తొమ్మిది రాష్ట్రాలకు ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎండీఎస్ సీట్ల వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ఎండీఎస్ కన్వీనర్ కోటా మొదటి విడత సీట్ల భర్తీకి వెబ్ ఆప్షన్ల నమోదు మంగళవారం ప్రారంభమైంది. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని కాళోజీ ఆరోగ్య వర్సిటీ అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు http://knruhs.telangana. gov.in చూడాలని సూచించారు.

డీఎస్సీ 'కీ', రెస్పాన్స్ షీట్ విడుదల

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ–2024)కు సంబంధించిన 'కీ', రెస్పాన్స్ షీట్‌ను పాఠశాల విద్య డైరెక్టరేట్ మంగళవారం విడుదల చేసింది. www.schooledu.telangana.gov.in అనే సైట్‌లో ఈనెల 20 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది. అభ్యంతరాలుంటే ఇదే వెబ్‌సైట్ ద్వారా తెలియజేయాలి. అభ్యర్థుల పేరు, పుట్టిన తేదీ, కులం, ఈడబ్ల్యూఎస్, ఇటీవల టెట్‌లో సాధించిన స్కోర్‌లో సవరణలు ఉంటే helpdesktsdsc2024@gamil.comకు తగిన ఆధారాలతో 20వ తేదీ సాయంత్రం 5 గంటలకల్లా పంపాలని పేర్కొంది.

ఇద్దరు జీఎస్టీ అధికారులపై సీబీఐ కేసు

సాక్షి, హైదరాబాద్: జీఎస్టీ ట్యాక్స్‌లు విధిస్తామంటూ బెదిరించి ఒకరి నుంచి రూ.5 లక్షలు వసూలు చేసిన ఆరోపణలపై జీఎస్టీ హైదరాబాద్ కమిషనరేట్‌లో ఇద్దరు అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. బషీర్‌బాగ్‌లోని జీఎస్టీ భవన్‌లోని ప్రిన్సిపల్ కమిషనరేట్ ఆఫ్ సెంట్రల్ ట్యాక్స్‌లో సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఇద్దరు అధికారులు ఒకరిని వేధించి రూ.5 లక్షలు వసూలు చేసినట్టు సీబీఐ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. జీఎస్టీ పన్నులు విధిస్తామని బెదిరించడంతోపాటు బాధితుడి స్క్రాప్ దుకాణాన్ని సదరు అధికారులు సీజ్ చేశారని తెలిపారు. ఈనెల 4న రూ.5 లక్షలు తీసుకున్నారని, మరో రూ.3 లక్షలు ఇస్తేనే దుకాణం తెరిచేందుకు అనుమతిస్తామని హెచ్చరించినట్టు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారులు హైదరాబాద్‌లోని రెండు ప్రాంతాల్లో సోదాలు చేసి, పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నట్టు పేర్కొన్నారు.

సెప్టెంబర్ మొదటివారంలో చేపపిల్లల ఉచిత పంపిణీ

84 బిడ్స్ దాఖలు చేసిన కాంట్రాక్టర్లు ● నెలాఖరుకు టెండర్ల ఖరారు

సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ మొదటివారంలోనే రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, జలాశయాలు, రిజర్వాయర్లలో ఉచితంగా చేపపిల్లలు విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. చేపపిల్లల పంపిణీకి సంబంధించి మంగళవారం 84 మంది కాంట్రాక్టర్లు బిడ్స్ దాఖలు చేశారు. ఈ బిడ్స్‌ను ఈనెల 20లోపు పరిశీలిస్తామని, నెలాఖరుకు టెండర్లు ఖరారు చేస్తామని అధికారులు వెల్లడించారు.

కుదిరిన ఒప్పందం: గతంలో ఇవ్వాల్సిన బకాయిలు త్వరలోనే చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన తర్వాతే కాంట్రాక్టర్లు బిడ్స్ దాఖలుకు ముందుకొచ్చినట్టు సమాచారం. గత ఏడాది రూ.80 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గత సంవత్సరం జరిగిన అవకతవకలు ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ జరగడానికి వీల్లేదని, నాణ్యతలేని చేపపిల్లలను కట్టబెడితే చర్యలు తీసుకుంటామని అధికారులు కాంట్రాక్టర్లకు చెప్పినట్టు తెలిసింది. ఈసారి ఎలాంటి పొరపాట్లు జరగవని వారు హామీ ఇచ్చినట్టు సమాచారం. నాసిరకంగా ఉన్న చేపపిల్లలు పంపిణీ చేస్తే బ్లాక్ లిస్టులో పెడతామని అధికారులు హెచ్చరించినట్టు తెలిసింది.



'నేను', 'నాది' అనే భావనను విడిచిపెట్టడం ద్వారా వెతుకులాట లేని నిజమైన సంతోషాన్ని పొందగలం.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 14 ఆగస్టు 2024

సీబీఐ దర్యాప్తే సరైంది!

దేశవ్యాప్తంగా వైద్యవర్గాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు రగిల్చిన కోల్‌కతా వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రి ఉదంతంపై సీబీఐ దర్యాప్తునకు కోల్‌కతా హైకోర్టు మంగళవారం ఆదేశాలివ్వటం అన్ని విధాలా సబబైనది. జూనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్న పీజీ విద్యార్థిని మొన్న శుక్రవారం వేకువ జామున ఒక దుండగుడి అఘాయిత్యానికి బలైంది. ఈ కేసు విషయంలో గత అయిదురోజులుగా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో సందేహాలు తీర్చకపోగా... మరిన్ని అనుమానాలకు తావిచ్చింది. దుండగుడిని అరెస్టు చేశామంటున్న పోలీసుల ప్రకటనపై అటు మెడికో కుటుంబ సభ్యులు, ఇటు వైద్య విద్యార్థులు, సిబ్బంది సంతృప్తి చెందలేదు. హత్య, అత్యాచారం ఉదంతంలో కచ్చితంగా ఇతరుల ప్రమేయం ఉందని మొత్తుకున్నారు. కానీ పోలీసులు పట్టనట్టే ఉన్నారు. అసలు ఆస్పత్రి పాలకవర్గం, లేదా ప్రిన్సిపాల్ ఇంతవరకూ ఈ ఉదంతంలో ఫిర్యాదు దాఖలు చేయలేదు. కనీసం వారిని పిలిచి ప్రశ్నించినవారూ లేరు. ఆరు రోజుల్లో... అంటే వచ్చే ఆదివారంలోగా నిగ్గు తేల్చకపోతే కేసును సీబీఐకి అప్పగిస్తానని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హెచ్చరించారు. కానీ హైకోర్టు భిన్నంగా ఆలోచించింది. ఇందులో జాప్యం జరిగినకొద్దీ సాక్ష్యాధారాలు మాయమవుతాయని, దోషులు తప్పించుకునే అవకాశం ఉన్నదని భావించింది.

కొన్ని నేరాలు సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తాయి. మనుషులుగా అసలు మన ఉనికిపైనే సందేహం రేకెత్తిస్తాయి. సరిగ్గా పన్నెండేళ్ల క్రితం దేశరాజధాని ఢిల్లీలో చోటుచేసుకున్న నిర్భయ ఉదంతం అటువంటిదే! ప్రజలంతా ఉద్యమించిన పర్యవసానంగా ఆ విషయంలో నాటి కేంద్ర ప్రభుత్వం చురుగ్గా కదిలి కఠినమైన చట్టాన్ని తీసుకొచ్చింది. నేరగాళ్లకు ఉరితో సహా కఠినశిక్షలు అమలుచేసింది. కానీ ఆ తర్వాత కూడా నేరాలు తగ్గలేదు. దీనికి కారణం కేవలం ప్రభుత్వాల అలసత్వం మాత్రమే! నేరగాళ్లను వెనువెంటనే శిక్షించేలా పకడ్బందీ దర్యాప్తు జరగకపోవటం అన్నిచోట్లా కనబడుతోంది. కేవలం చట్టాలు మాత్రమే సరిపోవనీ, వాటిపై అవగాహన కల్పించి, ఆపత్కాలంలో మహిళలు తక్షణం ఆశ్రయించే సదుపాయం అమల్లోకి తేవాలని ప్రభుత్వాలు అనుకోలేదు. తెలంగాణలో షీ టీమ్స్ అయినా, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన దిశ యాప్, దిశ చట్టమైనా మహిళలకు ఎంతో తోడ్పాటుగా నిలిచాయి. ముఖ్యంగా ఏపీలో దిశ యాప్ వల్ల నేరాలను నివారించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కోల్‌కతా ఆస్పత్రిలో ఉన్న అస్తవ్యస్త పరిస్థితి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒకపక్క దేశవ్యాప్తంగా లైంగిక నేరాలు పెరిగాయని తెలుస్తూనే ఉన్నా మహిళా సిబ్బంది భద్రతకూ, రక్షణకూ ఆస్పత్రి ఎలాంటి చర్యలూ తీసుకోలేదని అక్కడి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. నేరగాడు సంజయ్ రాయ్ పోలీస్ వలంటీర్‌గా ఉంటూ ఆస్పత్రిలో ఎక్కడికైనా యథేచ్ఛగా వెళ్తాడని అందరూ చెబుతున్న మాట. ఆఖరికి మహిళా వైద్య సిబ్బంది విశ్రాంతి తీసుకునే ప్రాంతానికి కూడా నిశిరాత్రి అతగాడు వెళ్లగలిగాడంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ జూనియర్ డాక్టర్ 36 గంటలు అవిశ్రాంతంగా రోగులకు సేవలందించి అలసి నిదురిస్తున్న వేళ నేరగాడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని తోటి సిబ్బంది అంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినప్పుడు సేవలందించటానికి నమోదు చేసుకున్న నేరగాడికి ఆస్పత్రిలో సంచరించే స్వేచ్ఛ ఎవరిచ్చారో తేలాల్సివుంది. గర్భిణి అయిన భార్యను హింసించిన ఉదంతంలో వచ్చిన ఫిర్యాదుపై రెండేళ్లుగా పోలీసులు పట్టించుకోలేదంటే అతగాడి పలుకుబడిని అంచనావేయొచ్చు. అప్పుడే చర్య తీసుకుంటే ఈ ఘోరం జరిగేదా? తమ కుటుంబాల్లో వైద్య అవసరాలున్నప్పుడల్లా ఆస్పత్రిలో అన్నీ అందేలా చూస్తున్నాడన్న ఏకైక కారణంతో పోలీసులు అతడిని చూసీచూడనట్టు వదిలేశారని చాలామంది చెబుతున్న మాట. తాము తీసుకున్న వలంటీర్ల నడవడి ఎలావుంటున్నదో, వారిని కొనసాగించాలో లేదో సమీక్షించుకునే సంస్కృతి లేకపోవటం ఎటువంటి ఘోరాలకూ, నేరాలకూ దారితీస్తుందో అంచనా వేయలేనంత స్థితిలో పోలీసులుండటం ఆశ్చర్యకరం. నిజానికి లోతైన దర్యాప్తు జరిగితే తమ లోపాలు కూడా బయటపడతాయన్న ఏకైక కారణంతోనే గత అయిదురోజులుగా కోల్‌కతా పోలీసులు దర్యాప్తు డ్రామా కొనసాగిస్తున్నారనుకోవాలి.

చదువు పూర్తయ్యాక ఇతర రంగాల్లో వెనువెంటనే స్థిరపడే అవకాశం ఉన్నా దాన్ని కాదనుకుని పలువురు విద్యార్థులు ఎన్నో సవాళ్లతో కూడిన, దీర్ఘకాలం పట్టే వైద్యవిద్యకు మొగ్గుచూపుతారు. సమాజం పట్లా, మనుషుల పట్లా ఎంతో సేవాభావం, ప్రేమ ఉంటే తప్ప ఇది సాధ్యంకాదు. కానీ అలాంటివారికి ఆ రంగంలో సరైన గౌరవ మర్యాదలు లభిస్తున్నాయా? వారి భద్రతకు సక్రమమైన చర్యలు తీసుకుంటున్నారా? ఈ విషయంలో జూనియర్ డాక్టర్లు తరచు చెప్పే అంశాలు అంత సంతృప్తికరంగా లేవు. వారి శ్రమకు తగ్గ వేతనాలు అందవు. అవి కూడా నిర్దిష్ట సమయానికి రాని దుఃస్థితి చాలాచోట్ల ఉంటున్నది. వేళకాని వేళల్లో సైతం అవిశ్రాంతంగా పనిచేసేవారికి కనీసం కాసేపయినా భద్రంగా నిద్రపోయే సౌకర్యం ఆస్పత్రి పాలకవర్గం కల్పించలేకపోయిందంటే, ఆ విషయంలో సీనియర్లు శ్రద్ధ పెట్టలేదంటే ఏమనుకోవాలి? పెత్తనం చలాయించటానికి ఉబలాటపడేవారు తాము కూడా ఒకప్పుడు జూనియర్లమనీ, వారిని కంటికి రెప్పలా చూసుకోవాలనీ భావించకపోవటం విషాదం. సహ సిబ్బంది పట్లా, వారి దురవస్థలపట్లా సహానుభూతి లేనివారి వల్లే ఇలాంటి దురంతాలు చోటు చేసుకుంటున్నాయి. కోల్‌కతా ఆస్పత్రి ఉదంతమైనా అటువంటి వారి కళ్లు తెరిపించాలి. వైద్యసిబ్బంది రక్షణకూ, భద్రతకూ దేశవ్యాప్తంగా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
శ్రావణ మాసం, తిథి: శు.దశమి పూర్తి (24 గంటలు),
నక్షత్రం: అనూరాధ ఉ.8.57 వరకు, తదుపరి జ్యేష్ఠ.
వర్జ్యం: ప.2.47 నుండి 4.23 వరకు,
దుర్ముహూర్తం: ఉ.11.40 నుండి 12.28 వరకు,
అమృతఘడియలు: రా.12.46 నుండి 2.24 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం: 6.24
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ధిక్కారానికి ఇది మూల్యమా?

ప్యారిస్ ఒలింపిక్స్‌లో దేశం సాధించిన పతకాల కన్నా వినేశ్ ఫోగట్‌కు అక్కడ ఎదురైన అనూహ్య పరిణామం అందరినీ ఖిన్నులను చేసింది, స్వాభిమానంతో క్రీడాపెద్దలకు ఎదురొడ్డి నిలవడమే ఈ అపరాజిత చేసిన నేరమా? క్రీడా రంగం నుంచి సినీ, రాజకీయ, మీడియా రంగాల దాకా ప్రతిచోటా ప్రశ్నించే మహిళలను పితృస్వామ్య భావజాలం తొక్కేస్తూనే ఉంది.

అభిప్రాయం



సాగరికా ఘోష్

ప్యారిస్‌లో భారత్ సాగించిన 2024 ఒలింపిక్ ప్రయాణంలో సాధించిన పతకాలను చాలా తక్కువగానే గుర్తుంచుకుంటాం. 2020లో టోక్యో ఒలింపిక్స్‌లో కంటే ఒక పతకాన్ని తక్కువగా భారత్ ఈ ఒలింపిక్‌లో గెల్చుకుంది. దానికంటే ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ చాంపియన్ వినేశ్ ఫోగట్ అందరికంటే ఎక్కువగా పతాక శీర్షికల్లోకి ఎక్కారు. ఫోగట్ కేవలం క్రీడాకారిణి మాత్రమే కాదు. ఒక సామాజిక పురోగతికి, కట్టుబాట్ల నుండి విముక్తికి, కఠినమైన స్వావలంబనతో కూడిన స్వతంత్ర ముద్రకు ఆమె ప్రతినిధి. పితృస్వామ్య అధికారాన్ని ధిక్కరించడానికి ఆమె ఏమాత్రం భయపడదు. దాడిని ఎదుర్కొనేందుకు భయపడదు, గట్టిగా అరుస్తూ, వీధిలో నిరసన వ్యక్తం చేయడానికి, తన లక్ష్యం కోసం తనను తాను పణంగా పెట్టడానికి ఆమె సిద్ధంగా ఉంది. కానీ తిరుగుబాటు చేసే ఇలాంటి మహిళలపై భారతీయ సామాజిక విధానాలు విరుచుకుపడుతున్నాయి. బలీయమైన వ్యవస్థీకృత శక్తులు స్త్రీలను లొంగిపోవాలని బలవంతం చేస్తాయి. కానీ ధిక్కరించే స్త్రీ ధైర్యంతో కూడిన కొత్త ట్రెండ్‌ని వినేశ్ ఫోగట్ సృష్టించారు.

మారని పితృస్వామ్య భావజాలం

నిర్భయంగా ఉంటూ, కొన్నిసార్లు ప్రకాశించే, కొన్నిసార్లు కన్నీరు కార్చే ఫోగట్ గత కొద్ది రోజులుగా మన హృదయాలను కట్టిపేశారు. ప్యారిస్‌లో ఆమెమీదే మనం దృష్టి పెట్టాం. అజేయమైన జపాన్ ప్రపంచ ఛాంపియన్ యుయి సుసాకీని ఓడించి, రెజ్లింగ్‌లో భారతదేశం మొట్టమొదటి ఒలింపిక్ బంగారు పతకాన్ని చేజిక్కించుకునే స్థాయికి వినేశ్ చేరుకున్నప్పుడు మనం సంబరాలు చేసుకున్నాం. ఆమె ఫైనల్‌కు సిద్ధమవుతున్నప్పుడు ఊపిరి పీల్చుకున్నాం. అంతు చిక్కని సాంకేతిక విషయాలపై ఆమెను అనర్హురాలిగా ప్రకటించినప్పుడు మాత్రం మనందరి ఊపిరి ఆగిపోయినంత పనయింది.

ఫైనల్స్‌కు ముందు ఆమె గడిపిన సుదీర్ఘ రాత్రి గురించి మనం తెలుసుకున్నాము. 50 కిలోల ఫైనల్‌కు అర్హత సాధించడానికి, చివరి 100 గ్రాముల బరువు కోల్పోవడానికి ఆమె రాత్రంతా మేల్కొని ఉంది. ఒక ముద్ద తినలేదు. జాగింగ్ చేసింది, స్కిప్పింగ్ చేసింది, సైకిల్ తొక్కింది, ఆవిరి స్నానంతో చెమటోడ్చింది, మైకంతో బాధపడింది. బరువు తగ్గడానికి ఆమె జుత్తును కూడా కత్తిరించుకుంది. కేవలం 100 గ్రాముల బరువు అదనంగా ఉండి ఆమె చివరి తూకంలో విఫలమైనప్పుడు, 140 కోట్ల మంది భారతీయుల గుండె ఆగిపోయినంత పనయింది.



ఖచ్చితంగా మన దేశ క్రీడా వ్యవస్థ ద్వారా ఫోగట్‌కు మెరుగైన సేవలందించవచ్చు. భారతదేశ పితృస్వామ్య, వీఐపీలతో కూడిన స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ బాడీలు... క్రీడాకారులను, అథ్లెట్‌లను నిరంతరం ఎలా విఫలం చేస్తున్నాయనడానికి వినేశ్ ఫోగట్ సంఘటనే ఒక ఉదాహరణగా నిలుస్తుంది. తమను తృణీకరించడం, తమ పట్ల అమర్యాదపూర్వకంగా వ్యవహరించడం పట్ల ఫోగట్, ఆమె తోటి ఒలింపిక్ రెజ్లింగ్ ఛాంపియన్‌లు తిరగబడ్డారు. ఆరుసార్లు బీజేపీ ఎంపీగా ఎన్నికైన అప్పటి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధినేత బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా లైంగిక వేధింపుల ఆరోపణలతో వారు వీధుల్లో నిరసన తెలపవలసి వచ్చింది.

డబ్ల్యూఎఫ్ఐ నుంచి సస్పెండ్ అయినప్పటికీ బీజేపీ ఎంపీగా కొనసాగుతున్న బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోవడానికి మోదీ ప్రభుత్వం నిరాకరించింది. క్రీడా మంత్రిత్వ శాఖ మల్లయోధులపై గురిపెట్టి దాడులను కొనసాగించింది. బ్రిజ్ భూషణ్ బినామీ అయిన సంజయ్ సింగ్ భారత కుస్తీ సమాఖ్య అధ్యక్షుడయ్యాడు. ఫోగట్ మాట ఎవరూ వినలేదు. తనకు అవసరమైన వైద్యం, ఫిజియోథెరపీ అందడం లేదని ఆమె ఆరోపించారు. చివరికి, ఆమె ఇష్టపడే విభాగం 53 కిలోల పోటీ అయితే... 50 కిలోల విభాగంలో పోటీ చేయవలసి వచ్చింది. ఫోగట్‌కు అన్యాయం జరిగింది. ఒలింపిక్ పతకాల కోసం పోటీపడే వారికి తప్పనిసరిగా అన్ని సౌకర్యాలు, వైద్య సహాయం, ఉన్నత స్థాయి నిపుణుల పర్యవేక్షణను అందించాలి. కానీ తాను ప్రదర్శించిన ధిక్కారానికి ఫోగట్ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

ఈరోజు, ఫోగట్ గాథ చాలా కారణాల వల్ల కుస్తీ మ్యాట్ కంటే ముఖ్యమైనది. ఎలాంటి ఆధారాలూ లేకుండా జోక్యం చేసుకునే ప్రభుత్వం చేతిలో భారతదేశ శ్రేష్ఠమైన క్రీడాకారులు అనుభవిస్తున్న బాధలను అది ప్రతిబింబిస్తుంది. అది క్రీడలు లేదా ఇతర రంగాలలో అయినా, అధికారాన్ని సవాలు చేసే స్త్రీల విషయానికి వస్తే, వారు అధిరోహించడానికి ఇప్పటికీ ఒక పర్వతం అడ్డుగా ఉంది అనేదానికి ఫోగట్ ఒక ప్రతీక. ఆమె తోటి మహిళా రెజ్లర్లు, మల్లయోధుల జీవితాలు, వారి కెరీర్‌లపై పూర్తి నియంత్రణను కోరుకునే ఆధిపత్య వ్యక్తిగా అపఖ్యాతిపాలైన బ్రిజ్ భూషణ్ వంటి కరుడు గట్టిన పితృస్వామ్య ప్రతినిధి... అందరూ పురుషులతోనే కూడిన రెజ్లింగ్ సమాఖ్యను కైవసం చేసుకున్నాడు. పూర్తిగా రాజకీయాలతో అనుసంధానంలో ఉండే పురుషులు నిర్వహించే క్రీడాసమాఖ్యలు ఆధునిక క్రీడల నిర్వహణకు అత్యంత విరుద్ధం. ప్రధాన క్రీడా సంఘానికి నాయకత్వం వహించే స్థానంలో ఒక్క మహిళ కూడా ఎందుకు లేరన్నది పెద్ద ప్రశ్న. ఫోగట్ ఈ ఉక్కిరిబిక్కిరి అధికార ఆధిపత్యానికి వ్యతిరేకంగా తన స్వరం పెంచింది కాబట్టే మూల్యం చెల్లించుకుంది.

అయితే క్రీడలు మాత్రమే మినహాయింపుగా లేవు. ధిక్కరించే స్త్రీలు, అణచివేయలేని మహిళల పట్ల అసహనం ఇపుడు కార్పొరేట్ బోర్డ్‌రూమ్‌లు, న్యూస్‌రూమ్‌లతోపాటు రాజకీయ రంగానికి కూడా విస్తరించింది. మహిళలు, ఎంత ఎక్కువ సాధించినా, తమను తాము నిరూపించుకోవాలని వారిని నిరంతరం అడుగుతారు. వారు మగ అధికారాన్ని సవాలు చేసే 'తప్పు' చేస్తే, వారిని వెంటనే తిప్పికొడతారు, బహిష్కరిస్తారు. లేదా దూరంగా ఉంచుతారు.

సినిమా ప్రపంచంలో కూడా, చలనచిత్ర పరిశ్రమ ప్రారంభ సంవత్సరాల్లో, మహిళా నటీనటులు ఆఫ్–స్క్రీన్, ఆన్–స్క్రీన్‌పై 'సద్గుణ'వంతురాలైన విధేయ మహిళా ఇమేజ్‌కి అనుగుణంగా ఉండాలని భావించారు. నర్గీస్, మధుబాల, మీనా కుమారి వంటి మహిళా నటీనటులు అత్యంత విజయవంతమైన వృత్తినిపుణులు. వారు తమ వ్యక్తిగత జీవితాల్లో స్వయంప్రతిపత్తి కోసం పట్టుబట్టారు. కాబట్టే వారు అవిధేయ మహిళలుగా లేదా విఘాతం కలిగించే వ్యక్తులుగా కళంకిత ముద్ర పొందారు, సంప్రదాయ కుటుంబ ఆధారిత కట్టుబాటుకు వీరిని వ్యతిరేకులుగా పరిగణించారు. వెండి తెరపై ఆధునిక వ్యక్తిత్వాన్ని సృష్టించడానికి 1970లలో జీనత్ అమన్ శృంఖలాలను ఛేదించారు.

నిజానికి, ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించేందుకు భారత్ చాలా దూరంలో ఉంది. విభిన్నంగా ఉండటానికి, తమ గుర్తింపులను వ్యక్తీకరించడానికి భయపడని, సంప్రదాయ ఆలోచనా విధానాలను సవాలు చేసే మహిళల పట్ల సంబరాలు జరుపుకోవడంలో కూడా మనం చాలా దూరం వెళ్ళాలి. ఈ విషయంలో ప్రేరణ కోసం, ప్యారిస్ ఒలింపిక్స్‌లో మహిళల మారథాన్ బంగారు పతకాన్ని, మరో రెండు డిస్టెన్స్ పతకాలను గెలుచుకున్న ఇథియోపియన్ సంతతి డచ్ మిడిల్ డిస్టెన్స్ రన్నర్ అయిన సిఫాన్ హసన్‌ను మనం చూడవచ్చు. హసన్ ఒక శరణార్థి. ఆమె నెదర్లాండ్స్‌కు చేరుకుంది. నర్సుగా శిక్షణ పొందుతున్నప్పుడు ఆమె విరామ సమయాల్లో పరిగెత్తింది. గెలుపు సాధించింది. స్త్రీలో ఉన్న ప్రతిభ, తేజస్సు, ధిక్కరించడం అనే గుణాలు సామాజిక దురాచారాలు కావు; మనం క్రీడలలో, ఇతర రంగాలలో ఛాంపియన్‌ల దేశంగా ఉండాలంటే ఇలాంటి వారిని పెంచి పోషించాలి. వారి విజయాలను చూసి పండగ చేసుకోవాలి.

వ్యాసకర్త టీఎంసీ రాజ్యసభ ఎంపీ ('ది ప్రింట్' సౌజన్యంతో...)

వంకర బుద్ధుల పెద్దలు

ఏం చదివితే ఏమి? ఏ పదవిలో కూర్చుంటే ఏమి? పితృస్వామ్య భావజాలం నరనరాన జీర్ణించుకున్నప్పుడు ప్రతి ఒక్కడూ ఒక మనువే అవుతాడు. ఇందుకు రాజ్యసభలో జయాబచ్చన్ పట్ల చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వ్యవహారశైలే ఒక ఉదాహరణ.

అభిప్రాయం



కె.ఎన్. మల్లీశ్వరి

ప్రజలందరి స్వేచ్ఛా సమానత్వాలను కాపాడటానికి కృషి చేసే చట్టసభల్లో మహిళా సభ్యులు అవమానాలకు, వివక్షలకు గురి కావడం భారతదేశంలో చాలా సహజంగా మారిపోయింది, చర్చించవలసిన విషయం కాకుండా పోయింది. ఇందిరాగాంధీ, జయలలిత, సోనియాగాంధీ, మాయావతి, మమతా బెనర్జీతో సహా రాష్ట్రాల మహిళా శాసనసభ్యులు అనేకమంది ఇలాంటి వాటిని ఎదుర్కొన్నవారే. ఒకప్పటి బాలీవుడ్ హీరోయిన్, రెండు దశాబ్దాలుగా భారత పార్లమెంటేరియన్; ఆస్తులు, హోదాలు, కుటుంబపు దన్ను, సామాజిక ఆధిపత్య స్థానంలో ఉన్న జయాబచ్చన్ కూడా రాజ్యసభలో తన పేరును వ్యంగ్యంగా కాక గౌరవంగా పిలవడం కోసం పోరాటం చేస్తోంది. 'తోటి సభ్యురాలి పేరుకి విలువ ఇవ్వనివారు, మా హక్కులను ఎలా కాపాడతారని' ప్రజలు ప్రశ్నిస్తే చట్టసభలు ఏమని సమాధానం ఇస్తాయి?

మొన్నటి రాజ్యసభ సమావేశాల్లో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, సమాజ్‌వాదీ పార్టీ రాజ్యసభ సభ్యురాలు జయాబచ్చన్‌ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. తను మాట్లాడటానికి అవకాశం ఇమ్మని కోరిన జయను ఉద్దేశించి– 'ఇపుడు జయా అమితాబ్ బచ్చన్ గారు మాట్లాడతారని' ధన్‌ఖడ్ అన్నారు. 'అమితాబ్' పేరుని ఒత్తి పిలవడంతో, అందులోని వ్యంగ్యాన్ని జయ గుర్తించి అందుకు అభ్యంతరం చెప్పింది. అప్పటికి అది నాలుగోసారి జయ పేరుని ధన్‌ఖడ్ ఆ తీరులో పలకడం! తనని జయాబచ్చన్ అని మాత్రమే పిలవమని ప్రతిసారీ ఆయనకు చెబుతూనే ఉంది. తను భర్త చాటు భార్యను కాననీ, స్త్రీగా తన ఉనికిని గుర్తించాలని స్పష్టంగా చెప్పింది. ఒక స్త్రీ, అందునా ప్రతిపక్షంలో ఉన్న స్త్రీ కచ్చితంగా చెప్పడం ఎంతటి ఉదారులకైనా నచ్చుతుందా! ఎన్నికల అఫిడవిట్‌లో జయ పేరు 'జయా అమితాబ్ బచ్చన్' అని ఉంటుంది. అందుకే అలా పిలిచానని ధన్‌ఖడ్ అన్నారు. రాజ్యసభలో ఉన్న సభ్యుల పేర్లన్నీ ఎన్నికల అఫిడవిట్ ప్రకారమే పిలవడం లేదు కదా! దీన్ని బట్టి చూస్తే జయని రెచ్చగొట్టడానికే పదేపదే అలా పిలిచారు. అయితే పేరు పిలవడం కేవలం సాంకేతిక విషయం కాదు. పైకి మామూలుగా కనిపించే మాటకు మనం అద్దే స్వరం ద్వారా ఉద్దేశించిన అర్థం మారిపోవచ్చు. తనొక కళాకారిణిననీ, ఎదుటివారి హావభావాలు తనకి ఇట్టే తెలిసిపోతాయనీ, 'పిలిచిపుడు మీ టోన్ బాలేద'నీ చెప్పింది జయ.




చట్టసభల్లో సభాధ్యక్షులు ఎలా వ్యవహరించాలి అన్నదానికి మనకి కొన్ని సంప్రదాయాలు ఉన్నాయి. చైర్మన్ ఏ పార్టీ నుంచి ఎన్నిక అయినా సరే సభలో ఉన్న అన్ని పార్టీలు, సభ్యుల పట్ల తటస్థ వైఖరితో వ్యవహరించాలి. కానీ జగదీప్ ధన్‌ఖడ్ సభా నిర్వహణ చాలా స్పష్టంగా ఒక పక్షం వైపు పనిచేస్తూనే ఉంది. ఆయన ముందుగానే ప్రతిపక్ష సభ్యులతో వాదం వేసుకుని అధికారపార్టీ సభ్యుల పని సులువు చేస్తారు. దేశ ప్రజలందరికీ ఆదర్శమైన వ్యక్తిత్వంతో ఉండాల్సిన మనిషి, పరుషమైన భాష, వ్యంగ్యపు హావభావాలు, కటుత్వం, ఆధిపత్యపు మొగ్గు, సభా సంప్రదాయాలను పట్టించుకోకపోవడం ద్వారా ప్రతిపక్ష సభ్యుల విశ్వసనీయతను కోల్పోతున్నారు. తను కళాకారిణిని కాబట్టి హావభావాలు గ్రహించానని చెప్పడం, 'మనం కొలీగ్స్ కదా' అని జయ అనడంతో ధన్‌ఖడ్ ద్వంద్వానికి గురయ్యారు. 'మీరు సెలబ్రెటీ అయితే ఏమిటి, సభలో అందరూ ఒక్కటే' అన్న మరుక్షణమే 'మనం ఒకటి ఎలా అవుతాం! అధ్యక్ష స్థానానికి విలువ ఇవ్వరా!' అంటూ ధన్‌ఖడ్ పెద్దస్వరంతో మాట్లాడడం రాజ్యసభ ప్రసారాలు చూసినవారికి ఆశ్చర్యం కలిగించింది. ప్రతిపక్ష సభ్యులంతా వాకౌట్ చేసి బయటకు వచ్చారు. జయకి సోనియాగాంధీ మద్దతుగా నిలబడింది. ధన్‌ఖడ్ స్వభావం గురించి చెబుతూ సభ్యులను తరచుగా 'శూన్యబుద్ధి' అంటారని, మాట్లాడుతుంటే 'న్యూసెన్స్' అంటారని జయ చెప్పింది.

ఈ సందర్భంలో జయ ప్రస్తావించిన 'మాటల్లో ధ్వని' గురించి మాట్లాడుకోవాలి. 'ఇప్పుడు ఆడవాళ్ళని ఒక మాటని బతకగలమా!' అన్నది తరచూ వింటున్న మాట. స్త్రీలమీద జరిగే రకరకాల వేధింపులు, దాడులను అరికట్టడానికి కొన్ని చట్టాలు వచ్చాక నిస్సంకోచంగా స్త్రీలను అవమానించడం కొంతమేరకు తగ్గి ఉండవచ్చు. కానీ ఆ మేరకు కొత్త సాధనాలను పితృస్వామ్యం సమకూర్చుకుంటుంది. అందులో ఒకటి ధ్వని గర్భితంగా మాట్లాడటం! తాము వాడే ప్రతీ పదం రాజకీయంగా తప్పులేకుండా చూసుకుని– స్వరంలోని హెచ్చుతగ్గులు, తమకి అవసరమైన పదాలను ఒత్తి పలకడం, హావభావాల ద్వారా వివక్షను చూపడం! రాజ్యసభలో ఈ తెలివైన వివక్షకే జయ గురయింది. దీని వెనుక ఉన్న కారణం ఒక్కటే. ఇప్పటికీ స్త్రీలు రెండవతరగతి పౌరులు! అటువంటివారు చట్టసభల్లోకి వచ్చి మౌనంగా కూర్చోకుండా సవాళ్ళు విసురుతారు, గట్టి గొంతుతో మాట్లాడతారు. అందుకే జేపీ నడ్డా లాంటి వారికి జయలో సభా మర్యాదలు, ప్రజాస్వామిక విలువలు పాటించడం తెలియని గర్వపోతు కనపడింది. స్త్రీలు ఎంతటి స్థానానికి ఎదిగినా వారు సమాజం కళ్ళకు స్త్రీలుగానే కనపడతారు. అందుకే సోనియా గాంధీ ఇటలీ వెళ్లిపోవాలని ఆశిస్తారు. సునీత రెండో పెళ్లి చేసుకోవద్దని డిమాండ్ చేస్తారు. తులసి చందు తన యూట్యూబ్ ఛానెల్ ఆపేయాలని బెదిరిస్తారు. దేశంలోని మామూలు మనుషులంతా ఆ కుస్తీపిల్లని గుండెల్లో పెట్టుకుంటే మతతత్వ వాదులు ఆమె ఒంటి మీది దుస్తులను విప్పాలని చూస్తారు. జయను ఎలా పిలవాలో కూడా వాళ్ళే నిర్ణయిస్తారు!

వ్యాసకర్త ప్రరవే ఏపీ కార్యదర్శి
malleswari.kn2008@gmail.com

వట్టి మేధావులు కాదు... మట్టి మేధావులు కావాలి!

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

2024 జూలై 24న కొల్లూరి సత్తయ్య అనే బీహెచ్ఈఎల్ కార్మిక నాయకుడు రిటైర్ అయ్యాడు. ఆయన రిటైర్మెంట్ సందర్భంగా ఆయన ఆత్మకథ ప్రచురితమైంది. దాన్ని సత్తయ్య సొంత మాటల్లో పసునూరి రవీందర్ రాశాడు. ఈ ఆత్మకథను ప్రచురించే ముందు దానికి ముందు మాట రాయాలని పూర్తి పుస్తకాన్ని రవీందర్ నాకు ఆన్‌లైన్‌లో పంపించాడు. దాన్ని పూర్తిగా చదివాక బాల్య దశ నుండి సత్తయ్య జీవితం నన్ను నిజంగా ఆశ్చర్యపరిచింది. అటువంటి ఒక దళిత కార్మికుని జీవిత కథను నేను ఎప్పుడూ చదవలేదు. ఆ పుస్తకానికి టైటిల్ కూడా మీరే సూచించండి అని సత్తయ్య, రవీందర్ అడిగినప్పుడు ఈయనను 'మట్టి మేధావి' అనొచ్చని సూచించాను. ఆ పుస్తకం ఇప్పుడు 'మట్టి మేధావి – కొల్లూరి సత్తయ్య – ఆటోబయోగ్రఫీ' అనే టైటిల్‌తో బయటికి వచ్చింది.

ముందుమాటలో నేను, ఇలా రాశాను: ''కొల్లూరి సత్తయ్య జీవితకథ... ఒక మట్టి మేధావి చరిత్రలా కనిపిస్తుంది. ఆయన జీవితం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఒక చిన్న పల్లెటూరిలో (హైదరాబాద్ శివారు తెల్లాపూర్‌లో) ఒక మాదిగ కుటుంబంలో పుట్టి ఈ విధంగా ఎట్లా ఎదిగాడు అనిపిస్తుంది.''

సత్తయ్య మొదట్లో అసలు చదువురాని పది రూపాయల కూలీ మనిషి. బీహెచ్ఈఎల్‌లో పాకీ దొడ్లు కడుగుడు, క్యాంటీన్ ప్లేట్లు కడుగుడు పని చేసేవాడు. ఇంట్ల రైల్ వే గాంగ్‌మన్ తండ్రికి ఇద్దరు భార్యలు, 14 మంది పిల్లలు. సత్తయ్య అందరికంటే చిన్నవాడు. తండ్రి తప్ప మిగతా కుటుంబీకులు కూలీపని చేసేవారే. సత్తయ్య తల్లి మాత్రం మంత్రసాని. ఆమె కులం మాదిగైనా డెలివరీలు చాలా బాగా చేసేది గనుక ఊళ్ళో పుట్టిన ప్రతి పిల్లకు క్షేమంగా కాన్పు చేయించే మంత్రసాని ఆమె. అందువల్ల ఆమెకు ఊళ్ళో బువ్వ దొరకని రోజుండేది కాదట. ఎక్కువ దొరికిన రోజు ఇంట్లో అందరితోపాటు చుట్టు ఉన్న బిచ్చగాళ్లకు ఆమె బువ్వ పెట్టేది. అవ్వ (తల్లి) నుండి నేర్చుకున్న కొడుకు 10 రూపాయల్లో ఒక్క రూపాయి పక్కకు పెట్టి తమ గ్రామ శివార్లలో ఒంటికి చినిగిన బట్ట పేగులతో బతికే స్త్రీలకు చీర కొనిచ్చే పని మొదలుపెట్టాడు. క్రమంగా బీహెచ్ఈఎల్‌లో కార్మిక నాయకుడయ్యాడు. తనతో పాటు అతి చిన్న ఉద్యోగులను పర్మనెంటు చెయ్యాలని పోరాటాలు మొదలుపెట్టి కార్మికుల హక్కు కోసం అలుపెరుగని పోరాటాలు చేశాడు. ఈ క్రమంలో తెలుగులో చదవడం నేర్చుకున్నాడు.

గ్రామ స్థాయిలో దళితుల భూములను (ముఖ్యంగా ఇనామ్ భూములు) భూదందా దారులు ఆక్రమించకుండా కాపాడే పోరాటాలు చేశాడు. క్రమంగా ఆర్థికంగా పుంజుకుంటూ కంప్యూటర్ సమస్య బీద విద్యార్థులు ఎదుర్కోగానే చిన్న కంప్యూటర్ సెంటర్ ప్రారంభించి బీద విద్యార్థులకు నేర్పించే ఏర్పాటు చేశాడు. కరోనా రాక ముందే అనాథ పిల్లలను తెచ్చి తన తాతకు ఇనాముగా వచ్చిన భూమిలో గదులు కట్టి తన



పిల్లలు చదువుకున్న ఇంగ్లిష్ మీడియం బడుల్లో చేర్పించాడు. కరోనాతో ఆ సేవ ఆపాల్సి వచ్చింది. అప్పుడు ఆకలితో అలమటిస్తున్న వలస కూలీలకు బువ్వ బండి ప్రారంభించాడు. తన సొంత ఆదాయం నుండి ఖర్చుపెట్టి రోజుకు 400 మందికి మిల్లెట్ బ్రేక్‌ఫాస్ట్ రోజూ పెట్టేవాడు. ఆ బువ్వ బండి ఇప్పటికీ నడుస్తోంది. ఆ క్రమంలోనే నా సలహాతో 'ఫూలే–అంబేడ్కర్ సెంటర్ ఫర్ ఫిలాసఫీ అండ్ ఇంగ్లిష్ ట్రైనింగ్' ప్రారంభించాడు. దీన్ని చట్టపరంగా నడిపేందుకు 'అమృత–సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీ' స్థాపించాడు. 2022 జనవరి 26న ప్రారంభమైన ఈ ఫిలాసఫీ–ఇంగ్లిష్ ట్రైనింగ్ దాదాపు 500 మందిని 23 రాష్ట్రాల నుండి సెలెక్ట్ చేసి ప్రతి 40 మందితో బ్యాచ్‌కి నెలరోజులు ఉచిత వసతి, ఉచిత తిండితో ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సత్తయ్యే 2024 జనవరి 30న తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహాన్ని స్థాపించాడు. దానికి ప్రభుత్వం 10 కుంటల భూమి ఇచ్చింది.

సత్తయ్యను మట్టిమేధావి (ఇంగ్లిష్‌లో ఇటువంటి వారినే ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్) అని ఎందుకన్నారని నన్ను కొంతమంది అడిగారు. ఆయన పెద్దగా చదువుకోలేదు కానీ దళితుల, ఆదివాసుల, శూద్ర, బీసీలలో బీద పిల్లల చదువుల గురించి చాలా కృషి చేస్తున్నాడు. మట్టి అన్ని ఉత్పత్తులకు మూలం. ఉత్పత్తులకు మతం మూలం లేదు. మట్టికి–గింజకు, మట్టికి–జంతు వుకు ఉన్న సంబంధాన్ని మట్టిలో పనిచేసే మనుషులే మేధావులై కనిపెట్టారు. ఇక్కడే మొట్టమొదట మానవ తత్వశాస్త్రం పుట్టింది. స్త్రీ కడుపులో పుట్టిన మనుషులు తిరిగి మట్టి బొందలోకి పోయేవరకు మట్టిని ప్రేమిస్తారు. మట్టితో పోరాడుతారు. అన్ని ఉత్పత్తి సంబంధాలు, మానవ సంబంధాలను మట్టిలో పని చేసే మనుషులు... పుస్తకాలు, మతాలు లేక ముందే ఏర్పర్చుకున్నారు. మట్టి మేధావులు... పుస్తకాలు, మతాలు సమాజంలోకి రాకముందే సమాజాలను అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు. అయితే భారత దేశంలో మతాలు, వేదాలు వచ్చాక శూద్రుల్లో, దళితుల్లో, ఆదివాసుల్లో ఇటువంటి మట్టి మేధావులు ఉన్నారు. కాబట్టి వారిని చదువుకు, రాతకు, మతాలను నడపడానికి దూరంగా ఉంచారు. కాల్పనిక, ఊహాజనిత అంశాలపై పుస్తకాలు రాసేవారు మేధావులనీ; రైతులు, కార్మికులు సత్తయ్యలా మానవత్వంతో సమాజాన్ని మార్చుకుంటూ వచ్చిన వారిని అసలు గుర్తించని సాహిత్యం తయారు చేశారు. ఇటువంటి ఉత్పత్తి సంబంధ రహిత రచయితలను 'వట్టి మేధావులు' అనాలి.

ఈ దేశంలో కాళిదాసు నుండి కాళోజీ వరకు ఊహాజనిత కవిత్వాన్ని కావ్యాల రూపంలో రాసినవాళ్లే. కాళిదాసు 'మేఘ సందేశం'లో భూమి మీదికి తొయ్యబడ్డ యక్షుడు మేఘం ద్వారా కైలాసంలో ఉన్న భార్యకు పంపిన ప్రేమ సందేశంలో ఈ దేశ వర్ణన అంతా ఊహాజనితమైందే. ఇక్కడి వ్యవసాయ భూములు, వాటిలో పంటలు పండిస్తున్న రైతుల గురించి ఒక పద్యం కూడా అందులో లేదు. మహాకాళి ఆలయ వర్ణన ఉంది గానీ, మహా ఉత్పత్తి రంగమైన పంటపైగానీ, శ్రమచేసి పండించే రైతు బతుకుపై కానీ ఒక పద్యం కూడా లేదు.

ఆనాటి సంస్కృత సాహిత్య ఉత్పత్తి వ్యతిరేక వారసత్వం ప్రాంతీయ భాషల్లోకి కూడా పాకి శ్రమను గౌరవించని, లేదా శ్రమను పట్టించుకోని రచయితలు పుట్టుకొచ్చారు. అందుకే ఈ సాహిత్యానికి ప్రపంచ గుర్తింపు లభించలేదు. ప్రకృతి వర్ణన స్త్రీ పురుషుల ప్రేమ కోసమో, యుద్ధ నిర్మాణాల అవసరాల కోసమో కాదు చెయ్యాల్సింది. ప్రకృతిని ప్రజల శ్రమ జీవనంతో ముడేసిన రచనలు దేశంలో వచ్చినప్పుడు సాహిత్యం సార్వజనీనత్వం సంతరించుకుంటుంది.

గద్దర్ పాటల సాహిత్యంలో పుట్టుకొచ్చిన మట్టి చేతులకు గౌరవం గానీ, సత్తయ్య మానవత్వపు మట్టిమేధావితత్వం గానీ సమాజాన్ని రోజువారీగా అభివృద్ధి వైపు పయనింపజేస్తుంది. మట్టి మేధావులకు వట్టి మేధావులకు ఉండే తేడా... భూమిపైన మానవ సమానత్వ స్వర్గాన్ని సృష్టించడానికీ, మనుషులు చనిపోయాక స్వర్గం చూపెట్టే తత్వానికీ ఉండే తేడా! మొదటి ఆలోచనలో దేవుడు శ్రమ గౌరవ వాది. రెండవ ఆలోచనలో దేవుడు శ్రమ వ్యతిరేకవాది. ఉత్పత్తి కులాలను ప్రేమించలేని కుల సమీకరణలు సాహిత్య రంగాన్ని యుద్ధమయం, ప్రేమమయం చేశాయి. అందుకే సత్తయ్య లాంటి వారి ఆత్మకథలను పిల్లలు చదివినప్పుడు ఉత్పత్తి, శ్రమ, సర్వజంతు ఆదరణవాదులౌతారు. జంతువుల్లో ఒక దాన్ని ఎన్నుకొని పూజించడం జంతుజాతిని కాపాడదు. అన్ని జంతువులనూ ప్రేమించి మేపాలి.

భూములు పంచిన భూస్వాములున్నారు. ఆస్తులొదిలి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అగ్ర కులస్థులున్నారు. కానీ వాళ్ళు మానవ సమానత్వాన్ని కోరుకోవడంలో విఫలమయ్యారు. ముఖ్యంగా విద్యా సమానత్వం రూపొందించాలనే ఆలోచనకు వాళ్ళ కులం అడ్డొచ్చింది. సత్తయ్య మాత్రం తాను బడిలో, కాలేజీలో, యూనివర్సిటీలో చదువుకోక పోయినా అంబేడ్కర్ లాగా, మహాత్మా ఫూలే లాగా ఈ దేశ బీద పిల్లలు ఇంగ్లిష్‌లో చదువుకొని వాళ్ళ సిద్ధాంతాలను నేర్చుకొని దేశ మార్పునకు కృషి చెయ్యాలని పనిచేస్తున్నాడు. అందుకే సత్తయ్యను మట్టి మేధావి అనాలి. వట్టి మేధావులు కూడా ఆయన జీవిత చరిత్ర చదివి నేర్చుకుంటే దేశానికి మేలు చెయ్యగలరు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

పులస.. ఎటు వలస!

గోదావరి వైపు చూడని పులసలు
- ప్రతికూల పరిస్థితులతో ముఖం చాటేస్తున్న పులసలు
- రెండు నెలల్లో చిక్కిన చేప ఒకే ఒక్కటి
- ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు పరుగులు

హిందూ మహాసముద్రంలో సందడి చేసే పులసలు.. గోదావరి వైపు చూడటం లేదు. సంతానోత్పత్తి కోసం నదిలోకి ఎదురీదే పులసలు ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు తమ రూటు మార్చేశాయి. ఆగస్టు రెండో వారం వచ్చేసినా గోదావరి పాయల వెంట పులస జాడ కనిపించడం లేదు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు గోదావరి తీరంలో ఒక్క పులస మాత్రమే లభ్యమైంది.

పుస్తెలమ్మి అయినా పులస తినాలనేది గోదావరి జిల్లాల్లో నానుడి. ఏటా జూలై, ఆగస్టు నెలల్లో పులసలు గోదావరి నదిలోకి వరస కట్టి.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మాంసాహార ప్రియుల జిహ్వాచాపల్యాన్ని తీర్చేవి. అంతటి విశిష్టత కలిగిన పులసల రాక దాదాపు పదేళ్లుగా ఏటా తగ్గుతూ వస్తోంది. ఈ సీజన్‌లో ఇంతవరకు కోనసీమలోని రాజోలు దీవిలోని గోదావరి తీరంలో కేవలం ఒకే ఒక పులస మత్స్యకారుల వలకు చిక్కింది. ఆ చేపను వేలం వేస్తే రూ.24 వేలు పలికింది. అంతటి డిమాండ్ ఉన్న పులసలు గోదావరిలో అడుగుపెట్టకుండా మొహం చాటేస్తున్నాయి. హిందూ మహాసముద్రం నుంచి వేలాది కిలోమీటర్లు ఈదుకుంటూ బంగాళాఖాతంలోకి పులసలు వస్తున్నా.. గోదావరి నది వైపు చూడకుండా ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు పరుగులు తీస్తున్నాయి. గోదావరి నదీ తీరం వెంబడి నెలకొన్న ఆటంకాలే ఇందుకు కారణమని మత్స్య శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. - సాక్షి ప్రతినిధి, కాకినాడ

గోదావరిలో వరద ప్రవాహం పోటెత్తి సముద్రం వైపు పరుగులు తీసే రోజుల్లో.. వరదల్లో కొట్టుకొచ్చే బురద మట్టినే ఆహారంగా తీసుకుంటూ పునరుత్పత్తి కోసం ఇలసలు (సముద్ర జలాల్లో ఉన్నప్పుడు ఇలస అని పిలుస్తారు) గుంపులు, గుంపులుగా ఒక ప్రవాహం మాదిరిగా వలస వస్తుంటాయి. కానీ.. గోదావరి ప్రాంతంలోని సముద్ర తీరం కాలుష్యకారకంగా మారడం, విచ్చలవిడిగా సాగుతున్న చేపల వేటతో 'క్వీన్ ఆఫ్ ది ఫిష్'గా పిలిచే పులస బంగాళాఖాతం నుంచి గోదావరి వైపు రావడం లేదని సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిఫ్రీ) ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో తేల్చింది. ఇలసల్లో కొవ్వు అధికంగా ఉంటుంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, టాంజానియా తీర ప్రాంతాల నుంచి సముద్ర జలాల్లో సుమారు 11 వేల నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించి ఇలసలు పునరుత్పత్తి కోసం గోదావరిలోకి ఎదురీదుతాయి. ఇలా ఎదురీత ప్రయాణం వల్ల వాటిలో ఉండే కొవ్వు కరిగి ఎరుపు, గోధుమ రంగులోకి మారుతుంది. ఈ దశలోనే పులస మంచి పోషక విలువలతో రుచికరంగా తయారవుతుంది. కృష్ణా, గోదావరి (కేజీ) బేసిన్‌లో చమురు కార్యకలాపాల వెలికితీత కోసం చేపడుతున్న డ్రెడ్జింగ్ వల్ల ధ్వని కాలుష్యం పెరిగిపోయి పులసలు సముద్రం నుంచి గోదావరిలోకి రావడం లేదు.

'క్వీన్ ఆఫ్ ది ఫిష్' ఇటు రావట్లేదు

గోదావరి, బంగాళాఖాతం కలిసే సీ మౌత్ (నదీ ముఖద్వారం వద్ద) రిలయన్స్, ఓఎన్‌జీసీ తదితర సంస్థలు డ్రెడ్జింగ్ నిర్వహిస్తున్నాయి. గోదావరి తీరాన రాజమహేంద్రవరం, అంతర్వేది, కరవాక, యానాం, గాడిమొగ, ఎదుర్లంక సమీప ప్రాంతాల్లో పారిశ్రామిక వ్యర్థాలు గోదావరిలో కలిసిపోతున్నాయి. సల్ఫర్, అమోనియా, లెడ్, పాదరసం ఇతర కర్బనాలు నదిలో కలుస్తున్నాయి. తీరం వెంబడి విచ్చలవిడిగా వేల ఎకరాల్లో సాగవుతున్న రొయ్యల చెరువుల వ్యర్థాలు నేరుగా సముద్రం, గోదావరిలోనే కలుస్తున్నాయి. గోదావరి నుంచి సముద్రంలో ఈ అవశేషాలు కలుస్తుండటంతో పులస గోదావరి వైపు రావడం లేదు.



అందుకే.. రూటు మార్చేసింది

గోదావరి తీరం కాలుష్యకారకంగా మారిపోవడం.. పునరుత్పత్తికి అనుకూల పరిస్థితులు లేకపోవడంతో సముద్రం నుంచి ప్రవాహం మాదిరిగా వచ్చే ఇలసలు అటు నుంచి అటే ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు పరుగులు తీస్తున్నాయి. ఇందుకు ఒడిశా, పశ్చిమ బెంగాల్ నదీ జలాల్లో ఉన్న సానుకూల వాతావరణమే ప్రధాన కారణమని మత్స్య శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ నది వైపు పయనమవుతున్నాయని స్పష్టం చేస్తున్నారు.

విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో అన్యాయం

- వెంటనే సరిదిద్ది పదోన్నతులు కల్పించాలి: ఎంపీ ఆర్.కృష్ణయ్య
- సెప్టెంబర్ 4న విద్యుత్ సౌధలో మహా ధర్నా: జేఏసీ చైర్మన్ కోడెపాక




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావం తర్వాత విద్యుత్ సంస్థల్లో ఇచ్చిన పదోన్నతులను పునః సమీక్షించి బీసీ, ఓసీ ఉద్యోగులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది వారికి తక్షణమే పదోన్నతులు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పై కేడర్లలో ఉన్న ప్రాతినిధ్యాన్ని లెక్కించకుండానే ఫీడర్ కేడర్లలో వారికి యాక్సిలరేటెడ్ పదోన్నతులు కల్పించడంతో బీసీ, ఓసీ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఆందోళనబాట చేపడతామని, సెప్టెంబర్ 4న విద్యుత్ సౌధ వద్ద వేల మందితో మహా ధర్నా నిర్వహిస్తామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ బీసీ, ఓసీ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ కోడెపాక కుమార స్వామి ప్రకటించారు. విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్ ముత్యం వెంకన్న గౌడ్, కో చైర్మన్ ఆర్.సుధాకర్ రెడ్డి, కో కన్వీనర్ సి.భాను ప్రకాశ్ పాల్గొన్నారు.

కారణాల్లేకుండా ఎలా తిరస్కరిస్తారు?

ఇంజనీరింగ్ కాలేజీల దరఖాస్తులను మళ్లీ పరిశీలించండి
- సీట్ల పెంపు, కోర్సుల విలీనంపై తాజాగా నిర్ణయం తీసుకోండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆదేశం
- సింగిల్ జడ్జి, ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేస్తూ తీర్పు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపు, కోర్సుల విలీనం దరఖాస్తులను ఎలాంటి కారణాలు చూపకుండా ఎలా తిరస్కరిస్తారని రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మళ్లీ దరఖాస్తులను పరిశీలించి చట్టబద్ధంగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయాలు లోపభూయిష్టంగా ఉండకూడదని స్పష్టం చేసింది. కాలేజీ దరఖాస్తులపై నిర్ణయం తీసుకోవడం జాప్యమైతే ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లోనూ మార్పులు చేయొచ్చని వెసులుబాటు ఇచ్చింది. ప్రభుత్వానిదే తుది నిర్ణయమన్న సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టివేసింది. అలాగే దరఖాస్తులను తిరస్కరిస్తూ జూలై 26న ఉన్నత విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులను కూడా రద్దు చేసింది. దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కచ్చితమైన కారణాలను వెల్లడించాలని చెప్పింది. బీటెక్/బీఈలో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితర కోర్సుల్లో సీట్ల పెంపునకు, కొన్ని కోర్సులను ఇతర కోర్సుల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం నిరాకరించడాన్ని



సవాల్ చేస్తూ పలు ఇంజనీరింగ్ కాలేజీలు పిటిషన్లు దాఖలు చేశాయి. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. కొత్త కోర్సులపై అంతిమ నిర్ణయం సర్కార్‌దేనని తీర్పునిచ్చారు.

రీయింబర్స్‌మెంట్ సాకు సరికాదు..

సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ పలు కాలేజీలు ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు దేశాయి ప్రకాశ్‌రెడ్డి, ఎస్.శ్రీరామ్, శ్రీరఘురామ్, ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'జేఎన్‌టీయూహెచ్, ఏఐసీటీఈ అనుమతి ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తిరస్కరించడం సరికాదు. అధ్యాపకులు, ఇతర వసతులు లాంటి అన్ని అంశాలను ఏఐసీటీఈ నిపుణుల తనిఖీ కమిటీ పరిశీలించింది. పాత కోర్సులను కొత్త కోర్సులుగా మార్చుకునేందుకు అనుమతి కోరుతున్నాం. దీంతో ఒక్క సీటు కూడా అదనంగా పెరగడం లేదు. ప్రభుత్వంపై ఫీజు రీయింబర్స్‌మెంట్ భారం అనే సమస్యే ఉత్పన్నం కాదు. ఎలాంటి కారణం చెప్పకుండానే అనుమతి ఇచ్చేందుకు ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి నిరాకరించారు' అని చెప్పారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'సీట్ల పెంపు లాంటిది ఒక్క రీయింబర్స్‌మెంట్‌కే పరిమితం కాదు. కాలేజీలు కోరిన విధంగా సీట్లు పెంచుకుంటూపోతే సమస్యలు ఉత్పన్నమవుతాయి. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల కింద అనుమతిస్తే విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుంది. సీట్ల పెంపు, విలీనంపై నిర్ణయం తీసుకునే చట్టపరమైన అధికారం ప్రభుత్వానికి ఉంది. కొన్ని కోర్సుల్లో ఇప్పటికీ చాలా ఖాళీ సీట్లు ఉన్నాయి. ఇంకా పెంచాలని కోరడం సరికాదు. అప్పీళ్లను కొట్టివేయాలి' అని విజ్ఞప్తి చేశారు.

ధర్మాసనం పేర్కొన్న కీలక అంశాలు

'అప్పీల్ చేసిన కాలేజీలకు తిరస్కరించి, మరికొన్ని కాలేజీలకు అనుమతి ఇవ్వడం చట్టవిరుద్ధం. విద్యా చట్టంలోని సెక్షన్ 20ను పరిశీలించిన సింగిల్ జడ్జి.. దరఖాస్తుల తిరస్కరణ అధికారం ప్రభుత్వానికి ఉందని అభిప్రాయపడ్డారు. కొన్ని విద్యాసంస్థలకు చట్టవిరుద్ధంగా అనుమతి ఇచ్చినట్లయితే.. అదే తప్పును పునరావృతం చేయడానికి దాన్ని కారణంగా పేర్కొనవద్దు. అధికారుల నిర్ణయం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉంది. ఏఐసీటీఈ, జేఎన్‌టీయూ ఇచ్చిన ఆమోదాన్ని ఎందుకు రద్దు చేశారన్న విషయంపై స్పష్టత లేదు. చట్టప్రకారం ప్రతి కాలేజీ దరఖాస్తును పరిశీలించాలి. కానీ, అధికారులు అలా వ్యవహరించలేదు. జూలై 26న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల చెల్లుబాటులో సింగిల్ జడ్జి పొరపడ్డారు. అందువల్ల కాలేజీల దరఖాస్తులను తిరస్కరిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను, సింగిల్ జడ్జి ఆదేశాలను రద్దు చేస్తున్నాం' అని ద్విసభ్య ధర్మాసనం స్పష్టంచేసింది.

హెయిర్‌డై తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

అమ్మ తాగిందని పిల్లలూ తాగిన వైనం..



ఆత్మహత్యాయత్నం చేసిన స్వప్నతోపాటు ఇద్దరు కుమారులు

మంచిర్యాల క్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గర్మిళ్లకు చెందిన వివాహిత మామిడిశెట్టి స్వప్న కొంతకాలంగా థైరాయిడ్‌తో బాధపడుతోంది. ఇటీవల వైద్య పరీక్షలు చేయించుకోగా షుగర్ వ్యాధి కూడా నిర్ధారణ అయింది. దీంతో మనస్తాపం చెందిన స్వప్న మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో హేయిర్‌డై తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సమయంలో సమీపంలోనే ఉన్న ఇద్దరు కుమారులు ఆరుష్ (7), ఆర్యన్ (6)కూడా హేయిర్‌డై బాటిల్ తీసుకుని తాగారు. ఇది గమనించిన స్వప్న వెంటనే భర్త తిరుపతికి ఫోన్ చేసి విషయం చెప్పింది. ఇంటికి వచ్చిన భర్త ముగ్గురినీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ముగ్గురి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

'పంచాయతీ' నిధుల సమస్యను అధిగమిస్తాం : మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ నిధుల సమీకరణపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతో.. పంచాయతీలకు నిధుల సమస్య వచ్చిందని, త్వరలోనే దీనిని అధిగమించి నిధులు కేటాయిస్తామని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లకు పెద్ద మొత్తంలో బిల్లులు పెండింగ్‌లో పెట్టారన్నారు. మంగళవారం సచివాలయం నుంచి మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో మాట్లాడారు. ప్రతి నెలలో మూడు రోజులు స్వచ్ఛదనం-పచ్చదనం డ్రైవ్ కొనసాగుతుందని మంత్రి సీతక్క చెప్పారు. వివిధ జిల్లాల్లో పారిశుద్ధ్య లోపాలపై వార్తలు రావడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మరోజత యూనిఫాం పంపిణీ చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి సీతక్క జిల్లా అధికారులను ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడిపై కుక్క దాడి



ఆరుష్ చెవికి గాయం

చందుర్తి(వేములవాడ): అంగన్‌వాడీ కేంద్రంలో పిచ్చి కుక్క దాడి చేయడంతో ఒక బాలునికి తీవ్ర గాయాలయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం బండపల్లి గ్రామంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తుల కథనమిది. అంగన్‌వాడీ కేంద్రంలో ఆరుష్ అనే బాలుడు మూత్రవిసర్జనకు ఆయాతో కలిసి బాత్‌రూం వద్దకు వెళ్లాడు. బాత్‌రూం తలుపు తీసి లోపలికి వెళ్లగానే అందులోని కుక్క బాలుడిపై దాడి చేసింది. బాలుని చెవికి తీవ్రగాయం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఈఎన్‌టీ స్పెషలిస్టు లేకపోవడంతో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి బాలుడిని తీసుకెళ్లారు. కానీ అక్కడ సరైన వైద్యం అందకపోవడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పదేళ్ల కల ఫలించిన వేళ...

122 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులను రిలీవ్ చేసిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: నాన్ గెజిటెడ్ ఉద్యోగులు సొంత రాష్ట్రానికి తిరిగి రావాలని పదేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. తెలంగాణ స్థానికత ఉన్నా.. ఇక్కడ అవసరమైన పోస్టులు లేకపోవడంతో ఉద్యోగుల విభజన సమయంలో వారిని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. చిరుద్యోగులమైన తాము అక్కడ పనిచేయడం కష్టమని, తమ కుటుంబాలన్నీ ఇక్కడే ఉన్నాయని వారు చెప్పినా.. వారు అక్కడకు వెళ్లకతప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఆ తరువాత ఇరు రాష్ట్రాల మధ్య పలుమార్లు చర్చలు జరిగాయి. గత సంవత్సరమే వారు తెలంగాణకు రావాల్సి ఉన్నా.. వివిధ కారణాలతో ఆలస్యమైంది. మంగళవారం ఏపీ ప్రభుత్వం వారిని రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. బదిలీ అయిన వారిలో ఆఫీస్ సబార్డినేట్ మొదలుకొని డ్రైవర్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, స్టెనోలు, టైపిస్టులు ఉన్నారు.

ఉద్యోగ సంఘాల హర్షం...

ఆలస్యంగానైనా తెలంగాణకు చెందిన ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై తెలంగాణ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు ఎ. పద్మాచారి, అధ్యక్షులు మఠం రవీంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ గౌడ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉద్యోగులనూ రిలీవ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కూడా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఉద్యోగులను తెలంగాణకు రావడానికి వీలుగా నాన్ గెజిటెడ్ ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపట్ల తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన

- అమెరికాలో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చల ఫలితంగా విస్తరణ
- కోకాపేటలో 10 లక్షల చ.అడుగుల్లో కొత్త క్యాంపస్ నిర్మాణం
- మరో 15వేల మందికి ఉద్యోగాల కల్పన

సాక్షి, హైదరాబాద్: ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ హైదరాబాద్‌లో బుధవారం కొత్త క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తోంది. దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకుంటారు. అనంతరం సాయంత్రం కోకాపేటలో జరిగే శంకుస్థాపన కార్యక్రమంలో కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్‌తో కలిసి పాల్గొంటారు. హైదరాబాద్‌లో 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటయ్యే కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ ద్వారా మరో 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త క్యాంపస్ దృష్టి సారిస్తుంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో అమెరికాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని అధికారుల బృందంతో ఈ నెల 5న కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ భేటీ అయ్యారు. కాగ్నిజెంట్ విస్తరణ ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తామని రవికుమార్ ఈ భేటీ అనంతరం ప్రకటించారు. న్యూజెర్సీలో ఈ నెల 5న రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు కేవలం పది రోజుల వ్యవధిలోనే కొత్త క్యాంపస్ పనులకు కాగ్నిజెంట్ శ్రీకారం చుడుతోంది. 1994లో చెన్నై కేంద్రంగా ఆవిర్భవించిన కాగ్నిజెంట్ ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరిస్తోంది. రాష్ట్రంలో 2002 నుంచి కార్యకలాపాలు ప్రారంభించిన ఈ సంస్థకు హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని వివిధ ప్రాంతాల్లో ఐదు క్యాంపస్‌లు ఉన్నాయి. ప్రస్తుతం కాగ్నిజెంట్ హైదరాబాద్ క్యాంపస్‌లో 57 వేల మంది ఉద్యోగులున్నారు. తెలంగాణ ఐటీ రంగంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రెండో సంస్థగా కాగ్నిజెంట్‌కు పేరుంది. గత రెండేళ్లలో ఈ కంపెనీ రాష్ట్రంలోని 34 వివిధ విద్యాసంస్థల నుంచి 7,500 మంది ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలు ఇచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ తెలంగాణ నుంచి రూ.7,725 కోట్ల ఐటీ ఎగుమతులను నమోదు చేసింది. గడిచిన ఐదేళ్లలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.22.5 కోట్లతో వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టింది.



పేదరికం లేని గ్రామమే నా కల

జీఆర్ఎస్ కోసం ఆన్‌లైన్ కోర్సు ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్



సాక్షి, హైదరాబాద్: పేదరికం లేని గ్రామమే తన కల అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ అన్నారు. 'గ్రామాల్లో ఎవరూ పేదలుగా ఉండకూడదు, అందరికీ ఉపాధి కల్పించాలి. గ్రామ స్వరాజ్ రావాలని మహాత్మాగాంధీ కన్న కల. అంటే మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి' అని పిలుపునిచ్చారు. గ్రామాలకు సరైన రోడ్ కనెక్టివిటీ, తాగునీరు, పటిష్టమైన, విశాలమైన పాఠశాల భవనాలు, పంచాయతీ భవనం, ఆరోగ్య సౌకర్యాలు ఉండాలన్నారు. మంగళవారం జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ 66వ జనరల్ కౌన్సిల్ సమావేశానికి కేంద్ర మంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీకి చెందిన జేఎన్‌యూ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ), పీహెచ్‌డీకి సంబంధించి రెండు అవగాహన ఒప్పందాలపై ప్రముఖుల సమక్షంలో సంతకాలు చేశాయి. గ్రామ్‌రోజ్‌గార్ సేవక్ (జీఆర్ఎస్) కోసం ఆన్‌లైన్ కోర్సును కూడా కేంద్రమంత్రి ప్రారంభించారు.

మహిళలు నాయకులుగా ఎదిగేందుకు

'దేశ ఆర్థిక వ్యవస్థకు సహకరించడంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. గ్రామాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. మంత్రిత్వశాఖకు ఆలోచన కేంద్రంగా ఉన్న 'ఎన్ఐఆర్‌డీపీఆర్' ముఖ్యమైన పాత్రతోపాటు, సామర్థ్య పెంపుదల, శిక్షణా కార్యకలాపాలు అవసరం' అని శివరాజ్‌సింగ్‌చౌహాన్ స్పష్టం చేశారు. కేంద్ర సహాయ మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆ తర్వాత క్యాంపస్‌లోని రూరల్ టెక్నాలజీ పార్కును సందర్శించి పీఎంఏవై-జీ మోడల్‌హౌస్ (డబుల్ బెడ్‌రూమ్)ను కేంద్రమంత్రి ప్రారంభించారు.

...అలా పంచుకున్నారు!

యజ్ఞాన్ని తలపించిన భారత్, పాక్ విభజన • మూడింట రెండొంతుల సైన్యం భారత్‌కు

- ఆస్తులు, అప్పుల్లో 17.5 శాతం పాక్‌కు
- 80:20 నిష్పత్తిలో ఫర్నిచర్, స్టేషనరీ
- బల్బులూ, జంతువులూ పంచుకున్నారు
- టాస్‌లో భారత్ పరమైన వైస్రాయ్ బగ్గీ

1947. బ్రిటిష్ వలస పాలన నుంచి మనకు విముక్తి లభించిన ఏడాది. అఖండ భారతదేశం రెండుగా చీలిన ఏడాది కూడా. ఒక రాష్ట్ర విభజన జరిగితేనే ఆస్తులు, అప్పులు తదితరాల పంపకం ఓ పట్టాన తేలదు. అలాంటి దేశ విభజన అంటే మాటలా? అది కూడా అత్యంత ద్వేషపూరిత వాతావరణంలో జరిగిన భారత్, పాకిస్తాన్ విభజన గురించైతే ఇక చెప్పేదేముంటుంది! ఆస్తులు, అప్పులు మొదలుకుని సైన్యం, సాంస్కృతిక సంపద దాకా అన్నీ రెండు దేశాల మధ్యా సజావుగా పంపకమయ్యేలా చూసేందుకు నాటి పెద్దలంతా కలిసి భారీ యజ్ఞమే చేయాల్సి వచ్చింది. రేపు దేశమంతా 78వ స్వాతంత్య్ర దిన వేడుకలు జరుపుకోనున్న నేపథ్యంలో దేశ విభజన జరిగిన తీరుతెన్నులపై ఫోకస్...

ముందుగానే కమిటీ

విభజన సజావుగా సాగేలా చూసేందుకు స్వాతంత్య్రానికి ముందే 1947 జూన్ 16న 'పంజాబ్ పార్టిషన్ కమిటీ' ఏర్పాటైంది. తర్వాత దీన్ని విభజన మండలి (పార్టిషన్ కౌన్సిల్)గా మార్చారు. ఆస్తులు, అప్పులతోపాటు సైన్యం, ఉన్నతాధికారులు మొదలుకుని కార్యాలయ సామగ్రి, ఫర్నిచర్ దాకా అన్నింటినీ సజావుగా పంచడం దీని బాధ్యత. కమిటీలో భారత్ తరఫున కాంగ్రెస్ నేతలు సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్, బాబూ రాజేంద్రప్రసాద్; పాక్ తరఫున ఆలిండియా ముస్లిం లీగ్ నేతలు మహ్మదాలీ జిన్నా, లియాకత్ అలీ ఖాన్ ఉన్నారు. ఇంతటి బృహత్కార్యాన్ని కేవలం 70 రోజుల్లో ముగించాల్సిన గురుతర బాధ్యత కమిటీ భుజస్కంధాలపై పడింది!

1947
ది అదర్ సైడ్

హాస్యాస్పదంగా భౌగోళిక విభజన!

దేశ విభజనలో తొట్టతొలుత తెరపైకొచ్చిన అంశం భౌగోళిక విభజన. ఈ బాధ్యతను బ్రిటిష్ న్యాయవాది సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌కు అప్పగించారు. ఆ మహానుభావుడు హడావుడిగా కేవలం నాలుగే వారాల్లో పని ముగించానని అనిపించాడట. బ్రిటిష్ ఇండియా మ్యాప్‌ను ముందు పెట్టుకుని, తనకు తోచినట్టుగా గీత గీసి 'ఇదే సరిహద్దు రేఖ' అని నిర్ధారించినట్టు చెబుతారు. దాన్నే రాడ్‌క్లిఫ్ రేఖగా పిలుస్తారు.

ముస్లిం సిపాయిలే కావాలన్న పాక్...

కమిటీ ఎదుర్కొన్న అతి పెద్ద సవాళ్లలో సాయుధ బలగాల పంపిణీ ఒకటి. చర్చోపచర్చల తర్వాత దాదాపు మూడింట రెండొంతుల సైన్యం భారత్‌కు, ఒక వంతు పాక్‌కు చెందాలని నిర్ణయించారు. ఆ లెక్కన 2.6 లక్షల బలగాలు భారత్‌కు దక్కాయి. పాక్‌కు వెళ్లిన 1.4 లక్షల మంది సైనికుల్లో అత్యధికులు ముస్లింలే ఉండేలా జాగ్రత్త తీసుకున్నారు. తమ వంతుకు వచ్చిన కొద్ది మంది హిందూ సైనికులను కూడా పాక్ వీలైనంత వరకూ వెనక్కిచ్చి బదులుగా ముస్లిం సిపాయిలనే తీసుకుంది. సైనిక పంపకాలను పర్యవేక్షించిన బ్రిటిష్ సైనికాధికారుల్లో జనరల్ సర్ రాబర్ట్ లాక్‌హార్ట్ భారత్‌కు, జనరల్ సర్ ఫ్రాంక్ మెసెర్వీ పాక్‌కు తొలి సైన్యాధ్యక్షులయ్యారు!

ప్రెసిడెన్షియల్ బగ్గీలో రాష్ట్రపతి ముర్ము, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్



...బగ్గీ భారత్‌కే!

భారత్, పాక్ మధ్య పురాతన వస్తువులు, కళాఖండాల పంపకం ఓ పట్టాన తేలలేదు. మరీ ముఖ్యంగా బంగారు తాపడంతో కూడిన వైస్రాయ్ అందాల గుర్రపు బగ్గీ తమకే కావాలని ఇరు దేశాలూ పట్టుబట్టాయి. దాంతో చివరికేం చేశారో తెలుసా? టాస్ వేశారు! అందులో భారత్ నెగ్గి బగ్గీని అట్టిపెట్టుకుంది!

80:20 నిష్పత్తిలో చరాస్తులు

ఆఫీస్ ఫర్నిచర్, స్టేషనరీ వంటి చరాస్తులన్నింటినీ భారత్, పాక్ మధ్య 80:20 నిష్పత్తిలో పంచారు. చివరికి ఇదే నిష్పత్తిలో కరెంటు బల్బులను కూడా వదలకుండా పంచుకున్నారు!

జోయ్‌మోనీ, ద ఎలిఫెంట్!

జంతువులను కూడా రెండు దేశాలూ పంచేసుకున్నాయి. ఈ క్రమంలో జోయ్‌మోనీ అనే ఏనుగు పంపకం ప్రహసనాన్ని తలపించింది. దాన్ని పాక్‌కు (తూర్పు బెంగాల్‌కు, అంటే నేటి బంగ్లాదేశ్‌కు) ఇచ్చేయాలని నిర్ణయం జరిగింది. దాని విలువ ఓ రైలు బోగీతో సమానమని లెక్కగట్టారు. అలా ఓ రైలు బోగీ భారత్‌కు దక్కాలన్నది ఒప్పందం. కానీ విభజన వేళ జోయ్‌మోనీ మాల్దాలో ఉండిపోయింది. ఆ ప్రాంతం భారత్ (పశ్చిమబెంగాల్) వాటాకు వచ్చింది. దాంతో అది భారత్‌కే మిగిలిపోయింది.

ఆస్తులు, అప్పులు

ఆస్తులు, అప్పుల పంపకంపై కమిటీ తీవ్రంగా మల్లగుల్లాలు పడింది. చివరికి బ్రిటిషిండియా తాలూకు ఆస్తులు, అప్పుల్లో 17.5 శాతం పాక్‌కు చెందాలని తేల్చారు. దీనికి తోడు అదనంగా కొంత నగదు చెల్లించాల్సిందేనంటూ పాక్ భీష్మించుకుంది. అందుకు పటేల్ ససేమిరా అన్నారు. కశ్మీర్ పూర్తిగా భారత్‌కే చెందుతుందంటూ ఒప్పందంపై సంతకం చేస్తేనే నగదు సంగతి చూస్తామని కుండబద్దలు కొట్టారు. కానీ గాంధీ మాత్రం ఒప్పందం మేరకు పాక్‌కు డబ్బు చెల్లించాల్సిందేనంటూ ఏకంగా నిరాహార దీక్షకు దిగారు. దాంతో పటేల్ వద్దని మొత్తుకుంటున్నా 1947 జనవరి 20వ తేదీనే నెహ్రూ తాత్కాలిక సర్కారు పాక్‌కు రూ.20 కోట్లు చెల్లించింది. కానీ కశ్మీర్‌పై పాక్ దురాక్రమణ నేపథ్యంలో మరో రూ.75 కోట్ల చెల్లింపును నిలిపేసింది.

ఇప్పటికీ ఒకరికొకరు బాకీనే!

అప్పటికి చలామణిలో ఉన్న కరెన్సీ నోట్లు, నాణేలు 1948 మార్చి 31 దాకా ఇరు దేశాల్లోనూ చెల్లేలా ఒప్పందం జరిగింది. కానీ ఐదేళ్ల దాకా రెండు కరెన్సీలూ అక్కడా, ఇక్కడా చెలామణీ అవుతూ వచ్చాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా నగదు పంపకాల గోల ఇప్పటికీ తేలలేదు! రూ.300 కోట్ల 'విభజన ముందటి మొత్తం' పాక్ బాకీ ఉందని భారత్ అంటోంది. 2022–23 కేంద్ర ఆర్థిక సర్వేలో కూడా ఈ మొత్తాన్ని పేర్కొనడం విశేషం. కానీ భారతే తనకు రూ.560 కోట్లు బాకీ అన్నది పాక్ వాదన!

కొసమెరుపు

భారత్, పాక్ విభజన 'పగిలిన గుడ్లను తిరిగి అతికించడ'మంత అసాధ్యమంటూ అప్పట్లో ఓ ప్రఖ్యాత కాలమిస్టు పెదవి విరిచారు. అంతటి అసాధ్య కార్యం ఎట్టకేలకు సుసాధ్యమైంది!

– సాక్షి, నేషనల్ డెస్క్

గ్లైడ్ బాంబ్ 'గౌరవ్' ప్రయోగం సక్సెస్



న్యూఢిల్లీ: సుఖోయ్–30 యుద్ధ విమానం నుంచి భారత్ మొట్టమొదటిసారిగా ప్రయోగించిన లాంగ్ రేంజ్ గ్లైడ్ బాంబ్(ఎల్‌ఆర్‌జీబీ)గౌరవ్ పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని లాంగ్ వీలర్ ద్వీపంపైన ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని గ్లైడ్ బాంబ్ అత్యంత కచ్చితత్వంతో ఛేదించిందని రక్షణ శాఖ తెలిపింది. బాంబ్‌ను విడిచిపెట్టాక అది హైబ్రిడ్ నేవిగేషన్ వ్యవస్థ ద్వారా లక్ష్యం వైపుగా సాగిందని వివరించింది. సుమారు 1,000 కిలోల బరువుండే గౌరవ్‌కు దూర ప్రాంతంలోని లక్ష్యాలను ఛేదించే సత్తా ఉందని పేర్కొంది. దీనిని హైదరాబాద్‌లోని రీసెర్చి సెంటర్ ఇమారత్ రూపొందించి, అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసిన వైమానిక దళం, డీఆర్‌డీవో, ఇతర పరిశ్రమల అధికారులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు.

'ఉపా' చట్టాలకైనా 'బెయిల్' పాటించాల్సిందే

నిందితులకు బెయిల్ ఇవ్వాలన్న సూత్రంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉపా) వంటి అత్యంత కఠిన చట్టాల కింద అరెస్టయిన నిందితులకూ బెయిల్ సూత్రం వర్తింపజేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. అనుమానిత ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించాడన్న ఆరోపణలపై అరెస్టయిన మాజీ కానిస్టేబుల్‌కు బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యానించింది. ''బెయిల్ ఇవ్వాల్సిన అవసరం వచ్చినప్పుడు కోర్టులు పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు. నిందితుడిపై తీవ్ర ఆరోపణలున్నా చట్ట ప్రకారం బెయిల్‌కు సంబంధించిన అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాల్సిందే. బెయిల్ అనేది నియమం. బెయిల్‌ను తిరస్కరించి విచారణ ఖైదీగా జైలుకు పరిమితం చేయడం అనేది ఒక మినహాయింపు మాత్రమేననే సూత్రం ఎప్పుడో చట్టంలో అంతర్భాగమైంది. ఉపా వంటి కఠిన చట్టాలకూ దీన్ని వర్తింపజేయాల్సిందే. చట్టంలోని షరతులను సంతృప్తి పరిచే సందర్భాల్లో బెయిలివ్వాలి. లేదంటే 21వ ఆర్టికల్ కింద ఆ వ్యక్తి లభించిన జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛా హక్కులకు భంగం వాటిల్లినట్లే'' అని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది.



కమల నేలబారు అభ్యర్థి

- బైడెన్ కంటే అసమర్థురాలు
- మస్క్ ఇంటర్వ్యూలో ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తన ప్రత్యర్థి కమలా హారిస్‌ను చవకబారు అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్ అభివర్ణించారు. 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్‌కు ఇచ్చిన ఆడియో ఇంటర్వ్యూలో ట్రంప్ పలు అంశాలపై మాట్లాడారు. ''కమల నేలబారు అభ్యర్థి. ఆమె కంటే బైడెనే నయం. డెమొక్రటిక్ పార్టీలో తిరుగుబాటు వల్లే బైడెన్ రేసు నుంచి తప్పుకున్నారు. సరిహద్దు భద్రత విషయంలో కమలది ఘోర వైఫల్యం. ఆమె గెలిస్తే అక్రమ వలసలు భారీగా పెరుగుతాయి. వాటివల్లే అమెరికాలో నేరాలు పెరిగాయి'' అన్నారు.

హసీనాపై హత్యాభియోగాలు

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా, మరో ఆరుగురిపై హత్యాభియోగాలు నమోదయ్యాయి. ఆరుగురిలో ఇద్దరు ఆమె కేబినెట్‌లో మంత్రులు, పదవి కోల్పోయిన పోలీస్ చీఫ్ తదితరులున్నారు. వీరు కోర్టు విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని మంగళవారం అధికారులు తెలిపారు. ఈ నెల 5వ తేదీన పదవికి రాజీనామా చేసి, భారత్‌కు పలాయనమైన తర్వాత హసీనాపై నమోదైన మొదటి కేసు ఇదే. జూలైలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఘర్షణల్లో ఓ దుకాణం యజమాని అబూ సయ్యద్ మరణించారు. ఈ ఘటనపై ఢాకాలోని మహ్మద్‌పూర్ ఏరియాకు చెందిన అబూ సన్నిహితుడు అమిర్ హంజా షతిల్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలంటూ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ రాజేశ్ చౌదరి పోలీసులను ఆదేశించారని అధికారులు తెలిపారు. కాగా, ఫిర్యాదు చేసినందుకుగాను తనకు ఫ్రాన్స్ నుంచి బెదిరింపు కాల్ వచ్చిందని అనంతరం షతిల్ చెప్పారు. కాగా, హత్యాభియోగాలు నమోదైన మంత్రులిద్దరూ రహస్యంగా ఇప్పటికే దేశం వీడగా మిగతా పోలీసు అధికారుల ఆచూకీ తెలియడం లేదని చెబుతున్నారు.

హిందువులతో యూనుస్ సమావేశం

బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ మంగళవారం శక్తిపీఠాల్లో ఒకటిగా పేరుగాంచిన ప్రఖ్యాత ఢాకేశ్వరి ఆలయం ఆవరణలో హిందూమత పెద్దలతో సమావేశమయ్యారు. ప్రజలందరి హక్కులకు రక్షణ కల్పిస్తామని ఈ సందర్భంగా యూనుస్ హామీ ఇచ్చారు. దాడులకు కారకులను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత పాలకుల విధానాలే దేశంలో ప్రస్తుత పరిస్థితులకు కారణమని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం పని తీరును బేరీజు వేసే ముందు సంయమనంతో వ్యవహరించాలని హిందూమత పెద్దలను ఆయన కోరారు. 'అందరికీ సమాన హక్కులున్నాయి. అందరం ఒకే హక్కు ఉన్న ప్రజలం. మన మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు కల్పించవద్దు. దయచేసి, మాకు సహకరించండి ఓపిక పట్టండి. ఆ తర్వాత తీర్పు చెప్పండి. చేయగలిగి ఉండీ చేయడంలో విఫలమైతే మమ్మల్ని విమర్శించండి'అని యూనుస్ చెప్పినట్లు 'ది డైలీ స్టార్'పేర్కొంది.

న్యాయం కావాలి: హసీనా



ఢాకా/న్యూఢిల్లీ: అమాయకులను ఊచకోతకు, తీవ్రవాద చర్యలకు బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా డిమాండ్ చేశారు. ఈ మొత్తం ఉదంతంలో న్యాయం కావాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5వ తేదీన రాజీనామా చేసి బంగ్లాదేశ్‌ను వీడాక ఆమె తొలిసారిగా మంగళవారం నోరువిప్పారు. హసీనా ప్రస్తుతం ఢిల్లీలో ఆశ్రయం పొందుతుండటం తెలిసిందే. అమెరికాలో నివసించే కుమారుడు సాజీబ్ వాజిద్ జాయ్ 'ఎక్స్' ఖాతాలో హసీనా తన ప్రకటనను విడుదల చేశారు. ''జూలై నుంచి ఆందోళనల పేరిట జరుగుతున్న హింసలో తీవ్ర ప్రాణనష్టం జరిగింది. పెచ్చరిల్లిన హింసాకాండలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు, గర్భిణులు, జర్నలిస్టులు, సాంస్కృతిక ఉద్యమకారులు, శ్రామికవర్గ ప్రజలు, అవామీలీగ్ నాయకులు, కార్యకర్తలు, సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. నాలాగే ఆప్తులను కోల్పోయి బతుకీడుస్తున్న వారికి నా సానుభూతి'' అని హసీనా పేర్కొన్నారు.

బంగబంధుకు అవమానం

1975 ఆగస్టు 15వ తేదీన తన కుటుంబం ఊచకోతకు గురైన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. హత్యకు గురైన బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ (హసీనా తండ్రి) స్మృత్యర్థం ఆగస్టు 15న ఇస్తున్న సెలవును యూనుస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం మంగళవారం రద్దు చేసింది. బంగబంధు మ్యూజియంను తగలబెట్టడంపై హసీనా తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. ఎవరి జ్ఞాపకాలతో, స్ఫూర్తితో మనం జీవించాలో దాన్నే కాల్చి బూడిద చేశారని పేర్కొన్నారు. 'ఎవరి నాయకత్వంలో బంగ్లాదేశ్ స్వాతంత్య్రం పొందిందో ఆయనకిది తీవ్ర అవమానం. ఈ దుశ్చర్యకు దేశప్రజలు నాకు న్యాయం చేకూర్చాలని కోరుతున్నాను' అని హసీనా అన్నారు. ఆగస్టు 15న జాతీయ సంస్మరణ దినాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని, చనిపోయిన వారి ఆత్మశాంతి కోసం ప్రార్థించాలని బంగ్లాదేశ్ ప్రజలకు పిలుపిచ్చారు.

వైద్యురాలి కేసు సీబీఐకి

సమ్మె విరమించిన వైద్యులు

కోల్‌కతా/న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న వైద్యురాలి హత్యాచారం కేసు విచారణకు సీబీఐ రంగంలోకి దిగింది. కేసును సీబీఐకి బదిలీ చేస్తూ కలకత్తా హైకోర్టు మంగళవారం ఆదేశాలిచ్చింది. అనంతరం గంటల వ్యవధిలోనే ఫోరెన్సిక్, వైద్య నిపుణులతో కూడిన సీబీఐ ప్రత్యేక బృందం హుటాహుటిన కోల్‌కతా చేరుకుంది. కేసు దర్యాప్తును సీబీఐ ముమ్మరం చేసింది. నిందితున్ని కస్టడీలోకి తీసుకుని విచారించడమే గాక క్రైం సీన్‌ను రిక్రియేట్ చేయనుంది. మరోవైపు తమ ప్రధాన డిమాండ్లపై కేంద్రం సానుకూలంగా స్పందించడంతో దేశవ్యాప్త సమ్మెను విరమిస్తున్నట్టు వైద్యులు ప్రకటించారు.

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సెక్యూరిటీ విధుల్లో ఉన్న ఓ ప్రబుద్ధుడు గత గురువారం రాత్రి ఓ ట్రైనీ డాక్టర్‌ను రేప్ చేసి దారుణంగా హతమార్చడం తెలిసిందే. దీనిపై వైద్యులు, వైద్య సిబ్బంది భగ్గుమన్నారు. ఇందులో ఇతరుల హస్తమూ ఉందని, అందుకు సంబంధించిన సాక్ష్యాలన్నింటినీ పక్కాగా చెరిపేశారని ఆరోపించారు. దోషులందరికీ కఠిన శిక్షలు పడాలంటూ సోమవారం నుంచి దేశవ్యాప్తంగా విధులు బహిష్కరించి ఆందోళనలకు తెర తీశారు. కేసు విచారణను సీబీఐకి అప్పగించాలంటూ బాధితురాలి తల్లిదండ్రులతో పాటు పలువురు పెట్టుకున్న పిల్స్‌పై కలకత్తా హైకోర్టు మంగళవారం విచారించింది. కోల్‌కతా పోలీసుల దర్యాప్తుపై పెదవి విరిచింది. ఐదు రోజులు దాటినా ప్రగతి లేదంటూ విచారణను సీబీఐకి బదలాయించింది.

ప్రిన్సిపల్ తీరు క్షమార్హం కాదు

ఈ ఉదంతంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ తీరు దారుణమంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ శివజ్ఞానం మండిపడ్డారు. ''కాలేజీ క్యాంపస్ లోపల ఏకంగా మహిళా డాక్టర్‌ను రేప్ చేసి దారుణంగా హతమార్చినా ఆయన సత్వరం స్పందించలేదు. హత్య జరిగిందంటూ కనీసం సకాలంలో పోలీసులకు ఫిర్యాదు కూడా చేయలేదు. ఇది క్షమార్హం కాదు'' అంటూ తీవ్రంగా తలంటారు. వైద్య విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ఘోష్ రాజీనామా చేయడం తెలిసిందే. మమత సర్కారు దాన్ని ఆమోదించకపోగా ఆయనను కలకత్తా నేషనల్ మెడికల్ కాలేజీ (సీఎన్‌ఎంసీహెచ్)కు బదిలీ చేయడంపై సీజే విస్మయం వెలిబుచ్చారు. తక్షణం సెలవుపై వెళ్లాలని ఘోష్‌ను ఆదేశించారు. తదుపరి ఆదేశాలిచ్చే దాకా ఇంటికే పరిమితం కావాలని స్పష్టం చేశారు.

డిమాండ్లకు కేంద్రం ఒప్పుకొంది: ఫోర్డా

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తమ డిమాండ్లకు సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమించాలని నిర్ణయించినట్లు ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్స్ (ఫోర్డా) మంగళవారం రాత్రి ప్రకటించింది. ''మంత్రితో భేటీ అయ్యాం. వైద్యులు, వైద్య సిబ్బంది భద్రతకు ఉద్దేశించిన కేంద్ర రక్షణ చట్టంపై ఫోర్డా సహకారంతో కమిటీ వేయాలనే ప్రధాన డిమాండ్‌ను 15 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు'' అని తెలిపింది.

22న దేశవ్యాప్త నిరసన

- సెబీ చీఫ్ రాజీనామా చేయాల్సిందే
- సెబీ, అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలి
- సమగ్ర దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ డిమాండ్
- రానున్న ఎన్నికల సన్నద్ధత, సంస్థాగత అంశాలపై చర్చ
- ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇంఛార్జులు, పీసీసీ అధ్యక్షులతో ఖర్గే భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో సెక్యూరిటీస్, ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) చైర్‌పర్సన్ మాధవి పురీ బుచ్, ఆమె భర్త ధవళ్‌కు వాటాలు ఉన్నాయని అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ చేసిన సంచలన ఆరోపణలపై రాజకీయ వేడి మరింత పెరిగింది. వివాదంలో కేంద్ర బిందువుగా మారిన మాధవి వెంటనే రాజీనామా చేయాలని, అదానీ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) విచారణకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఈనెల 22వ తేదీన దేశవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జులు, పీసీసీ చీఫ్‌లతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భేటీ తర్వాత పార్టీ ఈ ప్రకటన చేసింది. ఈ ప్రత్యేక సమావేశంలో రాబోయే ఎన్నికల కోసం పార్టీ సన్నద్ధత, సంస్థాగత అంశాలు, ఎన్నికలపరంగా జాతీయ ప్రాముఖ్యత గల వివిధ అంశాలు, సమస్యలపై ముఖ్యనేతలు విస్తృతంగా చర్చించారు. హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూకశ్మీర్‌లలో త్వరలో ఎన్నికలు జరగనున్న విషయం విదితమే. ''అదానీ– మాధవి బుచ్ ఉదంతంలో ప్రధాని మోదీ పాత్ర కూడా ఉంది. ఒక సంస్థ ప్రయోజనాల కోసం మార్కెట్ నియంత్రణ సంస్థ ఎంతగా ప్రలోభాలకు గురైందో ఈ ఉదంతం చాటుతోంది'' అని నేతలు భేటీలో తీర్మానం చేశారు. భేటీ వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియా సమావేశంలో వెల్లడించారు. హిండెన్‌బర్గ్ ఉదంతం సహా దేశంలోని పలు సమస్యలపై దేశవ్యాప్తంగా ప్రజలను ఏకం చేసే అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని, అందుకుతగ్గ ప్రచారానికి రూపకల్పన చేసి ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ నిర్ణయించింది. కేరళ వయనాడ్ కొండల్లో ప్రకృతి విలయతాండవం ధాటికి వందల మంది ప్రాణాలు కోల్పోవడంపై సమావేశం తీవ్ర ఆవేదనను, సంతాపాన్ని వ్యక్తం చేసింది. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న రాహుల్ డిమాండ్‌ను నేతలు పునరుద్ఘాటించారు. బంగ్లాదేశ్‌లో దాడులకు గురవుతున్న బాధిత మైనారిటీలు గౌరవంగా బతికేలా తగు సహాయక, పునరావాస చర్యలు తీసుకునేలా మోదీ ప్రభుత్వం బంగ్లాదేశ్ సర్కార్‌పై ఒత్తిడి తేవాలని కాంగ్రెస్ డిమాండ్‌చేసింది.



ఏఐసీసీ భేటీ అనంతరం బయటికొస్తున్న ఖర్గే, రాహుల్, వేణుగోపాల్ తదితరులు

పేదలు, మధ్యతరగతిని వంచించారు: ఖర్గే

''స్టాక్‌మార్కెట్లో చిన్న మదుపరుల పెట్టుబడుల భవితవ్యం అగమ్యగోచరం కాకూడదు. హిండెన్‌బర్గ్ బట్టబయలుచేసిన సెబీ, అదానీల ఉదంతం యావత్‌భారతావనికి షాక్‌కు గురిచేసింది. సెబీ, అదానీ సంబంధాలను బయటపెట్టేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ నేతృత్వంలో దర్యాప్తు జరపాల్సిందే. రాజ్యాంగంపై దాడి నిరాటంకంగా కొనసాగుతోంది. కుల గణన అనేది ప్రజల డిమాండ్. ఈ అంశాలపై త్వరలో దేశవ్యాప్తంగా ప్రజాచైతన్య యాత్రలను చేపడదాం. రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాల్సిందే. అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలి. దేశంలో హద్దులేని నిరుద్యోగం, పగ్గాల్లేని ద్రవ్యోల్బణంతో పేద, మధ్య తరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పేదలు, మధ్యతరగతిని ప్రభుత్వం వంచించింది. రైళ్లు పట్టాలు తప్పడం, రైలు ప్రమాదాలు ఆనవాయితీగా మారాయి'' అని ఖర్గే అన్నారు.


జేపీసీ చీఫ్‌గా బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్



న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్(సవరణ)బిల్లుపై పార్లమెంట్ సంయుక్త కమిటీ(జేపీసీ) ఖరారైంది. కమిటీ చైర్‌పర్సన్‌గా బీజేపీ సీనియర్ లోక్‌సభ సభ్యుడు జగదాంబికా పాల్‌ను స్పీకర్ ఓం బిర్లా నియమించారు. కమిటీలోని 31 మందిలో 21 మంది లోక్‌సభ సభ్యులుకాగా, 10 మంది రాజ్యసభ ఎంపీలని లోక్‌సభ సెక్రటేరియట్ ఒక నోటిఫికేషన్‌లో వెల్లడించింది. లోక్‌సభకు చెందిన 21 మందిలో ఎన్డీఏ పక్షాల సభ్యులు 12 మంది, బీజేపీకి చెందిన 8 మంది, ప్రతిపక్షాల నుంచి 9 మంది ఉన్నారు. అదేవిధంగా, 10 మంది రాజ్యసభ సభ్యుల్లో బీజేపీ నుంచి నలుగురు, విపక్షాలకు చెందిన నలుగురు, వైఎస్సార్‌సీపీకి చెందిన ఒకరు, నామినేటెడ్ సభ్యుడొకరు ఉన్నారు. ఈ కమిటీ వచ్చే లోక్‌సభ సెషన్ మొదటి వారం చివరి రోజున నివేదిక సమర్పించనుందని సెక్రటేరియట్ వివరించింది.

అతిశి కాదు గెహ్లోత్

- జెండా ఆవిష్కరణ బాధ్యతలు అప్పగింత
- కేజ్రీవాల్ అభ్యర్థనను బేఖాతరు చేసిన ఎల్‌జీ



గెహ్లోత్



అతిశి

న్యూఢిల్లీ: ఢిల్లీ రాష్ట్ర పరిపాలనా వ్యవహారాల్లో అధికార ఆధిపత్యం కోసం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకునే ఆప్ సర్కార్‌కు, ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్‌కు మధ్య మరోసారి ఘర్షణాత్మక వేడి వాతావరణం నెలకొని చివరకు చల్లారింది. ముఖ్యమంత్రి అయిన తాను కటకటాల వెనక ఉండిపోవడంతో బదులుగా రాష్ట్ర మహిళా మంత్రి అతిశికి ఈసారి స్వాతంత్య్ర దినోత్సవ ఢిల్లీ రాష్ట్ర వేడుకల్లో జాతీయ జెండా ఆవిష్కరణ అవకాశం ఇవ్వాలన్న కేజ్రీవాల్ అభ్యర్థన లేఖను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ బేఖాతరు చేశారు. జైలు నుంచి అధికారిక లేఖ రాయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ కేజ్రీవాల్ అభ్యర్థనను లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా తిరస్కరించారు. ఛాత్రాసాల్ స్టేడియంలో జరిగే పంద్రాగస్టు వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ కోసం రాష్ట్ర హోం మంత్రి కైలాశ్ గెహ్లోత్‌ను నామినేట్ చేస్తూ ఎల్‌జీ నిర్ణయం తీసుకున్నారని 'రాజ్ నివాస్' మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్ కుమార్‌కు ఎల్‌జీ సచివాలయం కార్యదర్శి ఆశిష్ కుంద్రా లేఖ రాశారు. రాష్ట్ర మంత్రుల్లో ఎవరినైనా ఇందుకు ఎంపిక చేసుకునేందుకు ఎల్‌జీకి కేంద్ర హోం శాఖ మంగళవారం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఎల్‌జీ తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

డేరా సచ్ఛా సౌదా చీఫ్‌కు 21 రోజుల పెరోల్



చండీగఢ్: అత్యాచారం కేసులో దోషిగా తేలిన డేరా సచ్ఛా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ మరోసారి పెరోల్ సంపాదించి జైలు నుంచి తాత్కాలికంగా విడుదలయ్యారు. ఆయనకు పెరోల్ ఇవ్వద్దంటూ శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ వేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ గుర్మీత్‌కు పంజాబ్, హర్యానా హైకోర్టు పెరోల్ ఇచ్చింది. దీంతో మంగళవారం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. 21 రోజులపాటు ఆయన ఉత్తరప్రదేశ్‌లోని బర్నావా సమీపంలోని సొంత షా సత్నామ్ జీ ఆశ్రమంలో సేదతీరనున్నారు. తనకు 21 రోజుల పెరోల్ కావాలంటూ జూన్‌లో గుర్మీత్ హైకోర్టును ఆశ్రయించగా ఈ పిటిషన్‌పై సంబంధిత అధికార యంత్రాంగం తేల్చాలని హైకోర్టు ఆగస్ట్ 9వ తేదీన ఆదేశించడం తెల్సిందే. జనవరి 19వ తేదీన సైతం గుర్మీత్ ఏకంగా 50 రోజులపాటు పెరోల్‌పై బయటికొచ్చారు. తన ఇద్దరు మహిళా భక్తులను రేప్ చేసిన కేసులో దోషిగా తేలడంతో గుర్మీత్‌కు 2017 సంవత్సరంలో 20 ఏళ్ల జైలుశిక్ష పడింది. అప్పటి నుంచి హరియాణాలోని రోహ్‌తక్ జిల్లా సునారియా కారాగారంలో గుర్మీత్ శిక్ష అనుభవిస్తున్నారు.

ఆశారాంకు ఏడు రోజుల పెరోల్




జైపూర్: ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపూ(85)నకు రాజస్తాన్ హైకోర్టు ఏడు రోజుల పెరోల్ మంజూరు చేసింది. అత్యాచారం కేసులో జోధ్‌పూర్ సెంట్రల్‌లో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఆశారాం గతంలో రెండుసార్లు వేసిన పెరోల్ పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. ఆయన్ను విడుదల చేస్తే శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని పేర్కొంది. ఫిబ్రవరిలో ఛాతీలో తీవ్ర నొప్పి రావడంతో ఆశారాంను జోధ్‌పూర్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. 11 ఏళ్లుగా జైలులో ఉన్న తన ఆరోగ్యం క్షీణిస్తోందని, చికిత్స చేయించకుంటే జైలులోనే మృతి చెందే ప్రమాదముందని వైద్యులు తెలిపారని ఆశారాం తరఫు లాయర్ పిటిషన్ వేశారు. దీనిని హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. వారం రోజుల పెరోల్ సమయంలో మహారాష్ట్రలోని పుణేకు వెళ్లి చికిత్స చేయించుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సునేత్రను నిలబెట్టి తప్పుచేశా: అజిత్



ముంబై: మహారాష్ట్రలోని బారామతి లోక్‌సభ స్థానంలో సిట్టింగ్ మహిళా ఎంపీ సుప్రియా సూలేపై తన భార్య సునేత్రను పోటీకి నిలబెట్టి పొరపాటు చేశానని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ వ్యాఖ్యానించారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)ని చీల్చిన అజిత్‌పవార్ బారామతిలో తన బాబాయి కుమార్తె సుప్రియాపైకి సునేత్రను పోటీకి నిలబెట్టడం, సునేత్ర ఓడిపోవడం తెల్సిందే. రాష్ట్రవ్యాప్త జన సమ్మాన్ యాత్రలో భాగంగా మంగళవారం ఒక మరాఠీ వార్తాఛానల్‌తో అజిత్ పవార్ మాట్లాడారు. '' నా సోదరీమణులంటే నాకెంతో ప్రేమ. రాజకీయాలు ఇంటి గడప దాటి లోపలికి వచ్చేలా చేసుకోకూడదు. అయితే నా సోదరి మీదనే భార్యను ఎన్నికల్లో పోటీకి నిలబెట్టి తప్పుచేశా. ఇలా జరగకుండా ఉండాల్సింది. అయితే సునేత్రను నిలబెట్టాలని పార్టీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయించడంతో నేను కూడా ఏమీచేయలేకపోయా. తప్పు చేసినందుకు ఇప్పుడు బాధపడుతున్నా'' అని వ్యాఖ్యానించారు. సుప్రియా చేతిలో ఓడిపోయిన సునేత్రా పవార్ తర్వాత రాజ్యసభకు ఎన్నికవడం తెల్సిందే.

హసీనా చెప్పిందంతా అబద్ధం: అమెరికా



వాషింగ్టన్: బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా ప్రభుత్వం జోక్యం చేసుకుందన్న ఆరోపణలను అగ్రరాజ్యం తోసిపుచ్చింది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరీన్ జీన్ పియరీ సోమవారం మీడియాతో మాట్లాడారు. అమెరికా కోరినట్టుగా సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని వారికి అప్పగించి, బంగాళాఖాతంలో ఆధిపత్యం చెలాయించడానికి అగ్రరాజ్యాన్ని అనుమతించి ఉంటే తాను ప్రధానిగా కొనసాగేదాన్నని హసీనా పేర్కొన్నట్టు వచ్చిన కథనాలను వదంతులుగా పియరీ కొట్టిపారేశారు. బంగ్లాదేశ్ ప్రజలే తమ ప్రభుత్వ భవిష్యత్తును నిర్ణయించుకుంటారన్నారు. బంగ్లాదేశ్‌లో మానవ హక్కుల సమస్యలపై గళం విప్పడానికి అధ్యక్షుడు జో బైడెన్ ఎప్పుడూ కట్టుబడి ఉంటారని పియరీ పేర్కొన్నారు.

ఆ యూనివర్సిటీది 'వరద జిహాద్'

అసోం సీఎం శర్మ ఆరోపణలు



గువాహటి: అసోం–మేఘాలయ సరిహద్దుల్లోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీపై అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తీవ్ర ఆరోపణలు చేశారు. అది వరద జిహాద్‌కు పాల్పడుతోందని, మక్కా గేట్ల మాదిరిగా వర్సిటీ గేట్లపై మూడు గుమ్మటాలున్నాయని వ్యాఖ్యానించారు. ''మేఘాలయలోని రి–భోయి జిల్లాలో వందెకరాల్లో విస్తరించి ఉన్న వర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మేఘాలయ (యూఎస్‌టీఎం) అసోం కొండలను తొలిచి పర్యావరణాన్ని దెబ్బతీస్తోంది. దానివల్లే మా రాష్ట్రానికి వరదల బెడద ఎక్కువైంది. దీనిపై ఎన్‌జీటీని ఆశ్రయిస్తాం'' అని చెప్పారు. మహబూబ్ ఉల్ హక్ అనే బెంగాలీ ముస్లిం ఈ వర్సిటీ స్థాపకుడు.



డేంజర్ స్పీడ్!

'స్పీడ్ థ్రిల్స్ బట్ కిల్స్' ఇది ముమ్మాటికీ నిజమని ఇటీవలి రోడ్డు ప్రమాదాలు స్పష్టం చేస్తున్నాయి. సోమవారం వేర్వేరు ప్రాంతాల్లో నలుగురిని పొట్టన పెట్టుకుంది అతివేగమే. -8లో



కథ చెబుతాం.. ఊ కొడతారా..


పిల్లలు, వారి తల్లిదండ్రులతో పాటు విద్యార్థులకు బోధించే టీచర్ల నుంచి కార్పొరేట్ ఉద్యోగులకు పాఠాలు చెప్పే కౌన్సిలర్స్ వరకూ కథల విందుకు క్యూ కడుతున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం, చిరు జల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

గోల్కొండ కోటలో డీజీపీ పర్యటన



పతాకావిష్కరణ వేదికను పరిశీలిస్తున్న డీజీపీ జితేందర్

గోల్కొండ: గోల్కొండ కోటలో జరిగే పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఓ వైపు పతాకావిష్కరణ వేదిక, వీఐపీల గ్యాలరీ ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. మరో వైపు పోలీస్ పరేడ్ రిహార్సల్స్ జోరందుకున్నాయి. మంగళవారం డీజీపీ డాక్టర్ జితేందర్ వివిధ శాఖల అధికారులతో కలిసి కోటలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా ఆయన పతాకావిష్కరణ జరిగే వేదికను పరిశీలించారు. ముఖ్యమంత్రి కోటలోకి ప్రవేశించగానే తీసుకునే ప్రొటోకాల్ విషయంపై కూడా ఆయన అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఏర్పాట్లల్లో పొరపాట్లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వేదిక వరకు ముఖ్యమంత్రి వచ్చే మార్గంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రి కోసం ఏర్పాటు చేసిన రెస్ట్ రూమ్‌ను సైతం ఆయన పరిశీలించారు.

ఘట్‌కేసర్ సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్



హన్మంతరావు (ఫైల్)

ఘట్‌కేసర్: సంగారెడ్డిలో నిబంధనలకు విరుద్ధంగా భూములను రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలపై ప్రస్తుత ఘట్‌కేసర్ సబ్ రిజిస్ట్రార్, అప్పటి పటాన్‌చెరు జాయింట్–1 రిజిస్ట్రార్ హన్మంతరావును స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ సస్పెండ్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పటానుచెరు ప్రాంతంలో కోట్లాది రూపాయల విలువైన వివాదాస్పద భూములు, నిషేధిత జాబితాలోని ఇళ్ల స్థలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ మేరకు ఈ నెల 1న సంగారెడ్డిలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రెండు రోజుల పాటు అధికారులు తనిఖీలు చేశారు. ఒకేరోజు ప్రభుత్వ భూములు, రెవెన్యూ కస్టోడియన్ భూముల్లోని వందలాది ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. కాగా.. హన్మంతరావు ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఈ నెల 3న బాధ్యతలు స్వీకరించి మూడు నాలుగు రోజులు మాత్రమే విధులు నిర్వర్తించారు.

విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలు

సైబరాబాద్ సీపీ ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: ర్యాగింగ్ భూతాన్ని తుదముట్టించేందుకు సైబరాబాద్ పోలీసులు నడుం కట్టారు. విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నిరోధక చర్యలకు ఉపక్రమించారు. ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్లు, వార్డెన్లు, తల్లిదండ్రులు, విద్యార్థులతో కూడిన 'యాంటీ ర్యాగింగ్ కమిటీ'లను ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులతో సమన్వయంగా ఈ కమిటీలు పని చేయాలని సూచించారు. విద్యా సంస్థల లోపల, చుట్టుపక్కల ప్రదేశాలలో ర్యాగింగ్ నిరోధక చట్టాలను హైలెట్ చేస్తూ పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. ర్యాగింగ్ నిషేధ చట్టం– 1997లోని సెక్షన్– 4 ప్రకారం ర్యాగింగ్‌కు పాల్పడితే ఆరు నెలల నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముంది. ర్యాగింగ్ చేసి దోషిగా తేలిన వారిని విద్యా సంస్థ నుంచి తొలగిస్తారు. 6 నెలలు దాటి జైలు శిక్ష ఖరారైతే ఆ విద్యార్థి మరే ఇతర విద్యా సంస్థలో ప్రవేశం పొందలేడన్నారు.

బడికెళ్లి వస్తుండగా బలయ్యాడు

కారు ఢీకొని 9వ తరగతి విద్యార్థి మృతి



కార్తీక్ (ఫైల్)

అల్వాల్: మితిమీరిన వేగం ఓ విద్యార్థి ప్రాణాలను బలిగొంది. పాఠశాల నుంచి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా కారు ఢీకొట్టడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జేజేనగర్ అంతయ్య కాలనీకి చెందిన ఎం.కార్తీక్ (14) సెయింట్ జాన్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం స్కూల్ విడిచిపెట్టిన తర్వాత ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా.. రామకృష్ణపురం వంతెన సమీపంలో అతివేగంగా వచ్చిన కారు ఢీకొంది. తలకు తీవ్ర గాయాలు కావడంతో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు అదే వేగంతో అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. కారు నడుపుతున్న వ్యక్తి విశ్రాంత ఐపీఎస్ విజయ్‌కుమార్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కార్తీక్ తండ్రి అయిదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందినట్లు, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ బాలుడి బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.







తిరంగా.. సగర్వంగా..

మువ్వన్నెల జెండా మెరిసింది. పాతబస్తీలో తిరంగా మురిసింది. స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో జాతీయ జెండాల ప్రదర్శన ర్యాలీని నిర్వహించారు. దారుషిఫా గ్రౌండ్ నుంచి బయలుదేరిన తిరంగా ర్యాలీ చార్మినార్ వరకు కొనసాగింది. విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - చార్మినార్



ఇక.. అపార్ట్‌మెంట్లలో డస్ట్‌బిన్లు

ఏర్పాటు చేయాలని ఆమ్రపాలి ఆదేశం



సాక్షి, సిటీబ్యూరో: స్వచ్ఛ ర్యాంకుల కోసం గతంలో వీధులు, రోడ్ల వెంబడి ఉన్న డంపర్ బిన్లను తొలగించిన జీహెచ్ఎంసీ.. ఇప్పుడు అపార్ట్‌మెంట్లలో డస్ట్‌బిన్ల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ఇంటింటి నుంచి చెత్త సేకరణ రోజూ సవ్యంగా సాగడం లేదని గుర్తించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి.. అపార్ట్‌మెంట్లలో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయడం వల్ల చెత్త సేకరించే స్వచ్ఛ కార్మికులకు సమయం కలిసి వచ్చి పరిస్థితి మెరుగుపడగలదని భావించారు. తన ఆలోచనను అమలు చేసేందుకుగాను అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్లను సంప్రదించి డస్ట్‌బిన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా జోనల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేశారు. అపార్ట్‌మెంట్లలో ఉన్న అన్ని ఫ్లాట్ల వద్దకు వెళ్లి చెత్త సేకరించడం వల్ల ఎక్కువ సమయం పడుతుందని.. అలా కాకుండా అపార్ట్‌మెంట్‌లోని అన్ని ఫ్లాట్ల వారు చెత్తను ఒక డస్ట్‌బిన్‌లో వేస్తే స్వచ్ఛ కార్మికులు అన్ని అంతస్తులు, అన్ని ఫ్లాట్లకు వెళ్లే సమయం కలిసి వస్తుందని భావించారు. తమ ఇంటికి సైతం చెత్త సేకరణ రోజూ జరగడం లేదని ఇటీవల ఆమ్రపాలి వ్యాఖ్యానించడం తెలిసిందే. చెత్త సేకరణ సమస్య పరిష్కారానికి గాను ఆమె ఈ కొత్త ఆలోచన చేశారు. డస్ట్ బిన్లు సైతం తడి, పొడి చెత్తకు వేర్వేరుగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె సూచించారు.

ఐటీ కారిడార్‌లో పీఆర్‌టీఎస్

ఆకాశ మార్గాల్లో పాడ్‌కార్స్

- రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి ఐటీ సంస్థలకు
- పీపీపీ పద్ధతిలో ఏర్పాటుపై ఉమ్టా ప్రతిపాదనలు
- మెట్రో టు ఐటీ సీమ్‌లెస్ జర్నీ

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో స్టేషన్ల నుంచి ఐటీ సంస్థలకు నేరుగా రాకపోకలు సాగించేందుకు వీలుగా పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిస్ట్ సిస్టమ్ (పీఆర్‌టీఎస్)పై ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి. గతంలో ప్రతిపాదించిన బస్ ర్యాపిడ్ ట్రాన్సిస్ట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్)కు ప్రత్యామ్నాయంగా పీఆర్‌టీఎస్‌పై హెచ్ఎండీఏ అనుబంధ సంస్థ ఉమ్టా (యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ) ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తే ఆకాశమార్గంలో పరుగులు పెట్టే డ్రైవర్ రహిత పాడ్‌కార్స్ సదుపాయం నగరంలో అందుబాటులోకి రానుంది. దీంతో వాహనాల రద్దీ కూడా తగ్గనుంది.

ప్రత్యామ్నాయాలపై ఉమ్టా దృష్టి..

- మెట్రో మార్గాల్లో లాస్ట్‌మైల్ కనెక్టివిటీపై వివిధ రకాల ప్రత్యామ్నాయాలపై ఉమ్టా దృష్టి సారించింది. ఈ క్రమంలో మెట్రో స్టేషన్ చుట్టూ 500 మీటర్ల పరిధిలో మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంటీఎస్) ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఐటీ మార్గాల్లో మెట్రో స్టేషన్‌ల నుంచి ఐటీ సంస్థల వరకు పీఆర్‌టీఎస్‌ను అందుబాటులోకి తేవడం వల్ల వ్యక్తిగత వాహనాల వినియోగం భారీగా తగ్గే అవకాశం ఉంటుందని ఉమ్టా అంచనా వేస్తోంది. ఇందులో భాగంగానే ప్రయోగాత్మకంగా రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి చుట్టుపక్కల ఉన్న ఐటీ సంస్థలకు ఈ తరహా పీఆర్‌టీఎస్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.
- 'రాయదుర్గం చుట్టుపక్కల ఐటీ దిగ్గజ సంస్థల్లో వేలాది మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు, వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు పని చేస్తున్నారు. చాలామంది మెట్రో రైళ్లలో రాయదుర్గం వరకు వచ్చినా అక్కడి నుంచి



రోడ్డు మార్గంలోనే వెళ్లాల్సి ఉంటుంది. ట్రాఫిక్ రద్దీ కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పీఆర్‌టీఎస్ అందుబాటులోకి వస్తే ఈ ఇబ్బందులు తొలగిపోతాయి' అని ఉమ్టా ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఒక్కో ఐటీ సంస్థలో సగటున 10 వేల నుంచి 30 వేల మంది వరకు వివిధ కేటగిరీలకు చెందిన ఉద్యోగులు ఉన్నట్లు అంచనా. పీఆర్‌టీఎస్‌తో వారంతా రాయదుర్గం స్టేషన్ నుంచి నేరుగా తమ కార్యాలయ భవన ప్రాంగణంలోకి చేరుకోవచ్చు.

పాడ్‌కార్స్.. డ్రైవర్‌లెస్..

- ప్రస్తుతం అమెరికా, బ్రిటన్, దుబాయ్, దక్షిణ కొరియాలలో పీఆర్‌టీఎస్ సదుపాయం ఉంది. ప్రధానమైన ప్రజారవాణా సదుపాయాలతో దీన్ని అనుసంధానం చేశారు. అంతర్జాతీయ హంగులతో గ్లోబల్ సిటీగా అవతరిస్తోన్న హైదరాబాద్‌లో మెట్రోకు, ఐటీ కారిడార్‌లకు అనుసంధానం చేసేలా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తే రోడ్లపై రద్దీ గణనీయంగా తగ్గుముఖం పట్టనుంది. మరోవైపు ఐటీ సంస్థలపై రవాణా భారం కూడా తగ్గుతుంది.
- పీఆర్‌టీఎస్ ప్రాజెక్టుకు ఒక్కో కిలో మీటర్‌కు రూ.80 కోట్ల వరకు ఖర్చు కాగలదని అంచనా. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో దీన్ని చేపట్టడం వల్ల ప్రభుత్వంపై భారం తగ్గుతుంది. ఆయా ఐటీ సంస్థలను కూడా ఈ ప్రాజెక్టులో భాగస్వాములను చేయాలని అధికారులు భావిస్తున్నారు. పీఆర్‌టీఎస్‌లో పాడ్‌కార్స్ రాకపోకలు సాగించేందుకు రెండు మార్గాలు ఉంటాయి. ఇవి డ్రైవర్ రహిత వాహనాలు. ఆటోమోటెడ్ గైడ్‌వే ట్రాన్సిట్ (ఏజీటీ) పద్ధతిలో ఇవి పరుగులు తీస్తాయి. ఒక్కో పాడ్‌కార్‌లో ఆరుగురు కూర్చొని ప్రయాణం చేయవచ్చు. ఈ బ్యాటరీ ఆధారిత వాహనాలు మెట్రో నుంచి సంబంధిత కార్యాలయం వరకు నిరంతరం తిరుగుతూనే ఉంటాయి. దీంతో రైలు దిగిన ప్రయాణికులు మెట్రో స్టేషన్ కాంకోర్ లెవల్ నుంచి పాడ్‌కార్‌లో నేరుగా బయలుదేరవచ్చు.

సీమ్‌లెస్ ఫీడర్ నెట్‌వర్క్..

రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ప్రతి రోజు సుమారు 45 వేల నుంచి 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రయాణికుల్లో అత్యధికంగా ఐటీ దిగ్గజ సంస్థల్లో పని చేసే వారే. ఈ ప్రయాణికులు మెట్రో దిగిన తర్వాత రోడ్డు మార్గంలోనే ర్యాపిడో, ఓలా, ఉబెర్ వంటి క్యాబ్, ఆటో సదుపాయాలను వినియోగించాల్సి వస్తోంది. పీఆర్‌టీఎస్ ఏర్పాటు చేయడం వల్ల సీమ్‌లెస్ ఫీడర్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసినట్లవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇది లాస్ట్‌మైల్ కనెక్టివిటీకి దోహదం చేయనుంది.

నేను లోకల్.. ఎవరికీ తలొగ్గను

హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీరు సరికాదు

- ప్రివిలేజ్‌మోషన్ నోటీసులిస్తాను: ఎమ్మెల్యే దానం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని గురుబ్రహ్మనగర్ బస్తీలో స్థల వివాదం, ప్రహరీ కూల్చివేతపై అధికారులు కేసులు పెట్టడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఘాటుగా స్పందించారు. మంగళవారం ఆయన హిమాయత్‌నగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఈ అంశంపై తాను అధికారులకు ప్రివిలేజ్ మోషన్ నోటీసులు పంపిస్తానన్నారు. జరిగిన విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని స్పష్టంచేశారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లోని గురుబ్రహ్మనగర్ బస్తీలో ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని తెలిసే తాను అక్కడికి వెళ్లానని.. ఒక ప్రజాప్రతినిధిగా తన నియోజక వర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించడం తన బాధ్యత అని గుర్తు చేశారు. తనను అడ్డుకునే అధికారం ఏ అధికారికీ లేదన్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీరు సరికాదని మండిపడ్డారు. తన నియోజక వర్గంలో ఎక్కడైనా తిరగాలంటే నీ పర్మిషన్ తీసుకోవాలా? అని మండిపడ్డారు. కొంత మందికి కొత్తగా వచ్చిన పదవి ఇష్టం లేనట్లుందని పరోక్షంగా రంగనాథ్‌ను ఉద్దేశించి ఆయన పేర్కొన్నారు. అందుకే తనపై కేసు పెట్టాడన్నారు. ఎంతో మంది అధికారులు వస్తుంటారు, పోతుంటారు.. కానీ తాను లోకల్ అని దానం పేర్కొన్నారు. తనకు కేసులు కొత్తేమీ కాదని.. ఇంకా ఎన్ని కేసులు పెట్టినా ప్రజల పక్షాన నిలుస్తానని ఆయన స్పష్టంచేశారు. తనను ఆరుసార్లు గెలిపించింది అధికారులు కాదని.. ప్రజలేనన్నారు. అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. తనపై వంద కేసులు పెట్టినా కూడా ప్రజా సమస్యలపై పోరాడతానని, అధికారులు హద్దుమీరి ప్రవర్తిస్తున్నారని దానం నాగేందర్ ఆరోపించారు. హైదరాబాద్‌ను ఇష్టమొచ్చినట్లు చేసుకోవాలని ప్రభుత్వమేమీ హైడ్రాకు జీపీఏ ఇవ్వలేదన్నారు.

పాతబస్తీ మెట్రోకు భూసేకరణ

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట దాకా అలైన్‌మెంట్

- 5.5 కి.మీ నుంచి 7.5 కి.మీ వరకు పొడిగింపు



సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రో మార్గంలో భూసేకరణపై హైదరాబాద్ మెట్రో రైల్ కసరత్తు చేపట్టింది. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ఉన్న ఓల్డ్‌సిటీ మెట్రో మార్గాన్ని రెండో దశలో భాగంగా చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. కొత్త అలైన్‌మెంట్ కోసం భూసేకరణకు హెచ్ఎంఆర్ఎల్ నోటిఫికేషన్ వెల్లడించింది. కారిడార్‌లోని వివిధ ప్రాంతాల్లో సేకరించనున్న స్థలాలపై అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం 60 రోజుల గడువు విధించారు. మరోవైపు అభ్యంతరాలను స్వయంగా తెలియజేసేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ అవకాశం కల్పించింది. భూ సేకరణలో భాగంగా ఆస్తులను కోల్పోయే బాధితులు అభ్యంతరాలను, ప్రతిపాదనలను బేగంపేట్‌లోని మెట్రో భవన్ కార్యాలయంలో స్పెషల్ కలెక్టర్‌కు స్వయంగా తెలియజేయవచ్చు. అక్టోబర్ 7వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ప్రత్యక్షంగా అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.


దారుషిఫా నుంచి శాలిబండ వరకు..

మొదటి దశలోని మూడో కారిడార్‌లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ వరకు నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ మార్గాన్ని రెండో దశలో భాగంగా ప్రస్తుతం చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. కానీ.. ఈ రూట్‌లో దారుషిఫా జంక్షన్ నుంచి షాలిబండ జంక్షన్ వరకు మొత్తం 21 మసీదులు, 12 దేవాలయాలు, 12 అషుర్ ఖానాలు, 33 దర్గాలు, 7 శ్మశాన వాటికలు మరో 6 చిల్లాలు సహా మొత్తం 103 నిర్మాణాలు ఉన్నట్లు గతంలోనే గుర్తించారు.

మతపరమైన, సున్నితమైన నిర్మాణాలను కాపాడేందుకు రోడ్డు విస్తరణను సైతం 80 అడుగులకే పరిమితం చేయాలని నిర్ణయించారు. ప్రైవేట్ ఆస్తులూ పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ రూట్‌లో ఆస్తులను కోల్పోనున్న వివిధ వర్గాలకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం వారి నుంచి అభ్యంతరాలు, ఆస్తుల అంచనాలను స్వీకరించనున్నారు.

- 2012లోనే చేపట్టాల్సిన ఈ ప్రాజెక్టు పనులను 2023 వరకు కాలయాపన చేయడంతో నిర్మాణ వ్యయం భారీగా పెరిగి ప్రస్తుతం రూ.2500 కోట్లకు చేరింది. కిలోమీటర్‌కు సుమారు రూ.250 కోట్లకు పైగా ఖర్చు కానున్నట్లు అంచనా. 5.5 కిలోమీటర్‌ల కారిడార్‌తో పాటు భూములు, ఆస్తులను కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అవసరమైన చోట్ల రోడ్ల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. దారుషిఫా జంక్షన్, పురానీ హవేలీ, ఇత్తెబార్ చౌక్, అలీజా కోట్ల, మీర్ మోమిన్ దర్గా, హరిబౌలి, శాలిబండ, షంషీర్‌గంజ్, అలియాబాద్ మీదుగా ఫలక్‌నుమా వరకు ఈ అలైన్‌మెంట్ ఉంటుంది.
- మెట్రో రైల్ మార్గంలో ఎంజీబీఎస్ తర్వాత సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్‌గంజ్, ఫలక్‌నుమా స్టేషన్‌లను నిర్మించాల్సి ఉంది. చాంద్రాయణగుట్ట నుంచి మైలార్‌దేవ్‌పల్లి మీదుగా ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రెండో దశ చేపట్టనున్న సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత మెట్రో రెండోదశ డీపీఆర్‌ను వెల్లడించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు

15న అకాన్ ఫీస్ట్..



సాక్షి,సిటీబ్యూరో: ఎక్స్ట్రామైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవసరార్థులకు అండగా నిలిచేందుకు ఈ నెల 15న అకాన్ ఫీస్ట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అకాన్ వేదికగా అగ్రశ్రేణి చెఫ్‌లు రూపొందించిన అద్భుతమైన వంటలు, మంత్రముగ్ధులను చేసే ప్రత్యక్ష సితార్ ప్రదర్శన ఉంటుందన్నారు. అకాన్ ఆహ్వానం అనేది ' మీకు నచ్చిన విధంగా చెల్లించండి ' అనే కాన్సెప్ట్ తో రూపొందించిన కార్యక్రమని, దీని ద్వారా సేకరించిన నిధులను నిరుపేద కుటుంబాలకు చెందిన నెలలు నిండని శిశువుల ఆరోగ్యం కోసం వినియోగిస్తామన్నారు. ఆసక్తి గల వారు 9649652222కు సంప్రదించవచ్చని తెలిపారు.

పాకిస్తాన్ నుంచి ఫోన్ కాల్ బెదిరింపులు

మైలార్‌దేవ్‌పల్లి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసినందున తనను పాకిస్తాన్ నుంచి వాట్సాప్ కాల్ చేసి బెదిరిస్తున్నారని బీజేపి యువమోర్చా మాజీ కార్యదర్శి బొక్క బాల్‌రెడ్డి సోమవారం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ..బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఈ నెల 11న తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశానని, ఇందులో ఎవరికి వ్యతిరేకంగా పోస్టు చేయలేదని తెలిపాడు. 12,13 తేదీల్లో గుర్తుతెలియని నంబర్లతో వాట్సాప్ కాల్ చేసి బెదిరిస్తున్నారని, తనను అంతం చేస్తామని హెచ్చరిస్తున్నారన్నాడు. దీనిపై తాను రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

డేంజర్ స్పీడ్!

రాజధానిలో అతివేగం వల్లే అనేక ప్రమాదాలు

- నగర రోడ్లు గంటకు 50 కిమీ వరకే ఉపయుక్తం
- '65' దాటితే ప్రమాదాలు కొనితెచ్చుకున్నట్లే
- ఇటీవల అనేక మందిని బలితీసుకున్న ఓవర్ స్పీడ్



సాక్షి, సిటీబ్యూరో: 'స్పీడ్ థ్రిల్స్ బట్ కిల్స్' ఇది ముమ్మాటికీ నిజమని ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు స్పష్టం చేస్తున్నాయి. సోమవారం వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఐదుగురు చనిపోగా... వీరిలో నలుగురిని పొట్టన పెట్టుకుంది అతివేగమే. ఇవే కాదు.. నగరంలో జరుగుతున్న రోడ్ యాక్సిడెంట్స్‌లో అత్యధికం అతి వేగం కారణంగానే జరుగుతున్నాయని పోలీసులే అంగీకరిస్తున్నారు. సిటీ రహదారులు గరిష్టంగా గంటకు 50 కిమీ వేగంతో ప్రయాణించడానికి మాత్రమే అనువని రవాణా రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గంటకు 65 కిమీ వేగం దాటితే ప్రమాదాలను కొని తెచ్చుకున్నట్లే అని వివరిస్తున్నారు. ఓ వాహన వేగం పెరిగే కొద్దీ... దాని డ్రైవర్ కన్ను చూడగలిగే ప్రాంతం వెడల్పు తగ్గుతుందని అధికారులు వివరిస్తున్నారు.

దేని దారి దానిదే..

రాజధానిలో వాహనాల సరాసరి వేగం గంటకు 25 కిమీ మించట్లేదు. రహదారులు పరిస్థితి, ఇబ్బడిముబ్బడిగా వచ్చి పడుతున్న కొత్త వాహనాలు, ఆక్రమణల సహా మరెన్నో దీనికి కారణంగా మారుతున్నాయి. మరోపక్క సిటీ రహదారులు గంటకు గరిష్టంగా 50 కిమీ వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేసినవి. అయితే నగర రోడ్ల పైకి కొత్తగా వస్తున్న, ఇప్పటికే ఉన్న వాహనాల గరిష్ట వేగం గంటకు 200 కిమీ పైగా ఉంటోంది. రహదారులు స్థితిగతులు, వాహనాల గరిష్ట వేగం మధ్య ఎలాంటి పొంతన లేకపోయినప్పటికీ వీటిని నియంత్రించే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక చట్టం, నియమ నిబంధనలు లేవని పేర్కొంటున్నారు.

పరిమిత వేగం పాదచారులకూ రక్షణే..

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా బాధితులుగా మారుతున్నది పాదచారులే. ఫుట్‌పాత్‌లు, క్రాసింగ్స్ సహా ఎలాంటి సౌకర్యాలు సిటీలో అవసరమైన స్థాయిలో ఉండవు. ఫలితంగా రోడ్డు దాటుతున్న, రహదారులపై నడుస్తున్న బాటసారులు వాహనాల వద్ద ప్రమాదాల బారి నపడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అధ్యయనం ప్రకారం వాహన వేగం 5 శాతం తగ్గినప్పుడు ప్రమాదాలబారి పడే ఆస్కారం 30 శాతం తగ్గుతుంది. గంటకు 50 కిమీ వేగంతో ప్రయాణించే వాహనం ఓ పాదచారుడిని ఢీ కొట్టినా... అతడికి మరణం సంభవించే ప్రమాదం 30 శాతం తక్కువగా ఉంటుంది. వాహన వేగం గంటకు 80 కిమీ మించితే ఎదుటి వ్యక్తికి మరణం సంభవించే అవకాశం 60 శాతం పెరిగినట్లేనని డబ్ల్యూహెచ్ఓ అభిప్రాయపడింది.

'విజన్', రెస్పాన్స్ టైమ్ కీలకం..

వాహనాన్ని నడిపే ప్రతి డ్రైవర్ తన ఎదురుగా ఉన్న ప్రాంతంలో ఎన్ని డిగ్రీల కోణం వరకు చూడగలడన్నది కీలకం. దీన్ని బట్టే ప్రమాదాలు జరిగే తీరుతెన్నులు ఆధారపడి ఉంటాయి. వేగం పెరిగే కొద్దీ డ్రైవర్ దృష్టి సారించగల ప్రాంతం వెడల్పు తగ్గుతుంది. ఇదే ప్రమాదాలకు హేతువుగా మారుతోంది. అలాగే వాహనచోదకులు తన ముందు ముప్పు కనిపించినప్పుడు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడానికి కొంత సమయం పడుతుంది. దీన్నే సాంకేతికంగా రెస్పాన్స్ టైమ్ అంటారు. ఎదుట ఉన్న ముప్పును మెదడు గుర్తించి, తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేయడానికి పట్టే సమయమిది. వేగం ఎక్కువైతే ఈ రెస్పాన్స్ టైమ్ కూడా ప్రమాద హేతువే. మద్యం మత్తులో ఉన్న వారికి ఈ టైమ్ చాలా ఎక్కువగా ఉంటుంది.

రాత్రి వేళల్లోనే జోష్..

వాహనాల రద్దీ, ట్రాఫిక్ పోలీసుల నిఘా తదితర కారణాల నేపథ్యంలో పగటి పూట సిటీ రహదారులపై మితిమీరిన వేగానికి ఆస్కారం లేదు. కొన్ని రోడ్లలో వేగంగా వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ... జంక్షన్లతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉండే సిగ్నల్స్ కారణంగా దీనికి బ్రేక్ తప్పట్లేదు. కేవలం ఇన్నర్ రింగ్ రోడ్, శివారు రహదారులు వంటి కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వాహనాలు పగటిపూట వేగంగా, ఎలాంటి బ్రేక్ లేకుండా ప్రయాణించే ఆస్కారం ఉంది. అయితే రాత్రి వేళల్లో రోడ్లన్నీ దాదాపు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఫలితంగా వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణించడంతో పాటు రేసింగ్స్ వంటివి జరుగుతున్నాయి.

ఎయిర్ బెలూన్లకూ కొంత సమయం..

ఇటీవల కాలంలో ఉత్పత్తి అవుతున్న దాదాపు అన్ని కార్లలోనూ ఎయిర్‌బెలూన్లు ఉంటున్నాయి. ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు యాక్టివేట్ అయ్యే సెన్సర్లు వీటిని తెరుచునేలా చేస్తాయి. ప్రమాదం జరిగాక సెన్సర్ యాక్టివేట్ అయినప్పటి నుంచి ఎయిర్ బ్యాగ్ తెరుచుకోవడానికి మధ్య సెకన్ల సమయం ఉంటుంది. వాహన వేగం మితిమీరి ఉంటే... ఈ సమయంలోపే డ్రైవర్ లేదా ప్రయాణికులు స్టీరింగ్, డ్యాష్‌బోర్డ్, సీట్లకు కొట్టుకునే అవకాశం ఉంటుంది. కొన్నిసార్లు ఎయిర్ బ్యాగ్స్ పేలిపోవడం కూడా జరుగుతుంది. ఈ పరిస్థితుల్లోనే ఎయిర్ బ్యాగ్స్ ఉన్నా కూడా వాహనంలోని వారికి రక్షణ ఉండదు.

ప్రజావాణికి 475 దరఖాస్తులు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 475 దరఖాస్తులు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 120, మైనారిటీ వెల్ఫేర్ 60, సాంఘిక సంక్షేమ శాఖ 53, పంచాయత్ రాజ్ గ్రామీణాభివద్ధి శాఖ 38, పౌరసరఫరాల శాఖ 36, ఇతర శాఖలకు సంబంధించి 168 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

ఖైదీలకు ఎస్కార్ట్ పోలీసుల రాచమర్యాదలు



చాదర్‌ఘాట్: ఖైదీలకు ఎస్కార్ట్ పోలీసులు రాచమర్యాదలు చేశారు. చాదర్‌ఘాట్ నయాగ్రా హోటల్ వద్ద వాహనాన్ని ఆపి వారికి ఇరానీ టీ తాగించి జైలుకు తీసుకెళ్లారు. సదరు వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ముగ్గురు ఖైదీలను విచారణ నిమిత్తం కోర్టుకు తీసుకెళ్లిన పోలీస్ ఎస్కార్ట్ వాహనం చాదర్‌ఘాట్‌లోని నయాగ్రా హోటల్ వద్ద ఆగింది. వాహనంలో చేతికి బేడీలతో ఉన్న ముగ్గురు ఖైదీలకు పోలీసులు టీ తాగించి తాపీగా జైలుకు తీసుకెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డ్రగ్స్ బారిన పడి యువకుడి ఆత్మహత్య


శిరీష్‌రెడ్డి (ఫైల్)

కుషాయిగూడ: డ్రగ్స్ బారిన పడ్డ ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. చర్లపల్లి ఈసీనగర్‌కు చెందిన బట్టు శిరీష్‌రెడ్డి(28) బీటెక్ చదువుకున్నాడు. లండన్, ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన అతను డ్రగ్స్‌కు బానిసయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు అతడిని రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపినా ఫలితం లేకపోయింది. విదేశాల నుంచి తిరిగి వచ్చిన అనంతరం ఇంటి వద్దే ఉంటున్న శిరీష్‌రెడ్డి సోమవారం రాత్రి తన ఇంటి రెండో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని శిరీష్‌రెడ్డిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు.

అద్దెకు తీసుకున్న కారు తాకట్టు పెట్టాడు..

ఫిలింనగర్: అద్దెకు తీసుకున్న కారును మరొకరి వద్ద తాకట్టు పెట్టి ఆ డబ్బుతో కొత్తగా మరో కారు కొన్న వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..టోలిచౌకి సమతాకాలనీకి చెందిన సయ్యద్ అయిజాదుద్దీన్ కార్లను అద్దెకు ఇస్తుంటాడు. ఈ నెల 4న మేడ్చల్ దమ్మాయిగూడకు చెందిన అజయ్ అనే వ్యక్తి హోండా సిటీ కారును రోజుకు రూ.1500 చొప్పున అద్దెకు తీసుకున్నాడు. వారం రోజుల్లో తిరిగి ఇచ్చేవిధంగా ఒప్పందం కుదిరింది. అయితే రోజువారీ అద్దె ఇవ్వకపోగా కారు కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో కారు యజమాని అయిజాదుద్దీన్ తన కారు కోసం వాకబు చేయగా కీసరకు చెందిన అజయ్ స్నేహితుడు సిద్దు వద్ద తాకట్టు పెట్టినట్లుగా తేలింది. తాకట్టులో వచ్చిన డబ్బుతో అజయ్ బ్రిజా కారు కొన్నట్లు గుర్తించారు. తనకు అద్దె ఇవ్వకపోవడమే కాకుండా కారు మరొకరి వద్ద తాకట్టు పెట్టి మోసం చేసిన అజయ్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొద్దిసేపట్లో సౌదీ వెళ్లనుండగా..

భారీగా నగదు చోరీ..

ఫిలింనగర్: కొద్దిసేపట్లో సౌదీ అరేబియాలోని రియాజ్‌కు వెళ్లాల్సిన ఓ మహిళ హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి బురఖాలో వచ్చిన ముగ్గురు యువతులు నగదు, డాలర్లు, రియాలు చోరీ చేసిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..షేక్‌పేట్ సమతాకాలనీకి చెందిన హిబాఅలీ అనే మహిళ సౌదీలోని రియాజ్ నుంచి మే 31న తన తల్లి కుబాన్ ఇంటికి వచ్చింది. ఈ నెల 13న తెల్లవారుజామున ఆమె సౌదీకి వెళ్లాల్సి ఉంది. సోమవారం రాత్రి ఆమె స్టేషనరీ కొనుక్కునేందుకు తల్లి, కుమార్తెతో కలిసి టోలిచౌకిలోని హిమాలయా బుక్‌స్టోర్‌కు వెళ్లింది. సామగ్రి తీసుకున్న తరువాత బిల్లు చెల్లించేందుకు బ్యాగ్‌లో డబ్బు కోసం చూడగా అందులో ఉండాల్సిన రూ.40 వేల నగదు, 100 యూఎస్ డాలర్లు, 500 రియాలు, సౌదీ సిమ్‌కార్డుతో పాటు పాన్‌కార్డు, మరికొన్ని పత్రాలు చోరీకి గురయ్యాయి. సీసీ ఫుటేజీలను పరిశీలించగా బురఖాలో వచ్చిన ముగ్గురు యువతులు ఆమె బ్యాగ్ నుంచి నగదు, డాలర్లు, రియాలు చోరీ చేసిన దృశ్యాలు కనిపించాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్‌పోర్టులో లగేజి మిస్సింగ్..

- ఎయిర్‌లైన్స్‌కు జరిమానా
- ప్రయాణికుడి బ్యాగును తిరిగివ్వడంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ నిర్లక్ష్యం
- కమిషన్‌ను ఆశ్రయించిన రాష్ట్ర విద్యుత్ నియంత్రణ సంఘం చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు
- రూ.3.12 లక్షలు, పరిహారంగా మరో రూ. 60 వేలు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ ఆదేశం

సిటీ కోర్టులు: ప్రయాణికుడి లగేజిని తిరిగి ఇవ్వకపోగా.. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇండిగో ఎయిర్‌లైన్స్‌పై హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్-2 ఆగ్రహం వ్యక్తం చేసింది. లగేజిలో ఉన్న వస్తువుల విలువ రూ.3.12 లక్షలు, రూ. 50 వేలు, పరిహారంతోపాటు కోర్టు ఖర్చులకు మరో 10 వేలు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు హైదరాబాద్-2 కమిషన్ అధ్యక్షుడు వెంకటి నర్సింహారావు, సభ్యులు డి.శ్రీదేవి, వి.జనార్దన్‌రెడ్డిలతో కూడిన బెంచ్ ఇటీవల తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ సంఘం చైర్మన్ (టీఎస్ఈఆర్‌సీ) తన్నీరు శ్రీరంగారావు ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో 2022, జులై 30న శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి వయా దోహ మీదుగా హైదరాబాద్ వచ్చారు. బ్యాగు 32 కిలోల బరువు ఉండటంతో బ్యాగ్‌ను కిచెన్ లగేజిలో వేయాలని ఎయిర్‌లైన్స్ సిబ్బంది సూచించారు. అందులో విలువైన వస్తువులు ఉన్నందున.. తనతోపాటు తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా మీ లగేజి ఎక్కడికిపోదని, దాన్ని క్షేమంగా మీకు అందజేస్తామని ఎయిర్‌లైన్స్ సిబ్బంది సూచించారు. దీంతో అతను బ్యాగ్‌ను కిచెన్ లగేజిలో ఉంచి టోకెన్ తీసుకుని వెళ్లిపోయాడు. అతను హైదరాబాద్ చేరుకున్న తర్వాత బ్యాగ్ కనిపించకపోవడంతో ఎయిర్‌లైన్స్ సిబ్బందికి ఫిర్యాదు చేశాడు. వారు ట్రేస్ చేసినా ఫలితం కనిపించలేదు. దీనిపై పలుమార్లు ఎయిర్‌లైన్స్‌కు ఫిర్యాదు చేసినా స్పందించకపోగా, నెలరోజుల తర్వాత ఎయిర్‌లైన్స్ నుంచి అతడికి రూ.41,650 పంపించారు. అయితే బ్యాగ్‌లో రూ.3.54 లక్షల విలువైన వస్తువులు ఉన్నాయని పేర్కొంటూ బాధితుడు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన కమిషన్ ప్రయాణికుడి వస్తువుల విలువను కంపెనీ చెల్లించాలని ఆదేశించింది. అయితే ప్రయాణికుడికి ఇప్పటికే రూ.41,650 ఇచ్చినందున.. మిగిలిన రూ.3.12 లక్షలు, నష్టపరిహారంగా రూ. 50 వేలు 45 రోజుల్లోగా చెల్లించాలని ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు ఆదేశాలు జారీ చేసింది.

స్పందించారు..ప్రాణం కాపాడారు..


చికిత్స పొందుతున్న బాబీ

జగద్గిరిగుట్ట: టెక్నాలజీ సహకారంతో జగద్గిరిగుట్ట పోలీసులు తక్షణమే స్పందించి నిండు ప్రాణం కాపాడారు. జగద్గిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీరప్పనగర్‌కు చెందిన మాలంపాక బాబీ మాదాపూర్‌లోని రియల్ ఎస్టేట్ కార్యాలయంలో పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం అతను తన బావమరిది కరుణాకర్‌కు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా ఫోన్ కలవకపోవడంతో అతను బాబీ ఆఫీస్‌కు ఫోన్ చేశాడు. భోజనానికి వెళ్లి తిరిగి రాలేదని తోటి ఉద్యోగులు చెప్పడంతో అతను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన జగద్గిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్ అతని సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా సికింద్రాబాద్ లో మహంకాళి ఏరియాలో ఉన్నట్లు గుర్తించి ఫిర్యాదుదారుడితో పాటు పోలీస్ సిబ్బందిని అక్కడికి పంపారు. అప్పటికే ఓ లాడ్జిలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అపస్మారకస్థితిలో ఉన్న బాబీని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రాణపాయం లేదని డాక్టర్లు నిర్ధారించిన తర్వాత పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి ప్రాణం కాపాడిన జగద్గిరిగుట్ట సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

ముమ్మా..నిన్ను మిస్సవుతున్నా..

సూసైడ్ నోట్ రాసి యువకుడి ఆత్మహత్య


శ్రీహరి (ఫైల్)

సుభాష్‌నగర్: "ముమ్మా నిన్ను చాలా మిస్ అవుతున్నా.. నీవు లేకుండా అసలు అయితలే..నేను నీ దగ్గరకే వచ్చేస్తున్నా.. మన మధ్య మనస్పర్థలు సృష్టించారు., నేను చనిపోయాక అందరికీ నిజం తెలుస్తుంది.. అరేయ్ రాజురెడ్డి అన్నింటికీ నీవే కారణం, ఇద్దరం పెళ్లి చేసుకునేందుకు వెళ్లాం. తేజు లేనిదే నేను లేను.. నాది వన్ సైడ్ లవ్ కాదు.. ఒకరంటే ఒకరికి ప్రాణం. ముమ్మా నీ దగ్గరికే వస్తున్నా శ్రీ.. అక్క నీవే మమ్మీని చూసుకో".. అంటూ.. ఓ యువకుడు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 9న దోమడుగుకు చెందిన తేజస్వి అనే యువతి ఇంటి నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు తేజస్వి ఆత్మహత్యకు శ్రీహరి వేధింపులే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మనస్తాపానికిలోనైన శ్రీహరి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో అతడిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శ్రీహరి సోమవారం రాత్రి ఆస్పత్రి నుండి తప్పించుకున్నాడు. దీంతో తమ కుమారుడు కనిపించడం లేదని అతడి తల్లిదండ్రులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం బహదూర్‌పల్లిలోని సాయినా సొసైటీలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని శ్రీహరిగా గుర్తించారు. ఘటనా స్థలంలో శ్రీహరి రాసిన సుసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. అందులో తాను, తేజస్వీ ప్రేమించుకున్నామని, బీజేపీ నాయకుడు రాజురెడ్డి, తేజస్వీ తండ్రి, సోదరుడు తమను విడదీసేందుకు యత్నించారని పేర్కొన్నాడు. తేజస్వీ లేనిదే తాను లేనని, తాను కూడా ఆమె దగ్గరకే వెళ్తున్నానని, తమ చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అందులో పేర్కొన్నాడు. పోలీసులు శ్రీహరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యర్థాల రీసైక్లింగ్ నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టండి

సనత్‌నగర్: వ్యర్థాల రీసైక్లింగ్ రంగంలో నైపుణ్యాభివృద్ధిపై దృష్టిపెట్టాలని భారత పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి లీనా నందన్ అన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 'సర్క్యులర్ ఎకానమీ-రీ సైక్లింగ్-వ్యర్థాల పునరుద్ధరణ' అంశంపై జరిగిన సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్క్యులర్ ఎకానమీలో తలెత్తే సవాళ్లపై సుదీర్ఘ చర్చ జరగాలన్నారు. తద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. పరిశ్రమల శాఖ, మున్సిపల్ శాఖలు ఈ విషయంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. బ్యాటరీలను రీసైక్లింగ్ చేసే సామర్థ్యం ఎక్కువగా ఉన్నప్పటికీ వాటి సేకరణ సామర్థ్యం తక్కువగా ఉందన్నారు. దీనిపై దృష్టిసారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, టీజీపీసీబీ చైర్మన్ శాంతికుమారి మాట్లాడుతూ మిషన్ సర్క్యులర్ ఎకానమీపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామ స్థాయిలో చెత్తను వేరుచేసే సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. తడి చెత్తను కంపోస్టుగా మారుస్తున్నామని,. గ్రామాలు, పట్టణాల్లో 15,000 నర్సరీలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్విరాన్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ మాట్లాడుతూ 100 శాతం రీయింబర్స్‌మెంట్ స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, వేస్ట్ టు వెల్త్ ప్రాజెక్టులతో పాటు కొత్త పరిశ్రమలను ప్రోత్సహిస్తూ టీ-ఐడియా అమలుచేయడం జరుగుతుందన్నారు. మురుగు నీటి నిర్వహణ విషయానికొస్తే మొత్తం ఉత్పత్తి 2750 ఎంఎల్‌డీల అంచనా కాగా, ఇప్పటికే 1273 ఎంఎల్‌డీ సామర్థ్యం గల 50 ఎస్‌టీపీల ద్వారా శుద్ధి చేస్తున్నట్లు చెప్పారు. 1105 ఎంఎల్‌డీ సామర్థ్యం గల 27 ఎస్‌టీపీలు నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి మాట్లాడుతూ తెలంగాణ సర్క్యులర్ ఎకానమీలో మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణను పకడ్బందీగా నిర్వహించడం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను తగ్గించి ప్రత్యామ్నాయ వినియోగాన్ని ప్రోత్సహించడం, రీసైక్లింగ్‌పై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. భారత పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ నరేష్‌పాల్ గంగవార్, రాంకీ ఎన్విరో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ తోట పాల్గొన్నారు.

రోబోతో ఈజీగా..

- రోబోటిక్ సర్జరీలో చరిత్ర సృష్టిస్తున్న నిమ్స్ వైద్యులు
- ఏడాదిలో 300 రోబోటిక్ సహాయక శస్త్రచికిత్సలు
- రోగులకు తగ్గిన నిరీక్షణ
- చిన్న కోతతో సంక్లిష్ట ఆపరేషన్లు



లక్డీకాపూల్: సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు రోబోటిక్ -సహాయ శస్త్రచికిత్స(ఆర్ఏఎస్)లతో సునాయసంగా పరిష్కారం చూపుతూ నిమ్స్ వైద్యులు చరిత్ర సృష్టిస్తున్నారు. అధునాతన శస్త్రచికిత్సలకు రోబోల్లో ఒకటైన డా.విన్సీని సమకూర్చుకోవడం నిమ్స్ ప్రత్యేకత. అందివచ్చిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిమ్స్ వైద్యులు ఏడాదిలోనే 300 రోబోటిక్ సహాయ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఆస్పత్రిలోని యూరాలజీ, గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సర్జరీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాల్లో అనేక క్లిష్టమైన శస్త్ర చికిత్సలను చేశారు. దీంతో నిమ్స్ దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యంత వేగంగా ఈ మైలురాయిని సాధించిన హాస్పిటల్‌గా నిలిచింది. డాక్టర్ విన్సీ సర్జికల్ సిస్టమ్ సహాయ శస్త్రచికిత్సలు అతి తక్కువ హానికర ప్రక్రియ. ఈ విధానం రోగి త్వరగా కోలుకోవడానికి దోహదపడుతుంది. వాస్తవానికి ఈ చికిత్స విధానాన్ని చిన్న కోతల ద్వారా నిర్వహిస్తారు. నిత్యం రోగులతో రద్దీగా ఉండే నిమ్స్ వంటి ఆస్పత్రుల్లో రోబోటిక్- సహాయ శస్త్ర చికిత్సలు మరింత మెరుగైన ఫలితాలను అందిస్తాయి. రిఫరల్ ఆస్పత్రి అయిన నిమ్స్‌లో పీజీ విద్యార్థులు శస్త్ర చికిత్సా పద్ధతుల్లో సరికొత్త సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు దోహదపడుతుంది. ఆర్ఏఎస్‌లో మాగ్నిఫైడ్ 3డి హై-డెఫినిషన్ విజన్ సిస్టమ్, చిన్న మణికట్టు పరికరాలు ఉంటాయి. మనిషి చేతి కంటే ఎక్కువగా వంగుతాయి.. తిరుగుతాయి. ఫలితంగా సర్జన్లకు మెరుగ్గా అవయవాలు కనిపించటంతో పాటు చికిత్స పరంగా ఖచ్చితత్వం, నియంత్రణ ఉంటుంది. పైగా నొప్పి తగ్గడం, శస్త్ర చికిత్స అనంతరం ఇన్ఫెక్షన్లు తగ్గడం, శస్త్ర చికిత్స సంబంధిత మచ్చలు తగ్గడమే కాకుండా రోగి త్వరగా కోలుకుంటారు.

మెరుగైన క్లినికల్ ఫలితాలు..

ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి భీరప్ప మాట్లాడుతూ.. "శస్త్ర చికిత్సల పరంగా రోబోటిక్స్ అనేది అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల్లో ఒకటిగా నిలవడంతో పాటుగా ఇప్పుడు సంచలనాలను సృష్టిస్తూ, క్లినికల్ ఫలితాలను మెరుగుపరుస్తుందన్నారు. ఈ క్రమంలో శస్త్ర చికిత్స తర్వాత రోగి ఆస్పత్రిలో ఉండే సమయం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. ఆపరేషన్ల కోసం వేచి ఉండే వ్యవధి నెలల నుండి రోజులకు తగ్గిపోయిందన్నారు. దీంతో వైద్యులు సైతం రోజులో ఎక్కువ కేసులు చేయగలుగుతున్నారన్నారు. నిమ్స్‌లో ప్రతి ఒక్కరికీ అత్యుత్తమ చికిత్స అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ తరహా శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులకు కనీస నొప్పి మాత్రమే ఉంటుందని చికిత్స అనంతరం ఫాలో అప్‌ను కూడా తగ్గించిందన్నారు. సంక్లిష్ట శస్త్రచికిత్సల్లో గొప్ప ఫలితాలను అందించిన సర్జన్లకు, ఇందుకు చేయూతనందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించాలి

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధికారులకు సూచించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌కాలనీ కమ్యూనిటీహాల్‌లో స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ ఆధ్వర్యంలో మంగళవారం సమస్యలపై శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధురానగర్‌కాలనీ, వెంగళరావునగర్‌కాలనీ, సిద్ధార్థనగర్, జవహర్‌నగర్, యాదగిరినగర్, ఈస్ట్ రహమత్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ప్రజలు విన్నవించిన పలు సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మధురానగర్‌కాలనీలోని వీధి కుక్కలకు ఆహారాన్ని అందించే వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ముందుగా అసోసియేషన్‌ను సంప్రదించాలని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లోని సీసీ రోడ్లను తక్షణమే చేపట్టాలని అన్నారు. అనేక ప్రాంతాల్లో వీధి దీపాలు లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, హైమాస్ట్ లైట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. కొత్త నీటి పైపులైన్లు శాంక్షన్ అయి ఏడాది అవుతుందని, నేటి వరకు కనీసం టెండర్లు కూడా పిలవలేదని సాధ్యమైనంత త్వరలో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు అందజేసిన వినతి పత్రాలను సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌తో పాటుగా ఆయాకాలనీలు, బస్తీల నేతలు ఎం.ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు, హనుమంతరావు, చిలకల వెంకటేశ్వరరావు, పూదోట శౌరిరాజు, సిహెచ్‌ఎన్ ప్రసాదరావు, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు ముదిరాజ్, కిట్టు, పూజారి బాల్‌రాజ్, కట్టా లక్ష్మి, సుశీల్, జీహెచ్‌ఎంసి సర్కిల్–19 ఉప కమిషనర్ సేవా ఇస్లావత్, ఈఈ రాజ్‌కుమార్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు



సీఎం రేవంత్‌రెడ్డి నివాసిత రోడ్డులో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న అధికారులు..

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసిత రోడ్డుతో పాటు పరిసర రహదారులకు మరమ్మతులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత వారం రోజుల నుంచి సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా, దక్షిణకొరియా పర్యటనల్లో ఉండగా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు రాత్రింబవళ్లు జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–44తో పాటు చుట్టుపక్కల రహదారులకు మరమ్మతులు చేపడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని బుధవారం నగరానికి రానుండగా, మంగళవారం సీఎం నివాసిత రహదారిలో సంబంధిత అధికారులతో కలసి జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్డు పనులతో పాటు ఫుట్‌పాత్ పనులు, మొక్కలు నాటే కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ చేపడుతుండగా డ్రైనేజీ పైప్‌లైన్ పనులను జలమండలి చేపట్టింది.

కూడళ్ల సుందరీకరణ చకచకా!

- పంజగుట్ట, ఎన్‌ఎఫ్‌సీఎల్ చౌరస్తాల్లో విస్తరణ పనులు
- నెల రోజుల్లో పూర్తిచేయాలని లక్ష్యం
- దృష్టిసారించిన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్



ప్రణాళికను పరిశీలిస్తున్న ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

బంజారాహిల్స్: కూడళ్ల సుందరీకరణలో భాగంగా నగరం నడిబొడ్డున నిత్యం ట్రాఫిక్‌తో కిటకిటలాడే పంజగుట్ట, నాగార్జున సర్కిళ్ల విస్తరణ, సుందరీకరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంజగుట్ట, ఎన్‌ఎఫ్‌సీఎల్ కూడళ్ల సుందరీకరణ పనుల కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు. రంగురంగుల పూలమొక్కలు, ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్లు, ఐలాండ్స్‌ను పచ్చదనంతో తీర్చిదిద్దే పనులు గత పది రోజులుగా జోరుగా జరుగుతున్నాయి. పంజగుట్ట చౌరస్తాలో రూ. 1.20 కోట్లతో వ్యయంతో, నాగార్జున సర్కిల్‌లో రూ. 1.20 కోట్లతో వ్యయంతో సుందరీకరణ పనులు చేపట్టారు. ఈ రెండు చౌరస్తాలను సర్వాంగ సుందరంగా తీర్చితీద్ది వాహనదారులు మురిసిపోయేలా ముస్తాబు చేసేందుకు చక్కటి ప్రణాళికలు రూపొందించారు. ఈ రెండు కూడళ్ల అభివృద్ధి, విస్తరణ, సుందరీకరణ ప్రణాళికలను ఇటీవలనే జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, ఖైరతాబాద్ సర్కిల్–17 ఈఈ ఇందిరాబాయిలు పరిశీలించారు. ఫుట్‌పాత్‌లను చౌరస్తాలకు నాలుగు వైపులా ఆకట్టుకునేలా టైల్స్‌తో వేసి పక్కనే రంగురంగుల పూల మొక్కలు కూడా నాటనున్నారు.

- ఎన్‌ఎఫ్‌సీఎల్ చౌరస్తా నుంచి పంజగుట్ట చౌరస్తా వరకు సెంట్రల్ మీడియంను, పంజగుట్ట ఫ్లైఓవర్ కింద ఖాళీ స్థలాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దనున్నారు.
- ఈ రెండు చౌరస్తాల్లో ఉన్న ఐల్యాండ్‌లకు పూలమొక్కలతో కొత్త సొబగులు అద్దనున్నారు. ఫ్లైఓవర్ కింద రెయిలింగ్ నిర్మించి లోపల ఆహ్లాదకర వాతావరణాన్ని తీసుకువచ్చే క్రమంలో విదేశీ పూల జాతులను నాటాలని నిర్ణయించారు.

నెల రోజుల్లో పూర్తిచేస్తాం

– ఇందిరాబాయి, ఈఈ ఖైరతాబాద్ సర్కిల్

ఇప్పటికే సోమాజీగూడ కూడలిని రూ.2.50 కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయడం జరిగింది. ఒకవైపు మొక్కలు, ఇంకోవైపు బెంచీలు, చక్కటి ఫ్లోరింగ్‌తో తీర్చిదిద్దాం. తాజాగా పంజగుట్ట, నాగార్జున సర్కిళ్లను కూడా సుందరీకరించే పనులు చేపట్టాం. నెల రోజుల్లో సుందరీకరణ పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. పగటి పూట ఈ పనులు చేయడానికి ట్రాఫిక్ అడ్డంకిగా మారింది. అందుకే రాత్రిపూట మాత్రమే పనులు చేస్తున్నాం. ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియంలను, ఇక్కడ ఉన్న మూడు ఐల్యాండ్‌లను పచ్చదనంతో, కనువిందు చేసే పూలమొక్కలతో తీర్చిదిద్దే ప్రణాళికలను రూపొందించాం.

పండ్లతో శ్రీభూలక్ష్మి దుర్గాదేవి అమ్మవారి అలంకరణ



బంజారాహిల్స్: హిమాయత్‌నగర్ డివిజన్‌లోని గాంధీకుటీర్ నారాయణగూడలో కొలువుదీరిన శ్రీభూలక్ష్మి దుర్గాదేవి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని దాదాపు రూ.25 వేలతో తీసుకువచ్చిన వివిధ రకాల పండ్లతో అలంకరించారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి ఈ వేడుకలకు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్నదాన కార్యకమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శివముదిరాజ్, చైర్మన్లు అయిలమ్మ, శ్రీనివాస ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ కుమార్‌యాదవ్, గోవింద్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఘన సన్మానం



కేంద్ర మంత్రి రాందాస్ హతవాలేను సన్మానిస్తున్న నాయకులు

ఖైరతాబాద్: ప్రధాని నరేంద్రమోదీ మంత్రివర్గంలో మూడోసారి కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకరం చేసిన రాందాస్ హతవాలే సన్మాన కార్యక్రమం మంగళవారం రాత్రి ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి పేరం శివనాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో బెగుళ్ల నాగేశ్వర్‌రావు, కొమ్మా రెడ్డి బ్రహ్మానందరెడ్డి, పసుల రవికుమార్, శ్రావణ్‌కుమార్, రత్న ప్రసాద్, జాన్ మార్క్, ప్రతాని రామకృష్ణ, శివ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజీపడేది లేదు : ఎమ్మెల్యే దానం



వినతిపత్రం ఇస్తున్న నాగేశ్వరరావు

పంజగుట్ట: బస్తీలు, కాలనీల అభివృద్ధిలో ఏమాత్రం రాజీపడేది లేదని ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని తుమ్మలబస్తీలో రూ. 19.98 లక్షల ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ నిధులతో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాల్‌ను దానం నాగేందర్, ఎం.ఎస్.ప్రభాకర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సమైక్యభారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కె.నాగేశ్వరరావు ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ రోడ్డు, నాసర్ స్కూల్ రోడ్డులో సీసీ కెమరాలు ఏర్పాటు చెయ్యాలని, నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ రెండో అంతస్తు నిర్మాణానికి నిధులు మంజూరు చెయ్యాలని వినతిపత్రాలు ఇచ్చారు. అధికారులతో మాట్లాడి తప్పకుండా మంజూరు చేస్తానని దానం నాగేందర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజశేఖర్, ఎస్సై నాగరాజు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేంద్రకుమార్, అధ్యాపకులు డాక్టర్ జగన్మోహన్, డాక్టర్ గిరిధర్, లైబ్రేరియన్ విద్యాసాగర్, జి.యాదయ్య, అబ్దుల్ సత్తార్, కోటేశ్వరరావు, గాలి అనీల్ కుమార్, పులి సంతోష్, యహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్‌పై దాడి

వెంగళరావునగర్: క్యాబ్ డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన డి.రవీందర్ క్యాబ్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 12వ తేదీ ప్యాసింజర్లు క్యాబ్‌ను బుక్ చేసుకోవడంతో యూసుఫ్‌గూడ మీదుగా ఎస్‌ఆర్‌నగర్ మెట్రో సమీపంలోకి రాగానే వెనుక వస్తున్న ఆటో డ్రైవర్ అకారణంగా తీవ్రమైన పదజాలంతో దుర్భాషలాడాడు. ఇదేమని ప్రశ్నించినందుకు ఆటోడ్రైవర్ ఎం.ఏసు అతని కుమారుడు సంజయ్ ఇరువురు రవీందర్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో రవీందర్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

18న తెలంగాణ గంగ తెప్పోత్సవం

ఖైరతాబాద్: గంగ తెప్పోత్సవాన్ని ఈ నెల 18న ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు తెలిపారు. మంగళవారం ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేందర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఖైరతాబాద్ ఏడుగుళ్ల నుంచి గంగ తెప్ప, 525 బోనాలు, కళాకారుల ఆటపాటల మధ్య శోభాయాత్ర మొదలవుతుందని తెలిపారు. ఈ శోభాయాత్ర హుస్సేన్ సాగర్‌లోని గంగమ్మ తల్లి ఆలయం వరకు సాగుతుందన్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులను ఆహ్వానించినట్లు తెలిపారు. అనంతరం గంగ తెప్పోత్సవ పోస్టర్‌ను తెలంగాణ మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీ సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్య నిర్వాహక అధ్యక్షుడు మంగళపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి పూస నర్సింహ, కోశాధికారి కాపరనేని లింగం, చంద్రశేఖర్, కొప్పు పద్మ, లలిత జగన్, తుమ్మురు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి లక్ష్మి తామర పుష్పాలంకరణ



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: లక్ష్మి తామర పుష్పాలతో అలంకరించిన ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14 లోని నందినగర్ శ్రీ ఆంజనేయ స్వామిని ఆలయ అర్చకులు శ్రావణ మాసం రెండో మంగళవారం సందర్భంగా స్వామి వారిని లక్ష్మీ తామర పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శేష శైలాచార్యులు, కిరణ్ కుమారాచార్యులు మాట్లాడుతూ 1516 లక్ష్మి తామర పుష్పాలతో స్వామి వారిని అలంకరించినట్లు, ప్రతీయేట శ్రావణ మాసంలో వచ్చే ప్రతీ మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మినారాయణ, కన్నా ఫణీంద్ర ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష్మీ తామర పుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దశరథ, పాల్గొన్నారు.

బీవీబీపీ స్కూల్‌లో వరలక్ష్మి వ్రత వేడుకలు





ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో మంగళవారం శ్రావణమాసం వరలక్ష్మి వ్రత వేడుకలను కనులపండువగా నిర్వహించారు. వరలక్ష్మీ అమ్మవారు నేపథ్యంగా శ్రావ్యమైన కీర్తనలతో పాటు నృత్యాలు ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో ఆధ్యాత్మికత, సంస్కృతీ సంప్రదాయాలు వెల్లివిరిశాయి. స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

టి.అంజయ్యనగర్ బస్తీ సమస్యలు పరిష్కరించండి



భవాని శంకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న టి. అంజయ్యనగర్ బస్తీ నాయకులు

రహమత్‌నగర్: తమ బస్తీలోని సమస్యలు పరిష్కరించాలని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవాని శంకర్‌కు టిఅంజయ్యనగర్ బస్తీ వాసులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భవాని శంకర్ మాట్లాడుతూ టిఅంజయ్యనగర్ బస్తీలో సీసీరోడ్లు, డ్రైనేజీ పైపులైన్ నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బస్తీ సమస్యలను ఆయా శాఖల అధికారలకు విన్నవించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. టి.అంజయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శివ.నాగరాజు, అరుణ్‌గౌడ్, దేవేందర్, యాదగిరి, ప్రకాష్, బెన్నార్, సాయి పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

కాచిగూడ: ప్రజాస్వామ్యాన్ని పాతర వేసే నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు కొత్త చట్టాలు అత్యంత క్రూరమైన నేర చట్టాలని ఆయన అన్నారు. నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి స్వార్థ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చట్టాలు తీసుకొచ్చిందని అన్నారు. స్వాంతంత్ర్యద్యమంలో నాటి జాతీయ నాయకులను జైళ్లలో పెట్టడానికి బ్రిటీష్ ప్రభుత్వం ఉపయోగించిన 'రాజద్రోహ' చట్టం అమలును సుప్రీంకోర్టు 2022లో నిలిపివేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నేతలు శ్రీనివాస్, ఏఐవైఎఫ్ నేతలు షేక్ మహమూద్, జగన్ గౌడ్, నితిన్, ప్రవీణ్, రజనీకాంత్, అంజన్, అరుణ్, సంపూర్ణేష్ పాల్గొన్నారు.

నేడు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రదర్శన

కాచిగూడ: 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మిమిక్రీలో ఎం.శ్రీనివాస్ ఈనెల 14వ తేదీన బుధవారం ఉదయం 9 గంటలకు కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో 15 నిమిషాల్లో 78 రకాల ధ్వనులను తన కంఠంతో ప్రదర్శించి వరల్డ్ రికార్డు సొంతం చేయబోతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అకాడమీలో శ్రీనివాస్ చేపట్టే వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రదర్శన పోస్టర్‌ను హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీ రామన్ గౌడ్ ఆవిష్కరించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు హాజరై శ్రీనివాస్ చేసే మిమిక్రీ ప్రదర్శనను రికార్డ్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, జగదీశ్ చంద్ర, కె.రాజేశ్వరి, కరీం, అమృత రెడ్డి, నిధి వర్మ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి



మైదానాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తుల్జారాం, కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలు

రహమత్‌నగర్: అసాంఘిక కార్యకలాపాలపై అడ్డాగా మారిన నిమ్స్‌మే మైదానంపై పోలీసులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించారు. ఈ క్రమంలోనే బోరబండ ఎస్‌ఐ తుల్జారాం నాయక్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి మంగళవారం మైదానాన్ని పరిశీలించారు. మైదానంలో చెట్లను తొలగించి అందులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని నిమ్స్‌మే అధికారులకు కోరనున్నట్లు వారు తెలిపారు. మైదాన ప్రాంతాల్లో పోలీసులు గస్తీని మరింత పెంచుతామని తుల్జారం స్పష్టం చేశారు. అదే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని నిమ్స్‌మే డైరెక్టర్‌కు కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. ప్రధానంగా రాత్రి వేళల్లో ప్రత్యేక పోలీసుల నిఘా ఏర్పాటు చేశామని ఎస్సై చెప్పారు.

సాయిరేను పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



వంటకాలు కొనుగోలు చేస్తున్న చైర్మన్ డా.మల్లేశ్ యాదవ్

రహమత్‌నగర్: ఎప్పుడు చదువులతో కుస్తీ పడే విద్యార్థులకు వంటలు చేయడం ఉల్లాసాన్ని ఇస్తాయని సాయిరేను పాఠశాల చైర్మన్ డా. మల్లేశ్ యాదవ్ అన్నారు. మంగళవారం ఎస్పీఆర్‌హిల్స్‌లోని సాయిరేను పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. చిన్నారులు చేసిన వైవిధ్యభరితమైన వంటకాలు ఆకట్టుకున్నాయి. ప్రధాన తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన సంప్రదాయ వంటకాలు చేసి చిన్నారులు ఔరా అనిపించుకున్నారు. ఈ సందర్భంగా డా.మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ ఎప్పుడు చదవులు చెప్పడమే కాకుండా ఉల్లాసభరిత కార్యక్రమాలు నిర్వహిస్తే పిల్లలలో ఉత్సాహం కలుగుతుందన్నారు. సంపత్ యాదవ్, కరస్పాండెంట్ అధిల్‌ఖాన్, ఉపాధ్యాయులు లక్ష్మి, సరళతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి



ర్యాలీలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి

బంజారాహిల్స్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ వారి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి కోరారు. మంగళవారం 'హర్ ఘర్ తిరంగా–2024' యాత్రలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గం బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, గౌతమ్‌రావు, డివిజన్ అధ్యక్షులు, బీజేవైఎం నాయకులు ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ దేశ సమైక్యతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు.

దంచికొట్టిన వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు





అమీర్‌పేట్ చర్మాస్ జంక్షన్‌లో...



ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ కింద...



నిమ్స్ ఆస్పత్రి వద్ద..



రాజ్‌భవన్ రోడ్డులో నిలిచిన వరద..



కేబీఆర్ పార్కు వద్ద భారీగా చేరిన వరద

బంజారాహిల్స్: నగరంలో పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు కురిసిన భారీ వర్షానికి ప్రధాన రోడ్లతోపాటు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఒక్కసారిగా వర్షం కురవడంతో ఖైరతాబాద్, బంజారాహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, శ్రీనగర్ కాలనీ, అమీర్‌పేట, సోమాజిగూడ ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లతో పాటు లోతట్టు ప్రాంతాలతోపాటు అంతర్గత రహదారులు నీటమునిగాయి. దీంతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎప్పటిలాగా పంజగుట్ట ప్రధాన రహదారిలోని కేసీపీ జంక్షన్ తోపాటు రాజ్‌భవన్ రోడ్డు, ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ కింద పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోయింది. అమీర్‌పేట్ చర్మాస్ జంక్షన్‌లో కూడా వరద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విజ్ఞానయాత్రలతో మేధస్సు పెంపు



విజ్ఞానయాత్రలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ చిన్నారులు

ఫిలింనగర్: విజ్ఞాన యాత్రల వల్ల విద్యార్థుల మేధస్సు మరింత పెంపుదల జరుగుతుందని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కాంచనవల్లి అన్నారు. స్కూల్‌లోని నర్సరీ, ఎల్‌కేజీ చిన్నారులు విజ్ఞానయాత్రలో భాగంగా మంగళవారం జంతు ప్రదర్శనశాలను సందర్శించారు. అలాగే యూకేజీ విద్యార్థులు సుధా కార్ మ్యూజియంను తిలకించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకే పరిమితం కాకుండా బాహ్య ప్రాపంచిక జ్ఞానాన్ని అందించడమే ఈ విజ్ఞానయాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. ఈయాత్రలో వివిధ జంతువులు, పక్షులు, అనేక ప్రాణులను, వాటి ఆహార విషయాలను చిన్నారులు తెలుసుకోవడం జరిగిందన్నారు. సుధా కార్స్ మ్యూజియంలో రూపుదిద్దుకున్న కార్లను తిలకించి విద్యార్థులు ఆనందానికి లోనయ్యారన్నారు. రోజువారీ వస్తువులను పోలిన వివిధ ఆకృతులు, పరిమాణాల్లో కార్లు ఉన్నాయని, ప్రత్యేక ఆకర్షణగా హ్యాండ్‌బ్యాగ్‌లు, లిప్‌స్టిక్‌లు, షూస్ వంటి రోజువారీ వస్తువులు ప్రదర్శించినట్లు తెలిపారు. ఇలాంటి విజ్ఞానయాత్రలు ఆలోచనాశక్తిని, సృజనాత్మక ఆలోచనలు రాబట్టడానికి ప్రేరేపిస్తాయన్నారు.



లేటు వయసులో.. కాలేజీ బాట!

నిత్య విద్యార్థిగా లక్ష్మీనారాయణ శాస్త్రి

77 ఏళ్ల వయసులో పీజీ పూర్తి..

సాక్షి, సిటీబ్యూరో: నేర్చుకోవాలనే తపన.. సంకల్ప బలం.. సాధిస్తామనే ధీమా ఉంటే చాలు.. ఎన్ని అద్భుతాలైన సృష్టించవచ్చు. ఇదే విషయాన్ని 77 ఏళ్ల వయసులో నిరూపించారు లక్ష్మీనారాయణ శాస్త్రి. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ఇంజినీర్‌గా పనిచేసి రిటైర్ అయిన ఎస్ఎల్ఎన్ శాస్త్రి.. తాజాగా అదే వర్సిటీలోని ఎర్త్ క్వేక్ ఇంజినీరింగ్ రీసెర్చ్ సెంటర్ నుంచి పీజీ పట్టా పొందారు. వయసుతో సంబంధం లేకుండా నిత్య విద్యార్థిగా కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉండాలని ఆయన నిరూపించారు. 1947లో జన్మించిన ఎస్ఎల్ఎన్ శాస్త్రి.. ఏఈఈగా తన ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. ట్రిపుల్ ఐటీ నిర్మాణంలో మొదటి నుంచీ కీలకపాత్ర పోషించారు. క్యాంపస్ నిర్మాణం, ప్రణాళిక రూపకల్పనలో ఆయన ముందుండి నడిపించారు. ఇక, ప్రొఫెసర్ రామంచర్ల ప్రదీప్‌కుమార్, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు మందాడి ప్రోత్సాహంతో పీజీ చేయాలనే ఆలోచన వచ్చిందని ఆయన చెప్పుకొచ్చారు.

క్లాస్‌రూం అనుభూతే వేరు..

ఈ వయసులో క్లాసురూమ్‌కు వెళ్లి పాఠాలు వినడం చాలా సంతోషం అనిపించింది. కాలేజీ రోజులు గుర్తొచ్చాయి. విజయవాడలోని 20 పాత భవనాల్లో భద్రత అంశంపై నా కోర్సులో భాగంగా పరిశోధన చేశాను. ప్రొఫెసర్ ప్రదీప్ నన్ను అడుగడుగునా ప్రోత్సహించారు. పీహెచ్‌డీ కోసం పాత భవనాలకు ఇంజినీరింగ్ పరిష్కారాలపై పరిశోధన చేస్తాను.
– ఎస్ఎల్ఎన్ శాస్త్రి

'అనగనగా ఓ మహారాజు ఉన్నాడు. ఆ రాజుకు ఏడుగురు కొడుకులు.. ఏడుగురూ వేటకువెళ్లి ఏడు చేపలు తెచ్చారు...' ఇలా పిల్లలకు పాత కథలు మాత్రమే తప్ప కొత్త కథలు, కొత్తగా చెప్పడం రాని ఆధునిక తల్లిదండ్రులు.. కథలు నేర్పే స్టోరీ టెల్లర్స్ దగ్గర బారులు తీరుతున్నారు. వీరు మాత్రమే కాదు పాఠశాల విద్యార్థులకు పాఠాలు చెప్పే టీచర్ల నుంచి కార్పొరేట్ ఉద్యోగులకు పాఠాలు చెప్పే కౌన్సిలర్స్ వరకూ అందరూ కథా కళ..లో నైపుణ్యం కోసం క్యూ కడుతున్నారు.
– సాక్షి, సిటీబ్యూరో

స్టోరీ టెల్లింగ్ ఆర్ట్ నేర్చుకోవడానికి నగరవాసుల ఆరాటం..

పిల్లలకు చెప్పడం దగ్గర్నుంచి కార్పొరేట్ పాఠాల వరకూ..

కథ చెప్పడం అనేది కళగా స్థిరపడిన వైనం..

అవ్వాతాతలు సైతం ఆన్‌లైన్ ట్యూషన్స్‌కి రెడీ..



కథ చెబుతాం.. ఊ కొడతారా..



ప్రధానంగా నగరంలో ఈ కళకు డిమాండ్ తీసుకురావడంతో తల్లిదండ్రులే మహారాజు పోషకులుగా కనిపిస్తున్నారు. పిల్లలకు కథలు చెప్పడం మానసిక వికాసానికి మార్గమని సైకాలజిస్టులు సూచిస్తుండడం ఈ పోకడకు ఆజ్యం పోస్తోంది. పిల్లలకు కథలు చెప్పడం కేవలం వినోదం కాదని, ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ఇది తప్పనిసరి అని చెబుతున్నారు స్టోరీ టెల్లర్ దీపాకిరణ్. కథలు చెప్పడం వల్ల పెద్దలు, పిల్లల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని అన్నారామె.

ప్రయోజనాలెన్నో...

సంభాషించడానికి మాత్రమే కాదు నేర్చుకోవడానికీ.. ఆలోచనల్లో పరిణితికీ భాష అవసరం. అయితే ప్రస్తుత రోజుల్లో చిన్నారుల్లో భాషా పరిజ్ఞానం సంతరించుకోవడం ఆలస్యం కావడం సహజంగా మారింది. ఈ పరిస్థితుల్లో చిన్నారులను ఆకట్టుకునేలా కథలు చెప్పడం నేర్చుకున్న పెద్దలు ఆ నైపుణ్యాన్ని పిల్లలకు అందిస్తారు. కథల ద్వారా సంస్కృతి గురించి నేర్పవచ్చు. అలాగే ప్రవర్తనను తీర్చిదిద్దవచ్చు అంటున్నారు నిపుణులు.

మనవడికి కథలు చెబుతూనా...

కొన్ని రోజుల క్రితం నా పదేళ్ల మనవడు అమ్మమ్మా కథ చెప్పమని నన్ను అడగడం నన్నెంతో ఆశ్చర్యపరిచింది. ఇంటర్నెట్ కాలంలో కూడా పెద్దల నోటి ద్వారా కథలు వినడానికి పిల్లలు ఇష్టపడుతున్నారని నాకు అర్థమైంది. స్టోరీ టెల్లింగ్ వర్క్‌షాప్‌కి అటెండ్ అయ్యి కొత్త కొత్త కథలు, ఆకట్టుకునేలా చెప్పగలడం అనేది నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. నా మనవడు/మనవరాళ్లతో అనుబంధం మరింత బలోపేతం చేసింది.
– భారతి రామినేని





ప్రొఫెషనల్ లైఫ్‌లో ప్రజెంటేషన్స్‌కూ..

ఓ ఐటీ కంపెనీలో పని చేసే నాకు వృత్తి జీవితంలో స్టోరీ టెల్లింగ్ సామర్థ్యం ఉపకరించింది. ముఖ్యంగా పలు అంశాలపై ప్రజెంటేషన్స్ ఇవ్వడానికి సహకరించాయి. నిజానికి నా సోదరి కూతుర్ని పెంచాల్సిన బాధ్యత వల్ల స్టోరీటెల్లింగ్ నేర్చుకోవాల్సి వచ్చింది. అలా నేర్చుకుని తనకు చెప్పిన కొన్ని కథలు తనని క్లాస్‌లో టాపర్‌గా మార్చాయి. మంచి హాబీస్‌ను అలవర్చాయి. తను ఎప్పుడైనా ఏడుపు ముఖం పెట్టిందంటే నేను అనగనగా అనగానే ముఖ కవళికలు మార్చేసి ఆసక్తిగా చూస్తుంది. కథలు చెప్పడం వల్ల నా కూతురికి కూడా చాలా మానసిక వికాసం వచ్చేలా చేయగలిగాను. చాలా ఇళ్లలో పిల్లల వల్ల ఎదురయ్యే అల్లరి చిల్లరి ఇబ్బందులెప్పుడూ నాకు ఎదురు కాలేదు. దానికి కారణం కథలే అని చెప్పగలను. అందరు పిల్లలూ వీడియోగేమ్స్‌లో బిజీగా ఉండే సమయంలో మా పిల్లలు నన్ను కథ చెప్పవా అని అడుగుతారు. – వసుధ

మెళకువలు నేర్చుకుంటే మేలెంతో..

స్టోరీ టెల్లింగ్ సెషన్స్‌కి హాజరవడం వల్ల కథకు సంగీతాన్ని జత చేయడం, ముఖ కవళికలు, గొంతు పలికే తీరులో మార్పుచేర్పులు చూపడం.. వంటివి నేర్చుకుని నా మూడేళ్ల కొడుకుకి మంచి కథలు చెప్పగలుగుతున్నా. తనతో అనుబంధాన్ని మరింతగా ఆనందిస్తున్నా. – దానన్న



కళ అబ్బింది.. కథ వచ్చింది..

కథలు చెప్పడమే కదా ఎంత సేపు అనుకుంటాం కానీ.. ఈ ఆర్ట్‌ను నేర్చుకుంటే.. జీవితంలో ప్రతీ సందర్భాన్ని ఒక కథగా మలిచే సామర్థ్యం వస్తుంది. సంగీతాన్ని కలుపుతూ మా అబ్బాయికి కథ చెప్పడం, కథలోని క్యారెక్టర్స్ ఆవాహన చేసుకుని చెప్పడం వంటివి తనకి బాగా కనెక్ట్ అవుతోంది. తన కమ్యూనికేషన్ స్కిల్స్ పెరగడానికి బాగా ఉపకరిస్తోంది. విశేషం ఏమిటంటే తనే కథలు అల్లేసి నాకు చెబుతున్నాడు. – సుధారాణి






కథలతో అనుబంధాలు బలోపేతం..

స్టోరీటెల్లింగ్ అనే కళలో నైపుణ్యం సాధించే విషయంలో టీచర్లతో పాటు అవ్వా, తాతలకు, తల్లిదండ్రులకు బాగా ఆసక్తి పెరిగి మా స్టోరీ సూత్ర సంస్థను సంప్రదిస్తున్నారు. కథలు చెప్పే కళలో నైపుణ్యం సాధించిన వారు ఇలా పిల్లలతో తమ మధ్య అనుబంధం బలపడిందని, అంతిమంగా అది తమ ఆరోగ్యానికి, ఆనందానికి సైతం ఉపకరిస్తోందని చెబుతున్నారు.
– దీపాకిరణ్, స్టోరీ టెల్లర్

'వావ్ మాస్కో' వీడియో ఆర్ట్ కాంటెస్ట్ కూడా...

హాజరుకానున్న ప్రపంచ ప్రసిద్ధి చెందిన 14 మంది ఫొటోగ్రాఫర్లు

'బిగ్ సిటీస్ ఇన్ మాస్కో' ఫొటో ఎగ్జిబిషన్



సాక్షి, సిటీబ్యూరో : 'టెరిటరీ ఆఫ్ ది ఫ్యూచర్ మాస్కో 2030'లో భాగంగా మాస్కోలో 'బిగ్ సిటీస్ ఇన్ మాస్కో' ఫొటో ఎగ్జిబిషన్, వీడియో ఆర్ట్ కాంటెస్ట్ 'వావ్ మాస్కో' అనే రెండు ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఈ ఎగ్జిబిషన్‌కు బ్రిక్స్ దేశాల నుంచి 14 మంది ప్రముఖ ఫొటోగ్రాఫర్‌లు హాజరుకానున్నారు. వీడియో ఆర్ట్ కాంటెస్ట్ వావ్ మాస్కో విజేత నగరంపై షార్ట్ ఫిల్మ్ తీయనున్నారు. ఈ ఈవెంట్‌ను ఫొటో వీసా ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ ఫొటోగ్రఫీ ఆర్ట్ డైరెక్టర్, అనేక అంతర్జాతీయ ఫొటోగ్రఫీ, కాంటెంపరరీ ఆర్ట్ ఎగ్జిబిషన్ల మోడరేటర్ ఇరినా చ్మిరేవా నిర్వహించనున్నారు. ఎగ్జిబిషన్‌తో పాటు ఫోరమ్ ఫెస్టివల్ అతిథులు ప్రాజెక్ట్ క్యూరేటర్, ఫొటోగ్రాఫర్‌లతో పబ్లిక్ లెక్చర్లు, మాస్టర్ క్లాసులు ఉంటాయి. వీరు ఫొటోగ్రఫీ విభిన్న శైలులు, సాంకేతికతలపై మాట్లాడతారు. ఎగ్జిబిషన్‌లో పాల్గొనే వారు మాస్కో చిత్రాలను తీసుకుంటారు. ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్‌లతో పాటు భారత్, చైనా, ఇండోనేషియా, బ్రెజిల్, రష్యా నుంచి పది మంది ఔత్సాహిక చిత్ర నిర్మాతలను మాస్కో స్వాగతించనుంది. ఫోరమ్ ఫెస్టివల్ 'టెరిటరీ ఆఫ్ ది ఫ్యూచర్ మాస్కో 2030' ఫ్రేమ్‌వర్క్‌లో నిర్వహించనున్న వావ్ మాస్కో వీడియో ఆర్ట్ కాంటెస్ట్‌లో వీరు ఫైనలిస్టులుగా ఉంటారు. 12 దేశాల నుంచి 294 మంది ఫైనలిస్టుల ఎంపిక జరుగుతుంది. అంతర్జాతీయ జ్యూరీ ఆగస్టు 15న వేడుకలో విజేతను నిర్ణయిస్తారు. విజేతకు బహుమతితో పాటు మాస్కో గురించి ఒక లఘు చిత్రాన్ని రూపొందించే అవకాశం ఇస్తారు. మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ వీక్‌లో భాగంగా ఈ చిత్రాన్ని ఆగస్ట్ 24న జర్యాడే పార్క్‌లోని స్మాల్ యాంఫి థియేటర్‌లో ప్రదర్శించనున్నారు. ఈ ఫెస్టివల్ 39 రోజుల పాటు జరగనుంది.

ట్రెండీ.. విండో..

సాక్షి, సిటీబ్యూరో: వెరైటీ ఫర్నిచర్ ఉత్పత్తులకు పేరొందిన బే విండో నగరంలోని మియాపూర్‌లో తమ మూడో ఫర్నిచర్ స్టోర్‌ను ప్రారంభించింది. ప్రతి ఒక్కరి అభిరుచికీ, ప్రాధాన్యతలకూ సరిపోయేలా స్కాండి లివింగ్, ఆర్ట్ డెకో, లక్స్ ఎడిట్, ఎత్నిక్ చిక్, మోడరన్ వోగ్ తదితర వెరైటీలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే జూబ్లీ హిల్స్, గచ్చిబౌలిలో తమ స్టోర్స్ ఉన్నాయని, ఈ ఏడాది చివరి నాటికి నగరంలో తమ స్టోర్ల సంఖ్య ఐదుకు విస్తరించనున్నామని ఈ స్టోర్ ప్రారంభ సందర్భంగా బే విండో వ్యవస్థాపకులు సిద్ధాంత్ ఆనంద్ చెప్పారు.





నూతన ఓటీటీ హిమాన్ష

ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన బాలీవుడ్ నటులు రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియా

సాక్షి, సిటీబ్యూరో: నగర వేదికగా ప్రముఖ ప్రొడక్షన్ సంస్థ హిమాన్షు ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో నూతన ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ కార్యాలయాన్ని ప్రముఖ బాలీవుడ్ నటులు రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియాతో పాటు హిమాన్షు గ్రూప్ ఎండీ సంజీవ్ పూరి ప్రారంభించారు. ఈ వేదికగా ప్రకటనలకు సంబంధించిన షూట్‌లు, భారీ–బడ్జెట్ సినిమా నిర్మాణాలు, దర్శకత్వం ఇతర ఎంటర్‌టైన్‌మెంట్ కార్యకలాపాలకు సంస్థ కేంద్రంగా పనిచేయనుంది. భారీ సినిమాలకు, పలు వినోద కార్యక్రమాలకు వేదికైన హైదరాబాద్ కేంద్రంగా.. పరిశ్రమలో అధునాతన సౌకర్యాలతో మరిన్ని సేవలను అందించడమే లక్ష్యంగా దీనిని ప్రారంభించామని సంస్థ వ్యవస్థాపకులు హిమాన్షు దేవ్‌కేట్ తెలిపారు. హిమాన్షు ఎంటర్‌టైన్‌మెంట్ ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్, నెట్ ఫ్లిక్స్ సహా పలు వెబ్ సిరీస్‌ల నిర్మాణంలో, స్టార్‌హీరోలతో నిర్మిస్తున్న తెలుగు సినిమాల్లో పని చేస్తోందని వివరించారు.

హార్ట్ ఆఫ్ ఆదివాసి..



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా నగరంలోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా ప్రారంభించిన ఫొటో ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్రముఖ ఫొటోగ్రాఫర్ సతీష్ లాల్ దాదాపు 14 ఏళ్లు దేశంలోని 20 రాష్ట్రాల్లో తిరిగి 40కి పైగా ఆదివాసి తెగలపై తీసిన అద్భుత డాక్యుమెంటరీని ప్రదర్శిస్తున్నారు. ఆదివాసి సంస్కృతులు, వారి జీవన విధానం, వేషధారణ, పండుగలు, మేళాలు తదితర అంశాలపై తీసిన పరిశోధనాత్మక ఫొటోల సమాహారమని సతీష్ లాల్ తెలిపారు. ఈ డాక్యుమెంటరీకి గత సంవత్సరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ప్రశంసలు అందుకున్నానని గుర్తుచేశారు. తను తీసిన 65 ఆదివాసి ఫొటోలు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ ఆదివాసి ఆర్ట్ మ్యూజియంలో శాశ్వతంగా కొలువుదీరాయని అన్నారు.



20 రాష్ట్రాల్లో, 40 ఆదివాసి తెగలపై ఫొటోగ్రఫీ..

ఇదీ ఫ్లాగ్ కోడ్..

- జాతీయ జెండా ఆవిష్కరణలో ప్రత్యేక నియమావళి
- రాజ్యాంగం రూపొందించిన.. నిబంధనలేంటి?
- 2002 నవీన్ జిందాల్ కేసులో పలు సవరణలు
- అగౌరవపరిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులు
- ఇంటింటికీ జెండా నేపథ్యంలో.. సమగ్ర నియమావళి



దేశ ప్రాథమిక, ప్రధాన చిహ్నం.. భారత గౌరవ ప్రతీక.. శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వాన్ని ప్రతిబింబించేది జాతీయ జెండా. ప్రతి ఏటా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలతో పాటు పలు ప్రత్యేక రోజుల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేస్తుంటాం. అంతేకాకుండా దేశభక్తిని, భారత ప్రతిష్టను ప్రదర్శించే వివిధ సందర్భాల్లోనూ జాతీయ పతాకాన్ని వినియోగిస్తాం. ఇటీవలి కాలంలో హర్ ఘర్ తిరంగా నినాదంతో ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడుతోంది. అయితే జాతీయ జెండా ఎగరవేయడానికి, ప్రదర్శించడానికి ప్రత్యేక నిబంధనలున్నాయి. ఈ నియమావళికి ఏ మాత్రం అవాంతరం ఎదురైనా దేశ ప్రతిష్టకే అవమానం. ఈ నేపథ్యంలో రాజ్యాంగం సూచించిన ఫ్లాగ్ కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలి. ఆ వివరాలు తెలుసుకుందాం.. – సాక్షి, సిటీబ్యూరో

జాతీయ జెండా కేవలం ప్రభుత్వ భవంతుల మీద, ప్రభుత్వాధికారులకు మాత్రమే ఎగరవేసే అధికారముండేది. 2001లో నవీన్ జిందాల్ సుప్రీం కోర్టు కేసులో భాగంగా ప్రతి పౌరుడూ జెండాను ఎగరేయొచ్చని సవరించింది. జాతీయ జెండా పరిరక్షణకు సంబంధించి 1950, 1971 చట్టాలతో పాటు 2002, 2005లో సవరించిన అంశాలతో నూతన జాతీయపతాక నియమావళిని రూపొందించింది. ఈ నియమావళిలో భాగంగా పతాకం నేలనుగానీ, నీటినిగానీ తాకరాదు. టేబుల్ క్లాత్‌గా, వేదికకు ముందు భాగంలో వాడకూడదు. ఉద్దేశపూర్వకంగా జెండాను తలకిందులు చేయకూడదు, విగ్రహాలమీద, ఇతర వస్తువులకు కప్పకూడదు. నడుం కింది భాగంలో, లోదుస్తులమీద జెండాను వాడకూడదు. ఆవిష్కరణకు ముందు పువ్వులు తప్ప ఇతర వస్తువులను జెండాలో ఉంచడం, జెండా మీద ఏదైనా రాయడం నిషిద్ధం. సాధారణంగా సూర్యోదయంలో జెండాను ఎగరవేసి, సూర్యాస్తమయంలో దించివేయాలి. కాషాయరంగు పైన ఉండేటట్లు, నిలువుగా వేలాడదీసినట్లైతే కాషాయ రంగు చూసేవారికి ఎడమచేతివైపున ఉండాలి. మురికిగా ఉన్న జెండాను ప్రదర్శించకూడదు. రెండు జాతీయపతాకాలను ఎక్స్ ఆకారంలో కర్రలకు తగిలించినట్లైతే రెండు జెండాలూ వ్యతిరేకదిశల్లో తగిలించాలి. పోడియంలు, బిల్డింగుల మీద కప్పడానికి గానీ, రెయిలింగుల మీద అలంకరణ కోసంగానీ వాడకూడదు.

వీరి ఆదేశాల మేరకు..

రాష్ట్రపతి ఆదేశాల ప్రకారం మాత్రమే సంతాపసూచకంగా పతాకాన్ని అవనతం (జెండా కర్రకు సగం ఎత్తులో ఎగరెయ్యడం) చెయ్యాలి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రుల్లో ఎవరు మరణించినా దేశవ్యాప్తంగా అవనతం చేస్తారు. అధికార, సైనిక, పారామిలిటరీ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపేటప్పుడు శవపేటిక మీద తలవైపు కాషాయరంగు వచ్చేటట్లు కప్పాలి. ఐతే దానిని ఖననం చేసే ముందు తీసేయాలి. శవంతో పాటు సమాధిలోకి దించడం, కాల్చడం చెయ్యరాదు.

ఇవి తప్పనిసరి..

ఇతర దేశాల జాతీయపతాకాలతో కలిపి ఎగరేసే సమయంలో వరుసలో మొదటి స్థానంలో కుడివైపు (చూసేవారి ఎడమచేతివైపు) ఉండాలి. మిగతా పతాకాలు ఇంగ్లీష్‌లో ఆయాదేశాల పేర్లను బట్టి అక్షరక్రమంలో అమర్చాలి. అన్ని పతాకాలూ దాదాపు ఒకే పరిమాణంలో ఉండాలి. అన్ని పతాకాలూ విడివిడిగా వేర్వేరు జెండాకర్రలమీద ఎగరెయ్యాలి. వృత్తాకారంలో ఎగరేసినప్పుడు భారత పతాకం దగ్గరే వృత్తం మొదలై, సవ్యదిశలో తిరిగిరావాలి. మన పతాకాన్ని ముందు ఎగరేసి అన్నిటికంటే చివర అవనతం చెయ్యాలి. పతాకాన్ని సమావేశాల్లో వేదికల మీద ప్రదర్శించేటప్పుడు కుడివైపునే (చూసేవారికి ఎడమవైపున) ఉండాలి. వక్తలు ఉపన్యసించేచోట ఉన్నట్లైతే వారికి కుడిచేతి వైపునే ఉండాలి. ఇతర జెండాలతో కలిపి ఊరేగింపులో తీసుకెళ్ళే సమయంలో మొదట్లో ఉండాలి. జెండాలన్నిటినీ ఒకే వరసలో తీసుకెళ్లేటప్పుడు కుడివైపున మొదటిదిగా లేదా మధ్యలో అన్నిటి కంటే ముందు ఉండాలి. దేనికీ/ఎవరికీ గౌరవసూచకంగా జాతీయ జెండాను కిందికి దించరాదు.

వాహనాలపై...

జాతీయపతాకాన్ని వాహనాల మీద ఎగరేసే అధికారం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు, పార్లమెంటు, శాసనసభల సభ్యులు, లోక్‌సభ, శాసనసభల స్పీకర్లు, రాజ్యసభ, రాష్ట్రాల శాసనమండళ్ల అధ్యక్షులు, సుప్రీం కోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు, సైనిక, నావికాదళ, వాయుసేనల్లోని ఉన్నతాధికారులకు మాత్రమే ఉంది. ఇతర దేశాల నాయకులు భారత ప్రభుత్వ వాహనంలో తిరుగుతున్నప్పుడు భారత జాతీయపతాకం కుడి వైపు చివరన, వారి జాతీయ పతాకం ఎడమవైపు చివరన ఉండాలి.



ఐటీ ఉద్యోగులకు హరిత హోటల్స్‌లో 15% రాయితీ



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

మాదాపూర్: రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలన్నీ సందర్శించడం, విస్తృతంగా పర్యటించడం ద్వారా అభివృద్ధి చేసేందుకు ఐటీ ఉద్యోగులు, యువత ముందుకు రావాలని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. పర్యాటకరంగ అభివృద్ధి, బ్రాండింగ్, ప్రమోషన్ వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. టూరిజం ప్రమోషన్‌లో భాగంగా మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్‌లో మంగళవారం ఆయన ఐటీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఐటీ ఉద్యోగులకు హరిత హోటల్స్‌లో 15శాతం రాయితీని కల్పిస్తూ రూపొందించిన డిస్కౌంట్ కూపన్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. త్వరలో అన్ని వివరాలతో కూడిన పర్యాటక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఐటీ ఉద్యోగులు, యువత, వివిధ సంఘాల సహకారంతో తెలంగాణ పర్యాటక ప్రాంతాల గురించి విస్తృత ప్రచారం చేయనున్నట్టు తెలిపారు.

నేటి నుంచి జూడాల విధుల బహిష్కరణ

సాక్షి, హైదరాబాద్: కోల్‌కతాలోని మెడికల్ కాలేజీలో ఓ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై పెల్లుబికిన దేశవ్యాప్త ఉద్యమానికి తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సంఘీభావం ప్రకటించింది. ఈ ఘటనపై సీబీఐ ద్వారా సమగ్ర విచారణ చేపట్టాలనే డిమాండ్‌తో బుధవారం నుంచి జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్లు, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర వైద్య విద్య సంచాలకులకు నోటీసు అందించారు. ఔట్ పేషంట్ విభాగంతో పాటు అన్ని రకాల ఓటీ సేవలు, ఇతర ఎలక్టివ్ సర్వీసులను బహిష్కరించి ఉద్యమిస్తున్నట్లు తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కొమ్ము రాహుల్, డాక్టర్ జె.ఐసాక్ న్యూటన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన వైద్యులు సమ్మెకు దిగిన నేపథ్యంలో రాష్ట్రంలోని జూనియర్ డాక్టర్లు సైతం దేశవ్యాప్త ఉద్యమంలో భాగస్వాములవుతున్నట్లు ప్రకటించారు.

ఏసీబీకి చిక్కిన అదనపు కలెక్టర్

రూ.8 లక్షల నగదుతో పట్టుబడిన రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారి

- సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి కూడా..
- 'నిషేధిత భూమి'వ్యవహారంలో లంచం డిమాండ్
- పక్కా పథకంతో పట్టుకున్న అవినీతి నిరోధక విభాగం
- చంచల్‌గూడ జైలుకు తరలింపు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎంవీ భూపాల్‌రెడ్డితో పాటు కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి ఏసీబీకి చిక్కారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బాలాపూర్ మండలం గుర్రంగూడకు చెందిన జక్కిడి ముత్యంరెడ్డికి 14 గుంటల పట్టా భూమి ఉంది. ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితా నుంచి దీన్ని తొలగించాలని కోరుతూ ఆయన ఇటీవల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌ను కలిసి అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఇ-సెక్షన్‌లో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డిని సంప్రదించారు. విషయం అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఆయన రూ.10 లక్షలు డిమాండ్ చేయగా, రూ.8 లక్షలు ఇస్తానని ఒప్పుకున్నాడు. అయితే ఆ తర్వాత ఆయన ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో అధికారులు స్కెచ్చేశారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మదన్‌మోహన్‌రెడ్డిని



ఏసీబీకి పట్టుబడిన అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి

గుర్రంగూడ ఎక్స్‌రోడ్‌కు ముత్యంరెడ్డి పిలిపించాడు.

మాటు వేసి..

సీనియర్ అసిస్టెంట్ తన స్విఫ్ట్ డిజైర్ టీఎస్ 08ఎఫ్ ఆర్ 1134 కారులో అక్కడికి చేరుకోగా ముత్యంరెడ్డి రూ.8 లక్షల నగదుతో కూడిన సంచిని అందజేశాడు. అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు మదన్‌మోహన్‌రెడ్డిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే అతను అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకే తాను డబ్బులు తీసుకున్నట్లు చెప్పడంతో అతనితో భూపాల్‌రెడ్డికి ఫోన్ చేయించారు. నగదు తీసుకుని ఓఆర్ఆర్ పెద్ద అంబర్‌పేట్ ఎగ్జిట్ వద్దకు రావాలని భూపాల్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ ఇన్నోవా కారు (టీఎస్ 07జీకే0459)లో రాత్రి 10.41 గంటలకు పెద్ద అంబర్‌పేట ఓఆర్ఆర్ వద్దకు వచ్చారు. అప్పటికే అక్కడకు చేరుకున్న మదన్‌మోహన్ తన కారులో ఉన్న నగదును భూపాల్‌రెడ్డి వాహనంలో పెట్టారు. ఆ వెంటనే ఏసీబీ అధికారులు భూపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌కు తీసుకొచ్చి విచారించారు. తెల్లారేవరకు అక్కడే ఉంచారు. కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు.

రూ.16 లక్షల నగదు, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

హయత్‌నగర్ పరిధిలోని తట్టిఅన్నారం వద్ద ఇందు అరణ్య విల్లాస్‌లో ఉంటున్న భూపాల్‌రెడ్డి ఇంట్లోనూ తనిఖీలు చేశారు. రూ.16 లక్షల నగదు, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం మదన్‌మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డిలను ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ఐదుగురిని పట్టించిన ముత్యంరెడ్డి



గుర్రంగూడకు చెందిన జక్కిడి ముత్యంరెడ్డి గతంలో తుర్కయాంజాల్‌కు చెందిన ఓ వీఆర్వో, మున్సిపల్ పరిధిలోని బిల్ కలెక్టర్‌తో పాటు ఓ ఎస్‌ఐని కూడా వివిధ కేసుల్లో ఏసీబీకి పట్టించడం గమనార్హం. కాగా ఇప్పుడు ఏకంగా ఓ అదనపు కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్‌ను కూడా పట్టించారు.

ప్రతి అడుగులోనూ మోసం

ఎన్నికల్లో చంద్రబాబు ఎన్నెన్నో ఆశలు చూపి.. ఇప్పుడు మాట తప్పారు

ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్

మళ్లీ మన పార్టీ ఘన విజయం సాధిస్తుంది. ఎందుకంటే మనం ఎవరినీ మోసం చేయలేదు. ఎలాంటి అబద్ధాలు చెప్పలేదు. రెండు నెలల్లోనే ఈ ప్రభుత్వంపై ప్రజల్లో ఎంతో వ్యతిరేకత వచ్చింది. ఈ ఐదేళ్లలో వేధింపులకు గురి చేస్తారు. కష్టాలు కూడా ఉంటాయి. నా పరిస్థితులే దీనికి ఉదాహరణ. నన్ను 16 నెలలు జైల్లో పెట్టారు. అటువంటి కష్టాలు నేను చూశాను. కానీ కష్టాలు ఎల్లకాలం ఉండవు. చీకటి తర్వాత వెలుతురు కచ్చితంగా వస్తుంది. రాత్రి తర్వాత పగలు వస్తుంది. ఇది సృష్టి సహజం. అలాగే ఈ ఐదేళ్లు కూడా ముగుస్తాయి. మనం మళ్లీ అధికారంలోకి వస్తాం. మన ప్రభుత్వంలో మళ్లీ మీరు, నేను ప్రజలకు సేవ చేసే గొప్ప పరిస్థితుల్లో ఉంటాం. ఇది కచ్చితంగా అందరూ గుర్తు పెట్టుకోండి.

– వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబునాయుడి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులోనూ మోసమే కన్పిస్తోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో గెలుపు కోసం ఎన్నెన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు వాటిలో ఏవీ అమలు చేయకుండా, ఏవేవో కారణాలు చెబుతూ సాకులు చూపుతున్నారని ఎత్తి చూపారు. అది చంద్రబాబు నైజమని, మోసం చేయడం ఆయనకు ఎప్పుడూ అలవాటేనని గుర్తు చేశారు. మోసాలకు, అబద్ధాలకు చంద్రబాబు, టీడీపీ అలవాటు పడ్డారని.. అదే మనం విలువలు, విశ్వసనీయత మీదే రాజకీయాలు చేస్తున్నామని.. అందుకే మనకు తప్పక మంచి రోజులు వస్తాయని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ఉద్బోధించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో మంగళవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో తొలుత మాడుగుల, ఆ తర్వాత అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాలకు చెందిన జెడ్పీటీసీ,



ఎంపీటీసీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంక్షోభం ఎంతగా ఉన్నప్పటికీ సాకులు చూపలేదన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించి, మాట తప్పకుండా అమలు చేశామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట కోసం కట్టుబడి పని చేశామన్నారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఇప్పటికే ప్రభుత్వంపై వ్యతిరేకత

జగన్ బాగానే చూసుకున్నాడు. జగన్ కన్నా చంద్రబాబు వయసులో పెద్దవాడు కదా.. జగన్ పలావు పెట్టాడంటే చంద్రబాబు బిర్యానీ పెడతాడేమో అని ప్రజలందరూ కాస్తో కూస్తో మోసపోయి అటు వైపు వెళ్లారు. కేవలం రెండున్నర నెలల్లోనే ప్రభుత్వం మీద ఇంత వ్యతిరేకత కనిపిస్తోంది. ఇంటికే వచ్చే పెన్షన్ విధానం పోయింది. ఇంటికే వచ్చే రేషన్ విధానం పోయింది. మళ్లీ జన్మభూమి కమిటీలు వచ్చాయి. విత్తనాల కోసం రైతులు క్యూలో నిలబడాల్సి వస్తోంది. ఈ–క్రాప్, ఉచిత పంటల బీమా పోయింది. శాంతి భద్రతలు నీరుగారిపోయాయి. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలు పెంచుతున్నారు. చేసిన మంచి ఎక్కడికీ పోదు. మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి ఈ మంచే మనకు శ్రీరామ రక్ష. చంద్రబాబు చేస్తున్న మోసాలు ప్రజల ఆగ్రహానికి దారి తీస్తాయి. ఎందుకంటే ప్రజలకు ఇప్పుడు పలావు లేదు. బిర్యానీ లేదు. పస్తులుండాల్సిన పరిస్థితి. ఈ ప్రభుత్వం ప్రతి అడుగులో మోసం కనిపిస్తోంది. జన్మభూమి కమిటీల చుట్టూ, టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. ఇవన్నీ రెండు నెలల్లోనే కనిపిస్తున్నాయి.

కాంట్రాక్టు సంస్థపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- బీజేపీ శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి
- 'సుంకిశాల'రిటైనింగ్‌వాల్ కూలిన ప్రాంతాన్ని పరిశీలించిన బీజేపీ ఎమ్మెల్యేల బృందం

పెద్దవూర: సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్‌వాల్ కూలిన ఘటనలో కాంట్రాక్టు కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టి..క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పునర్నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని కాంట్రాక్టు కంపెనీ నుంచే రాబట్టాలన్నారు. రిటైనింగ్‌వాల్ కూలిన ప్రాంతాన్ని మంగళవారం బీజేపీ ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది. అనంతరం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 2వ తేదీన ఘటన జరిగితే సోషల్ మీడియాలో వచ్చే వరకు ఎందుకు గోప్యంగా ఉంచారో చెప్పాలన్నారు. కాంట్రాక్టర్‌ను కాపాడుకోవడానికా.. తప్పిదాలను వెనుకేసుకోవడానికా అని ప్రశ్నించారు. మంత్రులు వచ్చి సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి చిన్న ప్రమాదమని, చాలా తక్కువ నష్టమని అంటున్నారని, ఇప్పటివరకు త్రిసభ్య విచారణ కమిటీ ఎంత నష్టం జరిగిందో అంచనానే వేయలేదని చెప్పారు. రూ.2 వేల కోట్ల



రిటైనింగ్‌వాల్ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న బీజేపీ ఎమ్మెల్యేల బృందం. చిత్రంలో మహేశ్వర్‌రెడ్డి

ప్రాజెక్టు వారికి చిన్నదిగా కనిపిస్తుందా అని ప్రశ్నించారు. రిటైనింగ్‌వాల్ కూలిన ఘటనలో ఏదో లోపాయికారీ ఒప్పందం ఉందని, పనుల్లో నాణ్యత లోపమా, మరేదైనా కారణం ఉందా అనేది బహిర్గతం కావాలంటే సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ తప్పిదం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, లైసెన్సు రద్దు చేయాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా విజిలెన్స్ కమిటీచే విచారణ చేపట్టి నాణ్యత ప్రమాణాలు పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

పాడి పరిశ్రమపైనా రాజకీయాలా?: శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఆంధ్ర ప్రాంత డెయిరీలకు పెద్దపీట వేసేందుకు విజయడెయిరీని అణచివేసే కుట్రలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు నెలలు కావొస్తున్నా పాడి రైతులకు డబ్బులు చెల్లించడం లేదన్నారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మంగళవారం శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో రోజూ 30 లక్షల లీటర్ల పాల వినియోగం ఉండగా తెలంగాణ నుంచి 5 లక్షల లీటర్లు మాత్రమే వస్తున్నాయన్నారు. కేసీఆర్ పాలనలో పాడి రైతులకు లీటరుకు రూ.4 చొప్పున ప్రోత్సాహకంతో పాటు దాణాకు కూడా డబ్బులు ఇచ్చేవారని గుర్తుచేశారు. తెలంగాణలో పాడి పరిశ్రమను బొంద పెట్టి ఆంధ్ర డెయిరీలను పెంచి పోషించేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. హైదరాబాద్‌కు అవసరమైన మరో 25 లక్షల లీటర్ల పాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో చెప్పాలన్నారు. విజయ డెయిరీలో రూ.500 కోట్ల మేర పాల ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని, వాటిని యాదాద్రి లేదా తిరుమల దేవస్థానానికి విక్రయించాలని డిమాండ్ చేశారు. పాడి రైతులకు బకాయిలు చెల్లించకుంటే ఉద్యమిస్తామని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

ఆ ముగ్గురి సహకారం వల్లే వర్గీకరణ

- ఎస్సీల కలను మోదీ, అమిత్ షా, కిషన్‌రెడ్డి నెరవేర్చారు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ

కవాడిగూడ: ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలంటూ గత 30 ఏళ్లుగా జరిపిన పోరాటానికి ఫలితం లభించిందని, ఇందుకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్‌రెడ్డిలే కారణమని, వారి సహకారం వల్లే వర్గీకరణ కల నెరవేరిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ మంగళవారం బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల సామాజిక వర్గం సమాజం ముందు దోషిగా నిలబడొద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వర్గీకరణ విషయంలో మాదిగలను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో వర్గీకరణను అమలు చేయాలని కోరేందుకు త్వరలో తాను సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానని చెప్పారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, ప్రొఫెసర్ కాశీం తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంద కృష్ణ. చిత్రంలో మోత్కుపల్లి

నగర వార్తలు

నగరంలో నేడు

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు టూరిజం ప్రమోషన్‌లో భాగంగా మధ్యాహ్నం 1 గంటకు హైటెక్ సిటీలోని రహేజా మైండ్ స్పేస్‌లో ఐటీ ఉద్యోగులకు సమావేశమవుతారు.
- బషీర్‌బాగ్ కింగ్ కోఠి రోడ్‌లోని భారతీయ విద్యా భవన్‌లో ఉదయం 11.30గంటలకు టీసీఎస్ ఫ్లాగ్‌షిప్ ఇంటర్–స్కూల్ క్విజ్ కాంపిటీషన్ జరుగుతుంది.
- గచ్చిబౌలి వినాయకనగర్‌లోని కామెడీ థియేటర్‌లో మిడ్‌నైట్ కామెడీ ఈవెంట్ రాత్రి 11 గంటలకు జరుగుతుంది.
- ఒన్ వరల్డ్ ఫ్యాషన్–2024 సెషన్ ఈవెంట్ రాత్రి 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రవీంద్రభారతిలో జరుగుతుంది.
- ఒక విధ్వంసం–1056/90 పుస్తకావిష్కరణ అమీర్‌పేట్‌లోని హోటల్ మ్యారీగోల్డ్‌లో ఉదయం 11.30 గంటలకు జరుగుతుంది. ప్రొఫెసర్ జి.హరగోపాల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.

నేడు జాబ్‌మేళా

సాక్షి, సిటీబ్యూరో: నిరుద్యోగ యువత కోసం హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ అర్హత కల్గిన ఉన్న ఆసక్తి కలిగిన యువత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో హాజరుకావాలని, ఎంపికైన వారికి జె గ్రూప్ కంపెనీ నెలకు రూ.15 వేల వేతనం ఇస్తుందని తెలిపారు.

వెలాంకిణికి ప్రత్యేక రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: వెలాంకిణికి వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–వెలాంకిణి (07125/07126) స్పెషల్ ట్రైన్ ఈ నెల 27, వచ్చేనెల 4 తేదీల్లో ఉదయం 8.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30కు వెలాంకిణికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 28, సెప్టెంబర్ 5 తేదీల్లో రాత్రి 10.45 గంటలకు బయలుదేరి రెండోరోజు తెల్లవారు జామున 3 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. సికింద్రాబాద్–వెలాంకిణి (07127/07128) మరో స్పెషల్ ట్రైన్ ఈ నెల 29, సెప్టెంబర్ 7 తేదీల్లో ఉదయం 8.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30కు వెలాంకిణి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 30, సెప్టెంబర్ 8 తేదీల్లో రాత్రి 10.45 గంటలకు బయలుదేరి రెండో రోజు ఉదయం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

నైపుణ్యాల అభివృద్ధికి సూచనలు అవసరం

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: పాఠశాలలను సందర్శించినప్పుడు ఉపాధ్యాయులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే విధంగా సానుకూల దృక్పథంతో సూచనలు చేయాలని కాంప్లెక్స్ హెచ్ఎంలు, మండల నోడల్ అధికారులను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. సమావేశ మందిరంలో డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎఎస్, కాంప్లెక్స్ హెచ్ఎం, మండల నోడల్ అధికారులు, సర్వశిక్షా అభియాన్ కో ఆర్డినేటర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లస్టర్ నోడల్ అధికారులు, మండల నోడల్ అధికారులు పాఠశాలలను సందర్శించినప్పుడు పర్యవేక్షణ స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలన్నారు. సీఎస్‌ఓలు, ఎమ్మెల్యేలు పాఠశాలకు చేరుకున్న వెంటనే ప్రధానోపాధ్యాయులను కలుసుకొని సందర్శన గురించి తెలపాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న మంచి, ప్రోత్సాహకరమైన, సానుకూల సమస్యల గురించి చర్చించాలని తెలిపారు. తరగతి గది పరిశీలనకు ముందు ఉపాధ్యాయులతో కాసేపు మాట్లాడాలని, తరగతి గదిని గమనిస్తూనే తరగతి గది వెనుక చివరి బెంచ్‌లు లేదా కుర్చీలో కూర్చొని విద్యాబోధన, అభ్యాసం, బోధనలోని అంతరాలను నోట్ చేసుకోవాలన్నారు. ఫౌండేషనల్ లిటిరసీ అండ్ న్యూమరసి(ఎఫ్ఎల్ఎన్) అంతరాలను గుర్తించడానికి ఉపాధ్యాయులకు మార్గ నిదర్శనం చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన జరిగేలా ఉపాధ్యాయుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. క్లస్టర్ నోడల్ అధికారులు, ఎంఎన్‌ఓలు టూర్ షెడ్యూల్ ప్రకారం అన్ని పాఠశాలలను సందర్శించాలన్నారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి, డిప్యూటీ ఈవోలు, డిప్యూటీ ఐఓఎస్‌లు, సీఎస్‌ఓలు, ఎమ్ఎస్‌వోలు, సర్వశిక్షా అభియాన్ కో ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కంటోన్మెంట్ జాయింట్ సీఈఓగా పల్లవి విజయ్ వన్ని

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ జాయింట్ సీఈఓగా పల్లవి విజయ్ వన్ని నియమితులయ్యారు. పది నెలలుగా కంటోన్మెంట్ జాయింట్ సీఈఓగా పనిచేసిన ఆకాశ్ కుమార్ శర్మ, మోరార్ కంటోన్మెంట్ సీఈఓగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నియమితులైన పల్లవి విజయ్ వన్ని మంగళవారం బోర్డు కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సీఈఓ మధుకర్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన జాయింట్ సీఈఓను ఉద్యోగులకు పరిచయం చేశారు. బదిలీపై వెళ్తున్న ఆకాశ్‌కుమార్ శర్మకు వీడ్కోలు పలికారు. 2022 బ్యాచ్‌కు చెందిన పల్లవి ఇటీవలే సివిల్ సర్వీసెస్ శిక్షణ పూర్తి చేసుకుని నిథమ్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా పనిచేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ జాయింట్ సీఈఓగా ఆమెకు తొలి పోస్టింగ్ లభించడం గమనార్హం.

డీఈఓగా దినేశ్‌రెడ్డి

సికింద్రాబాద్ సర్కిల్ డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్‌గా 2012 ఐడీఈఎస్ బ్యాచ్‌కు చెందిన దినేశ్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. గత నెలలోనే బదిలీపై వచ్చిన ఆయన, ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్ సర్కిల్ అసిస్టెంట్ డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్, భూపతి రోహిత్ విశాఖపట్టణం డీఈఓగా బదిలీపై వెళ్లారు. మంగళవారం నాటి కార్యక్రమంలో నూతన డీఈఓ దినేశ్‌కుమార్‌రెడ్డిని సైతం సీఈఓ మధుకర్‌నాయక్, బోర్డు అధికారులు, సిబ్బందికి పరిచయం చేశారు.



జాయింట్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించాక, ఉద్యోగులతో మాట్లాడుతున్న పల్లవి విజయ్ వన్ని

రేపటి నుంచి పాత కరెన్సీ, నాణేల ప్రదర్శన

చార్మినార్: పాతబస్తీ ఉర్దూ ఘర్‌లో 15 నుంచి 17వ తేదీ వరకు ప్రపంచంలోని అరుదైన పాత కరెన్సీ, నాణేల ప్రదర్శన నిర్వహించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

సౌందర్య సమతుల్యత అవసరం



సాక్షి, సిటీబ్యూరో: యంగ్ ఫిక్కీ లేడీస్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో సోమాజిగూడ పార్క్ హోటల్ వేదికగా నిర్వహించిన ‹బ్యాలెన్స్ అండ్ బ్లిస్ట్ ఇంటిగ్రేటింగ్ బ్యూటీ వెల్‌నెస్ సెషన్ సౌందర్యానికి సంబంధించిన పలు ఆసక్తికర అంశాలను వెల్లడించింది. ఈ సెషన్‌లో ముగ్గురు ప్యానలిస్టులు ‹అక్కైండ్› బ్యూటీ సహ వ్యవస్థాపకులు మీరా రాజ్‌పుత్ కపూర్, ప్రముఖ రచయిత్రి, బ్యూటీ – వెల్‌నెస్ కాలమిస్ట్ వసుధా రాయ్, కోసా వెల్‌బీయింగ్ డైరెక్టర్, సౌందర్య వైద్యురాలు డా.పూజా తలేరా పాల్గొన్నారు. నటుడు షాహిద్ కపూర్ భార్య మీరా రాజ్‌పుత్ కపూర్ మాట్లాడుతూ.. జీవితంలోని మాధుర్యాన్ని ఆస్వాదించాలంటే సౌందర్యపరమైన సమతుల్యత అవసరమన్నారు. మన పూర్వీకుల నుంచి తగినంత జ్ఞానం లభించింది. దానిలో కొంత భాగాన్ని మనం ఉపయోగించుకున్నా మంచి వ్యక్తులుగా ఉంటామని పేర్కొన్నారు. యంగ్ ఫిక్కీ లేడీస్ ఛైర్‌పర్సన్ రిధి జైన్ తదితరులు ఉన్నారు.

వండర్‌లాలో ఇండిపెండెన్స్ డే



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ప్రముఖ వినోద కేంద్రం వండర్‌లాలో.. ఇండిపెండెన్స్ డే వేడుకల్ని వినూత్నంగా నిర్వహిస్తోంది. రెస్టారెంట్స్ మొత్తం త్రివర్ణ శోభితంగా అలంకరిస్తున్నామని, అలాగే ట్రై కలర్ థీమ్‌తో ఫుడ్ మెనూ రూపొందించామన్నారు. అలాగే స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ దేశవ్యాప్తంగా అన్నిరకాల రుచులనూ మేళవించిన స్పెషల్ థాలీని అందిస్తున్నామన్నారు. సందర్శకులు ఉదయం జరిగే ఇండిపెండెన్స్ డే పరేడ్‌ని వీక్షించవచ్చని, డీజే సంగీతం మరో ఆకర్షణగా పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా ప్రతి రెండు ఆన్‌లైన్ ఎంట్రీల కొనుగోలుపై మరో ఎంట్రీ ఉచితంగా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని, ఫ్రీడమ్ ఆఫర్ కింద నేరుగా కొనుగోలు చేసేవారికి ప్రతి 3 ఎంట్రీలకూ ఒక ఎంట్రీ ఉచితంగా ఈ నెల 31వరకూ అందిస్తామన్నారు.

విద్యా వ్యవస్థ ఆర్థిక వ్యయం 175 బిలియన్ డాలర్లు

కేంద్ర మానవ వనరులు, అభివృద్ధి మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి ఆర్.సుబ్రహ్మణ్యం



'మనూ'లో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: విద్యార్థులకు ప్రధాన సామర్థ్యాలను అందించడానికి ఏడాది ఆర్థిక వ్యయం 175 బిలియన్ల డాలర్లు వెచ్చించడం జరుగుతోందని కేంద్ర మానవ వనరులు, అభివృద్ధి మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి ఆర్.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్(ఐక్యూఏసీ) సహకారంతో యూజీసీ మాలవ్య మిషన్ టీచర్ ట్రెనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక రెండవ రోజు సమావేశంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. 4.5 కోట్ల మంది విద్యార్థులతో భారతదేశంలో విస్తారమైన, విస్తృతమైన విద్యావ్యవస్థ ఉందన్నారు. లాభదాయకమైన ఉపాధి కోసం విద్యార్థులకు ప్రధాన సామర్థ్యాలను అందించడంలో విఫలమైన విద్యా వ్యవస్థ ఆర్థిక వ్యయం ఏడాది 175 బిలియన్ డాలర్లు చేరుతుందన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్రాంత ప్రొఫెసర్ అసోసియస్ సిక్వేరా ఇన్‌చార్జి, వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీఎఫ్ రహమాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్‌కే ఇష్తియాక్ అహ్మద్, పలువురు ప్రొఫెసర్లు, అధికారులు పాల్గొన్నారు.

మ్యాథ్ హ్యాకథాన్ 2.0కు ఆరువేల దరఖాస్తులు

రాయదుర్గం: మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీ హబ్(మ్యాథ్) నిర్వహించే హ్యాకథాన్‌కు ఇప్పటి వరకు 6వేల దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ప్రపంచ కృత్రిమ మేధ ఆవిష్కరణల సదస్సుకు సన్నాహకంగా మ్యాథ్‌హ్యాక్ 2.0 కర్టన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే.. ఇంకా ఎక్కువ మంది పాల్గొనే వారిని ఆకర్షించే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఆగస్టు 15 చివరి తేదీ కావడంతో మరిన్ని దరఖాస్తులు వస్తాయని భావిస్తున్నారు. ఇదిలావుండగా సెప్టెంబర్ 4, 5 తేదీల్లో మ్యాథ్ హ్యాకథాన్ నిర్వహించేందుకు నిర్ణయించాలని సోమవారం ప్రకటించారు. ఇన్నోవేషన్ గాలా అవార్డులను ఆగష్టు 29న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అవార్డులు పది విభిన్న వర్గాల్లో ఏఐ ఆవిష్కరణను గుర్తిస్తాయి. మొత్తం 16 అవార్డులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అవార్డుల కోసం ఇప్పటికై 100 దరఖాస్తులు వచ్చాయి.

4న విద్యుత్ బీసీ ఉద్యోగుల మహాధర్నా



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

పంజగుట్ట: విద్యుత్ సంస్థల్లో కొన్ని సంవత్సరాలుగా బీసీ, ఓసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని వెంటనే సరి చేయాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయపరంగా విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో అన్యాయం చేయవద్దని కోర్టు ఆదేశాలు ఉన్నా సహజ న్యాయ సూత్రాలు పాటించకుండా పదోన్నతులు కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఏళ్ల తరబడి ఒకే పోస్టులో కొనసాగిస్తూ ఉద్యోగుల పట్ల ఆటవిక న్యాయం జరపడాన్ని సహించేంది లేదని హెచ్చరించారు. న్యాయపరమైన డిమాండ్లను సాధించేందుకు విద్యుత్ సంస్థల బీసీ, ఓసీ ఉద్యోగులు సెప్టెంబర్ 4వ తేదీన తలపెట్టిన ఖైరతాబాద్ విద్యుత్ సౌధా ఎదుట మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం చైర్మన్ కొడెపాక కుమారస్వామి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో చైర్మన్ ఆర్.సుధాకర్‌రెడ్డి, సి.భానుప్రకాష్ పాల్గొన్నారు.

రింగ్‌రోడ్ ఇంటర్‌చేంజ్

ఫ్యాక్టరీ కోసం డిజైన్ మార్పు

- ప్రజ్ఞాపూర్ వద్ద రాజీవ్ రహదారిని క్రాస్ చేయనున్న రీజనల్ రింగ్‌రోడ్డు
- అక్కడ నాలుగు లూప్‌ల బదులు మూడింటితోనే ఇంటర్‌చేంజ్ డిజైన్
- దశాబ్దాలుగా ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను తొలగించలేక ఈ నిర్ణయం



క్లోవర్ లీఫ్ ఇంటర్‌చేంజ్ ఇలా ఉంటుంది..

దశాబ్దాలుగా కొనసాగుతున్న ఓ భారీ ప్రైవేటు పరిశ్రమ కోసం రీజనల్ రింగురోడ్డు ఇంటర్‌చేంజ్ డిజైన్ మారింది. ముందుగా ఎంచుకున్న డిజైన్‌లో రింగురోడ్ కూడలి నిర్మిస్తే.. ఆ పరిశ్రమను తొలగించాల్సిన పరిస్థితి. అది స్థానికంగా నిరసనకు కారణమవుతుందన్న ఉద్దేశంతో ఇంటర్‌చేంజ్ డిజైన్‌ను మార్చారు. నాలుగు లూప్‌లతో నిర్మించడానికి బదులు.. ఆ పరిశ్రమ వైపు లూప్ లేకుండా మూడింటితోనే ఇంటర్‌చేంజ్ డిజైన్‌ను ఖరారు చేశారు.

సాక్షి, హైదరాబాద్

తూప్రాన్ నుంచి గజ్వేల్ పక్కగా వచ్చే రీజనల్ రింగురోడ్డు హైదరాబాద్–కరీంనగర్ రాజీవ్ రహదారిని ప్రజ్ఞాపూర్‌కు కాస్త ముందుగా క్రాస్ చేస్తుంది. రాజీవ్ రహదారి మీద వాహనాల రద్దీ ఎక్కువ. ఇలా అధిక రద్దీ ఉన్న రోడ్లను రీజ

రోడ్డు లేఔట్ మార్చే వీలు లేక..

నల్ రింగ్‌రోడ్డు క్రాస్ చేసేచోట.. నాలుగు లూప్‌లతో ఉండే క్లోవర్ లీఫ్ డిజైన్‌తో ఇంటర్‌చేంజ్ జంక్షన్లను నిర్మించాలని గతంలోనే నిర్ణయించారు. ఈ మేరకు ప్రజ్ఞాపూర్ సమీపంలో క్లోవర్ లీఫ్ డిజైన్‌తో ఇంటర్‌చేంజ్ నిర్మించాల్సి ఉంది. కానీ ఇంటర్ చేంజ్‌కు ఉండే నాలుగు లూప్‌లలో ఒక లూప్ కట్టాల్సిన చోట ఓ బ్రేక్ లైనర్స్ తయారీ పరిశ్రమ ఉంది. అదే డిజైన్‌తో నిర్మిస్తే.. ఆ పరిశ్రమను తొలగించాల్సిన పరిస్థితి. ఇలా జరగకుండా రింగ్‌రోడ్డును కాస్త అటువైపో, ఇటువైపో జరపడానికీ వీలు లేకుండా పోయింది. ఆర్‌ఆర్‌ఆర్‌ను హైదరాబాద్ వైపు జరపాలనుకుంటే.. ఓవైపు కొండపోచమ్మ సాగర్ జలాశయం, మరోవైపు వందల ఎకరాల్లో విస్తరించిన సామాజిక అటవీ ప్రాంతం అడ్డు వస్తున్నాయి. అదే గజ్వేల్ వైపు జరపాలనుకుంటే.. వేల ఇళ్లతో నిర్మించిన పునరావాస కాలనీ, గజ్వేల్ రింగురోడ్డు కూడలి అడ్డు వస్తున్నాయి. ఒకవేళ పరిశ్రమను తొలగించాలనుకుంటే.. దశాబ్దాలుగా స్థానికులకు ఉపాధినిస్తున్న పరిశ్రమను తొలగిస్తే ప్రజల నుంచి వ్యతిరేకత రావొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో.. ఇంటర్‌చేంజ్ డిజైన్‌ను మూడు లూప్‌లకు మార్చారు. మరో లూప్‌కు బదులు.. పరిశ్రమ ప్రహరీని ఆనుకుని రెండు కారిడార్లను నిర్మించి, ఇటు రాజీవ్ రహదారికి, అటు 'రీజనల్' ప్రధాన వేకు అనుసంధానం చేసేలా డిజైన్‌ను సిద్ధం చేశారు. అయితే మార్పుల వల్ల అదనంగా కొంత రోడ్డు, రెండు వంతెనలు నిర్మించాల్సి వస్తుందని.. దాదాపు రూ.30 కోట్ల వరకు ఖర్చు పెరుగుతుందని అంచనా వేశారు.



ప్రజ్ఞాపూర్ వద్ద డిజైన్ మార్చి ఇలా నిర్మించనున్నారు

సెప్టెంబర్ 2 వరకు కవిత కస్టడీ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం ఈడీ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కస్టడీని మూడు వారాలు పొడిగిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కస్టడీ ముగియడంతో అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరు పరిచారు. అనంతరం, ఈడీ విజ్ఞప్తి మేరకు కవిత కస్టడీని సెప్టెంబర్ 2 వరకూ పొడిగిస్తున్నట్లు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

మధ్యాహ్న భోజన వివరాలు అందజేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు వివరాలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పథకాన్ని అమలు చేయడం లేదని.. ఐసీడీఎస్‌ల్లో మెనూ ప్రకారం సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకాన్ని కూడా అమలు చేయడం లేదంటూ హైదరాబాద్‌కు చెందిన కీతినీడి అఖిల్ శ్రీ గురుతేజ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి, కేంద్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీ చేసింది.

మురికి కూపం.. పురుగుల బియ్యం

▶ మొదటి పేజీ తరువాయి

మాట్లాడారు. ఈ సోదాలపై ఏసీబీ ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్ జాంబాగ్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలోని బీసీ బాలుర హాస్టల్, మహబూబ్‌నగర్ జిల్లా కోయల్‌కొండలోని బీసీ బాలుర వసతి గృహం, నల్లగొండ జిల్లా తిప్పర్తి ఎస్సీ బాలికల వసతి గృహం, మంచిర్యాల జిల్లా వెమ్మనపల్లిలోని ఎస్టీ బాలుర హాస్టల్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇప్పలపల్లిలోని ఎస్సీ బాలుర హాస్టల్, జనగామలోని ఎస్సీ బాలికల హాస్టల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కారేపల్లి మండలంలోని ఎస్టీ బాలుర హాస్టల్, సిద్దిపేటలోని బీసీ బాలుర వసతిగృహం, నిజామాబాద్ కొత్త గల్లీలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో తనిఖీలు జరిగాయి.

మెనూకు చెల్లు చీటీ..

ఖమ్మం జిల్లాలోని కారేపల్లి మండలం గాంధీనగర్ గిరిజన జూనియర్ కళాశాల, గురుకుల విద్యాలయం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదులు, వంటశాలలు అపరిశుభ్రంగా ఉన్నాయి. మెనూ కూడా పాటించడం లేదు. మంగళవారం ఇద్దరు ఉపాధ్యాయులు విధులకు హాజరుకాలేదు.

నాణ్యత లేని భోజనం..

నల్లగొండ జిల్లా తిప్పర్తి ఎస్సీ బాలికల హాస్టల్ మొత్తం అపరిశుభ్ర వాతావరణంలోనే ఉంది. మరుగుదొడ్లే కాదు.. వంటగది పరిస్థితీ దారుణంగా ఉంది. నాణ్యత లేని టిఫిన్, భోజనం పెడుతున్నారు. తాగునీరు కూడా బాగా లేదు. వసతి గృహంలో 52 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా 23 మందే ఉన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదు.

ఖర్చుల వివరాల్లేవు..

సిద్దిపేట పట్టణంలోని బీసీ విద్యార్థుల వసతి గృహంలో రిజిస్టర్ల నిర్వహణ సరిగా లేదు. విద్యార్థుల హాజరుకు సంబంధించిన పూర్తి వివరాలు లేవు. విద్యార్థులు గైర్హాజరు అయితే కేవలం చుక్క మాత్రమే పెడుతున్నారు. జూన్, జూలై నెలలకు సంబంధించిన ఖర్చు, తదితర వివరాలను రికార్డుల్లో పొందుపరచలేదు.

రేకుల షెడ్డులో కిచెన్..

సిరిసిల్ల మున్సిపల్ పరిధి ఇప్పలపల్లి గ్రామ శివారులో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులం కిచెన్ తాత్కాలిక రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. విద్యాలయం పరిసరాలు పరిశుభ్రంగా లేవు. మౌలిక సదుపాయాల లోపం కూడా ఉంది.



హైదరాబాద్ జాంబాగ్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో గడ్డకట్టిన చక్కెర, గడువు ముగిసిన ధనియాల పొడి



గురుకుల పాఠశాలలో డీఎస్పీ ఉదయ రెడ్డి ఆధ్వర్యంలో ఏసీబీ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

ఆహార పదార్థాలు సీజ్ ..: నిజామాబాద్ కోటగల్లీ ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు పెట్టే భోజనం సక్రమంగా లేదు. మంగళవారం తనిఖీల సందర్భంగా నాణ్యత లోపించిన ఆహార పదార్థాలను సీజ్ చేసి, ల్యాబ్‌కు తరలించారు. మూత్రశాలల నిర్వహణ సరిగా లేదు.

కోడిగుడ్లు, అరటిపండ్లకు ఎగనామం

జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ఎస్సీ బాలికల ప్రీ, పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలో తనిఖీల సమయంలో వార్డెన్ కవిత విధుల్లో లేరు. వసతి గృహంలో రికార్డుల పరంగా 110 మంది విద్యార్థులుంటే 73 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. తనిఖీల సమయంలో 60 మంది మాత్రమే ఉన్నారు. మెనూ ప్రకారం కోడిగుడ్లు, అరటిపండ్లు ఇవ్వడం లేదు. భోజనంలో నాణ్యత లోపించింది. టాయిలెట్లు, మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. విద్యార్థుల హెల్త్ చెకప్‌కు సంబంధించిన ప్రొఫైల్ కార్డులు నిర్వహించడం లేదు.



మంచిర్యాల జిల్లా వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల రిజిస్టర్‌లోని విద్యార్థులు, తరగతి గదుల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. మొత్తం 270 మంది విద్యార్థుల పేర్లు రిజిస్టర్‌లో ఉండగా 130 మంది మాత్రమే తరగతులకు హాజరైనట్లు నమోదు చేశారు. కానీ తరగతి గదుల్లో 130 మంది విద్యార్థులు లేరు. స్నానాల గదులు, మరుగు దొడ్లు అధ్వానంగా ఉన్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ బీసీ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు పెడుతున్న అల్పాహారం, భోజనంలో నాణ్యత లేదు. కిరాణ సామగ్రి, కూరగాయలు, రాగులు, కంది పప్పు పూర్తిగా నాసిరకంగా ఉన్నాయి. బియ్యం పురుగులు పట్టి ఉన్నాయి. విద్యార్థులకు అందజేయాల్సిన యూనిఫామ్, ఆట వస్తువులను ఇంతవరకు బయటకు తీయలేదు. రికార్డుల నమోదు సరిగా లేదు. వార్డెన్ అందుబాటులో లేరు. ఆయన ఫోన్ కూడా పనిచేయడం లేదు.



గాంధీనగర్ కళాశాల, పాఠశాలలో కూరగాయల నాణ్యతపై ఆరా తీస్తున్న ఏసీబీ డీఎస్పీ రమేశ్

త్వరలో ప్రభుత్వానికి వేర్వేరు నివేదికలు!

అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన మరికొన్ని కీలక అంశాలు పరిశీలిస్తే..విద్యార్థుల గదులకు సరైన గాలి, వెలుతురు రావడం లేదు. బాలికల హాస్టళ్లలో బాత్‌రూంల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంది. మొత్తం 18 రకాల రికార్డులు అధికారులు నిర్వహించాల్సి ఉంటుంది. అయినా ఏ ఒక్కటీ సరిగా పాటించడం లేదు. వార్డెన్లు హాస్టళ్లలోనే ఉండాలి. కానీ వారానికి ఒకరోజు లేదంటే నెలకు ఒకరోజు వచ్చిపోతున్నారు. రిజిస్టర్లలో రాసిన దానికి, అందుబాటులోని సరుకుల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. ఎక్కువ హాస్టళ్లలో కాలం చెల్లిన ఆహారపదార్థాలను వాడుతున్నారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, హాస్టళ్ల సిబ్బందిపై తీసుకోవాల్సిన చర్యలు, హాస్టళ్లను మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వేర్వేరుగా త్వరలో ప్రభుత్వానికి నివేదికలు సమర్పించనున్నట్టు ఏసీబీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

5,000 కోట్లతో గురుకులాల అభివృద్ధి

- మృతుల కుటుంబాలకు ఉద్యోగం, ఆర్థిక సాయం
- విద్యార్థుల మృతితో తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు
- పెద్దాపూర్ గురుకులాన్ని సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి భట్టి. చిత్రంలో జీవన్‌రెడ్డి

మెట్‌పల్లి/మెట్‌పల్లి రూరల్: అన్ని గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. జగిత్యాలజిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో ఇటీవల ఇద్దరు విద్యార్థులు గుణాదిత్య, అనిరుధ్ మృతి చెందిన విషయం తెలిసిందే. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆ గురుకులాన్ని సందర్శించారు. ముందుగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇద్దరు చిన్నారుల మృతి సంఘటన ప్రభుత్వాన్ని ఎంతో కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. ఎవరూ ఆందోళన చెందొద్దని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2015–16 ఆర్థిక సంవత్సరంలో గురుకులాల సొంత భవనాల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.197కోట్లు కేటాయించిన బీఆర్‌ఎస్.. ఆ తర్వాత ఏటా తగ్గిస్తూ వస్తూ గతేడాది కేవలం రూ.3కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించిందని, వీటిని ఈ సంవత్సరంలోనే ఖర్చు చేయాలని నిర్ణయించిందని చెప్పారు.

నెలకొసారి సందర్శన..

గురుకులాల్లో పరిస్థితులను మెరుగుపర్చడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు నెలకోసారి సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఆదేశించినట్టు డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. నాణ్యమైన భోజనం అందించేందుకు పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచడానికి అధికారులతో కమిటీ వేస్తామని చెప్పారు. ప్రతి గురుకులంలో అత్యవసర మందులు, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సహాయంతోపాటు ఒకరికి గురుకులాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. ఇల్లు లేకుంటే ఇందిరమ్మ పథకం కింద రూ.5లక్షలు అందిస్తామన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం.. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర పనులకు రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో కోరుట్ల, చొప్పదండి, జగిత్యాల, మానకొండూర్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, మేడిపల్లి సత్యం, సంజయ్, కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థి తల్లికి పూనకం

'గురుకులంలో మల్లన్నగుడి నిర్మించాలి. అలా అయితేనే శాంతిస్తానంటూ' ఓ విద్యార్థి తల్లి పూనకంతో ఊగిపోయింది. గురుకులంలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి కౌశిక్ తల్లి కృష్ణవేణికి పూనకం వచ్చి పొర్లుదండాలు పెట్టింది. అక్కడున్న పలువురు ఆమెను ప్రశ్నించడంతో తాను శాంతించాలంటే తన మల్లన్న ఆలయాన్ని నిర్మించి నిత్య పూజలు చేయాలని సమాధానమిచ్చింది. ఆ సమయంలో డిప్యూటీ సీఎం భట్టి పక్కనుంచి వెళుతుండగానే ఈ ఘటన చోటుచేసుకుంది.



ఐటీఐలు, గురుకులాల్లో సౌకర్యాలు కల్పించాలి

- పారిశుధ్య నిర్వహణ, టాయిలెట్స్, అవసరమైన సిబ్బంది లేక విద్యార్థుల అవస్థలు
- ఇన్ని సమస్యల మధ్య విద్యార్థులు చదువుపై ఎలా దృష్టి సారిస్తారు : మాజీమంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఐటీఐ కాలేజీలు, గురుకులాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన గురుకులాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో దిగజారుతుండటం శోచనీయమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణ, టాయిలెట్స్, అవసరమైన సిబ్బంది లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నా, ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దుర్మార్గమని వెల్లడించారు. కొన్నిచోట్ల ఐటీఐ తరగతి గదుల్లో వాననీరు రావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గురుకులాల ప్రాంగణాలు దోమలు, ఈగలతో మురికికూపాలుగా మారాయని, కలుషిత ఆహారంతో విద్యార్థులకు అస్వస్థత, పాముకాటుకు విద్యార్థి మృతి, డెంగీ జ్వరంతో విద్యార్థి మరణం వంటి వార్తలు రాష్ట్రంలో నిత్యకృత్యం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, ఇస్తున్న ఆహారం కూడా నాణ్యత లేదని, కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులు కారం మెతుకులతో కడుపు నింపుకుంటున్నారన్నారు. వాటర్‌ట్యాంకులు పాకురు పట్టాయని, ఆ నీళ్లతో స్నానాలు చేస్తున్న విద్యార్థులు చర్మవ్యాధుల బారిన పడుతున్నారన్నారు. గురుకులాల్లో చదివితే విద్యార్థుల భవిష్యత్ బంగారుమయం అవుతుందని తల్లిదండ్రులు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఐటీఐలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

సెప్టెంబరు రెండోవారంలోగా ట్రిపుల్ ఆర్ భూసేకరణ పూర్తి చేయాలి

కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సెప్టెంబరు రెండోవారంలోగా హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) భూసేకరణ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈమేరకు ఆమె స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాజెక్టుకు భూములిస్తున్న వారికి న్యాయమైన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేసి, భూముల మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోర్టు కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ , అటవీశాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి, రోడ్లు భవనాలశాఖ ప్రత్యేకకార్యదర్శి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీశ్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'మా వాటా మాకే'లో బహుజనుల ముఖచిత్రం

జూలూరి 'మా వాటా మాకే' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో జాజుల, చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య, బండా ప్రకాశ్, జూలూరి, మారుతి సాగర్, జస్టిస్ చంద్రకుమార్, ప్రొ.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట(హైదరాబాద్): 'మా వాటా మాకే' పుస్తకంలో బహుజనుల ముఖచిత్రం చిత్రీకరించారని, రాబోయే రోజుల్లో బీసీ ఉద్యమానికి ఈ పుస్తకం నాంది అని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు జూలూరి గౌరీశంకర్ రచించిన 'మా వాటా మాకే' పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులు జస్టిస్ ఈశ్వరయ్య, జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ బీసీల పట్ల వివక్ష కొనసాగుతున్న ఇలాంటి సమయంలో ఈ పుస్తకం రావడం హర్షణీయమన్నారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బీసీలలో జాగృతి నింపేందుకు, వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని చెప్పారు. పదవులు ఉన్నప్పుడు వాటిని అనుభవించడం, అవి పోయాక కుల సంఘాలు, బీసీ సంఘాల పేరుతో ప్రజల్లోకి వస్తున్నారని, నిజంగా బీసీలకు ఏదైనా చేయాలని ఉంటే రాజకీయాలు పక్కనపెట్టి బీసీల కోసమే పోరాడాలని జస్టిస్ చంద్రకుమార్ సూచించారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కుల జనగణన చేయకపోతే సెప్టెంబర్ మొదటి వారంలో లక్షలాది మందితో కుల గణన మార్చ్ ర్యాలీ నిర్వహిస్తామని, అప్పటికీ స్పందించకపోతే రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు వంతులవారీగా బహుజనులను ఓట్లు వేయడానికి వాడుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ పాత్రికేయుడు మారుతీ సాగర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. కాగా, రాష్ట్రంలోని 400కుపైగా కేంద్రాల్లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు, ఇది తెలంగాణలో పెరుగుతున్న బీసీ చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తుందని రచయిత జూలూరి గౌరీశంకర్ కార్యక్రమం అనంతరం ఒక ప్రకటనలో తెలిపారు.

చెరువులు కబ్జా చేస్తే కఠిన చర్యలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక



ఉప్పల్ నల్ల చెరువు ఆక్రమణను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ నేతలు, అధికారులు

సాక్షి ఎఫెక్ట్

ఉప్పల్ (హైదరాబాద్): చెరువుల ఆక్రమణపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేపడతామని హైదరాబాద్ విపత్తుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (హైడ్రా) కమిషనర్ రంగనాథ్ చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో అన్ని విభాగాల అధికారులు, స్థానికులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నిజ నిర్ధారణ చేస్తామన్నారు. 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన 'చెరువుల చోరీ' కథనానికి స్పందించిన కమిషనర్ వెంటనే జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, తహసీల్దార్‌లతో కలిసి ఉప్పల్ నల్ల చెరువును పరిశీలించారు. చెరువులో వెలసిన నిర్మాణాలు, నాలాల కనుమరుగు తదితర అంశాలపై ఇరిగేషన్ అధికారులను ఆరా తీశారు. నాలాలను చూపించలేక ఇరిగేషన్ అధికారులు నీళ్లు నమిలారు. 2000 సంవత్సరం నాటి గూగుల్ మ్యాప్‌ను చూస్తూ ఆ సమయంలో ఉన్న చెరువు అవుట్‌లెట్ నాలాలు ఇప్పుడు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న, ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత, స్థానిక కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉప్పల్ నల్ల చెరువు ఎలా కబ్జాకు గురైందో వివరించారు.

హత్తిగూడ చెరువుపై త్వరలోనే కమిటీ

ఎల్బీనగర్/మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని హత్తిగూడ చెరువుపై త్వరలోనే కమిటీని వేసి చెరువు విస్తీర్ణం, హద్దులు నిర్ణయిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వరద కాలువను పూడ్చటానికి ప్రయత్నిస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. హత్తిగూడ చెరువు, వరదనాలాలు కబ్జాకు గురవుతున్నాయంటూ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కబ్జాదారులపై కేసులు నమోదు చేసి చర్యలు చేపడతామని చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 14-8-2024

సేవాపథం

మనిషికి మనిషిని జతకలిపే దర్జీలు



హరిత కర్మ సేన సభ్యులు

వారధి నిర్మాణ పనుల్లో ‘నేనెంత’ అనుకోలేదు ఉడుత. ‘నేను కూడా కొంత’ అనుకొని పనుల్లోకి దిగింది. వయనాడ్ సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్న బాధితులకు అండగా నిలవడానికి, తమ వంతు సహాయం అందించడానికి స్థాయి భేదాలు లేకుండా ఎంతోమంది మహిళలు వస్తున్నారు. శిబిరంలోని మహిళలకు బట్టలు కుట్టి ఇవ్వడం నుంచి పరిసరాల శుభ్రత వరకు దీక్షతో పనిచేస్తున్నారు...

శ్రుతికి చారమాలలో చాలా మంది బంధువులు ఉన్నారు. కొండచరియలు విరిగిపడిన సంఘటనలో కొందరు చనిపోయారు. మరికొందరు మెప్పడిలోని సహాయ శిబిరంలో ఉన్నారు. కొంతమంది మహిళలు స్నానం చేయడానికి శ్రుతి ఇంటికి వచ్చినప్పుడు తమకు ఇచ్చిన దుస్తులకు సంబంధించిన సమస్యల గురించి చెప్పుకున్నారు. ఆల్ట్రేషన్‌కు అవకాశం లేకపోవడంతో తమకు సరిపోయే ఒకే జత దుస్తులనే వాడాల్సి వస్తోంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని స్నేహితురాలి దగ్గర కుట్టుమిషన్ తీసుకొని నిర్వాసిత కుటుంబాల సహాయ శిబిరానికి బయలుదేరింది శ్రుతి.

ప్రతి గదికి వెళ్లి ‘నేను రెండు రోజులు ఇక్కడే ఉంటాను. దుస్తుల సైజ్ సర్దుబాటు సమస్యలు ఉంటే నాకు చెప్పండి’ అని అడిగింది. ఇక ఆరోజు నుంచి చిరిగిపోయిన దుస్తులు, సైజు సరిగా లేని దుస్తులను సరి చేసే పని మొదలైంది.

టైలరింగ్ వల్ల జరిగిన మరో మేలు ఏమిటంటే మనసును దారి మళ్లించడం. ఈ శిబిరంలో కొద్దిమంది టైలరింగ్ పని తెలిసిన వారు కూడా ఉన్నారు. అలాంటి వారిలో రమ్య మనోజ్ ఒకరు.

‘భయపెట్టే జ్ఞాపకాల నుంచి బయటపడడానికి టైలరింగ్ అనేది చికిత్సామార్గంలా ఉపయోగపడింది. చాలా రోజులుగా మేము శిబిరంలో ఖాళీగా ఉన్నాం. ప్రతిరోజూ విషాద జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూనే ఉండేవి. మెషిన్‌పై ఆల్ట్రేషన్ పనులు మొదలు పెట్టిన తరువాత నాకు ఎంతో ఉపశమనం లభించింది’ అంటుంది రమ్య మనోజ్.

శ్రుతి, రమ్య... మొదలైన వారిని దృష్టిలో పెట్టుకొని సహాయ శిబిరానికి కుట్టుమిషన్‌లను ఒక స్వచ్ఛంద సంస్థ విరాళంగా ఇవ్వనుంది.

‘మొదటిసారి ఇక్కడికి వచ్చినప్పుడు రెండు రోజులు ఉండాలనుకున్నాను. ఇప్పుడు మాత్రం శిబిరం ఉన్నంతవరకు రోజూ వచ్చి పోవాలనుకుంటున్నాను’ అంటుంది శ్రుతి.

సహాయ శిబిరానికి శ్రుతి రోజూ రావాలనుకోవడానికి కారణం కేవలం టైలరింగ్ పనులు కాదు. ఇప్పుడు అక్కడ ఆమె ఎంతో మంది బాధితులకు ఓదార్పునిస్తోంది. బాధితులు విషాద జ్ఞాపకాల నుంచి బయటపడడానికి సినిమాల నుంచి ఆటల వరకు ఎన్నో విషయాలు మాట్లాడుతుంటుంది.

‘శిబిరానికి శ్రుతి రావడానికి ముందు మా మాటల్లో బాధలు, కష్టాలు, చేదు జ్ఞాపకాలు మాత్రమే ఉండేవి. అయితే శ్రుతి మమ్మల్ని అటువైపు వెళ్లనివ్వకుండా రకరకాల విషయాలు మాట్లాడుతుంటుంది. ధైర్యం చెబుతుంటుంది’ అంటుంది సహాయ శిబిరంలో తలదాచుకుంటున్న ఆశ.

హరిత కర్మ సేన ఆల్ ఉమెన్ గ్రూప్

పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న వారిలో కొందరు జ్వరం, దగ్గులాంటి సమస్యలతో బాధ పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పునరావాస శిబిరం పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత ఆనవాలు లేకుండా చేస్తున్నారు. పునరావాస శిబిరాలుగా మారిన పాఠశాలలు శుభ్రంగా కనిపించడానికి కారణం హరిత కర్మ సేన–ఆల్ ఉమెన్ గ్రూప్. భోజనాల తరువాత టేబుళ్లు, నేలను శానిటైజ్ చేస్తున్నారు. క్రిములు పెరగకుండా, వ్యాధులు వ్యాప్తి చెందకుండా, సహాయ శిబిరం చుట్టుపక్కల ప్లాస్టిక్, ఆహార వ్యర్థాలు కనిపించకుండా చూస్తున్నారు. కేరళలో మొత్తం 1018 హరిత కర్మ సేన యూనిట్‌లు పని చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 4,678, గ్రామీణ ప్రాంతాల్లో 26, 546 మంది మహిళలు పనిచేస్తున్నారు. ‘వేస్ట్ ఫ్రీ కేరళ’ నినాదాన్ని భుజాల కెత్తుకున్న హరిత కర్మ సేన కలెక్టింగ్, ట్రాన్స్‌పోర్టింగ్, ప్రాసెసింగ్, రీసైకిలింగ్, వేస్ట్ మెటీరియల్స్ డిస్పోజల్ అండ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి వివిధ సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ‘సమాజానికి ఉపయోగపడే మంచి పని చేస్తున్నాను అనే భావన మనసులో ఉండడం వల్ల కావచ్చు ఎంత పని చేసినా శ్రమగా అనిపించదు’ అంటుంది హరిత కర్మ సేన సభ్యురాలు ఉద్విత.

బ్యూటిప్స్



- రెండు స్పూన్ల కీరా రసంలో స్పూన్ రోజ్‌వాటర్, స్పూన్ నిమ్మరసం వేసి బాగా కలపాలి. రాత్రి పడుకోబోయేముందు ఈ మిశ్రమాన్ని వేళ్లతో అద్దుకొని ముఖానికి రాసుకోవాలి. మరునటి రోజు ఉదయాన్నే శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల జిడ్డు తగ్గి, ముఖం తాజాగా కనిపిస్తుంది.
- రెండు టీ స్పూన్ల క్యాబేజీ రసంలో టీ స్పూన్ తేనె కలిపి, ముఖానికి రాయాలి. ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఇలా చేస్తే ముఖంపై మొటిమలు, ముడతలు తగ్గుతాయి.



క్యాన్సర్ కాటుకు వర్కవుట్ ఫిట్ ఫర్ టాట్

హీనా ఖాన్

ప్రముఖ నటి. హిందీ టీవీరంగంలో అత్యధిక పారితోషికం తీసుకునే నటి. కెరీర్ కాంతి పుంజంలా వెలుగుతున్న కాలంలో అనారోగ్యం ఆమె మీద దాడి చేసింది. ఆమె తాను బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు గుర్తించేటప్పటికే మూడవ దశకు చేరినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. అయితే క్యాన్సర్ బారిన పడినందుకు ఏ మాత్రం కుంగిపోవడంలేదు. కీమోథెరపీ చేయించుకుంటూ తన ఆరోగ్యంతోపాటు ఫిట్‌నెస్ మెయింటెయిన్ చేసుకోవడానికి క్రమం తప్పకుండా జిమ్‌కెళ్తోంది. వివరాల్లోకి వెళితే...

కాళ్లు మొద్దుబారుతున్నాయి

కీమోథెరపీ బాధలు, న్యూరోపతిక్ పెయిన్‌ను భరిస్తూ కూడా హెల్దీ లైఫ్ స్టయిల్‌ను అనుసరిస్తోంది. ‘కీమోథెరపీ దేహాన్ని పిండేస్తుంది. వర్కవుట్స్ చేసేటప్పుడు కాళ్లు పట్టుతప్పుతున్నాయి, ఒక్కసారిగా పడిపోతున్నాను’ అని ఒక పోస్ట్ చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయడం లేదామె. మెంటల్, ఫిజికల్ వెల్‌నెస్ కోసం నొప్పుల బాధలను పళ్లబిగువున భరిస్తూ వ్యాయామం చేస్తోంది. ‘అనారోగ్యంతో కుంగిపోయిన వ్యక్తిలా అభివర్ణించుకోవడం నాకిష్టం లేదు. పడినప్పటికీ తిరిగి లేచి నిలబడాలి. వర్కవుట్ చేసే ప్రతిసారీ ‘గెట్టింగ్ బ్యాక్ అప్... అని నాకు నేను చెప్పుకుంటాను. అలా చెప్పుకోకపోతే మానసిక శక్తి రాదు. మానసిక శక్తి లోపిస్తే వ్యాయామం చేయడానికి దేహం సహకరించదు’ అని తన ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్‌తో పంచుకుంది. ఈ నేపథ్యంలో ఆమె రకరకాల వీడియోలను కూడా పోస్ట్ చేసింది. ఒక వీడియోలో జుత్తును తల నుంచి చివరి వరకు నిమిరి అరచేతిలోకి వచ్చిన జుత్తును చూపించింది. గుండు గీసుకుంటూ ఒక వీడియో పోస్ట్ చేసింది. మరొక వీడియోలో వర్షంలో గొడుగు వేసుకుని, ప్రొటీన్ షేక్ ఉన్న ఫ్లాస్క్ పట్టుకుని జిమ్ ఆవరణలో ప్రవేశించింది. గొడుగు మూస్తూ హాయ్ అని పలకరించి విక్టరీ సింబల్ చూపించి జిమ్ గదిలోకి వెళ్లడంతో వీడియో పూర్తయింది. ‘స్టే స్ట్రాంగ్’ అంటూ ఆమె ఫ్లయింగ్ కిస్ విసిరి వీక్షకులకు మనోధైర్యాన్నిచ్చింది.



ఫిట్‌నెస్ చాలెంజ్

అమెరికాలోని స్లోన్ కెట్టెరింగ్ క్యాన్సర్ సెంటర్ సూచనల మేరకు...

తేలికపాటి వ్యాయామాలు... రిలాక్స్‌డ్ బైకింగ్ (గంటకు ఐదు మైళ్ల కంటే తక్కువ వేగంతో సాఫీగా ఉన్న నేల మీద సైక్లింగ్), స్లో వాకింగ్ (చదునుగా ఉన్న నేల మీద గంటకు మూడు మైళ్లకంటే తక్కువ వేగంతో నడవడం). చిన్న చిన్న ఇంటిపనులు, తాయ్ చాయ్ (దేహాన్ని నిదానంగా కదిలిస్తూ దీర్ఘంగా శ్వాస తీసుకోవడం), ఫ్లైయింగ్ క్యాచ్ (బాల్‌ను లేదా ఫ్రిస్‌బీ ప్లేట్‌ను గురి చూసి విసరడం)

తీవ్రమైన వ్యాయామాలు... బైకింగ్... (గంటకు పది మైళ్లకు మించకుండా సైక్లింగ్), బ్రిస్క్ వాక్ (గంటకు మూడు నుంచి నాలుగున్నర మైళ్ల వేగం), ఇంటి పనుల్లో బరువైనవి కూడా, యోగసాధన, టెన్నిస్ వంటి ఆటలు.

- అమెరికన్ కాలేజ్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్, అమెరికన్ క్యాన్సర్ సొసైటీలు... క్యాన్సర్ పేషెంట్‌లు వారానికి 150 నుంచి 300 నిమిషాలపాటు వ్యాయామం చేయాలని, రోజుకు అరగంట చొప్పున వారానికి ఐదు రోజుల వర్కవుట్ షెడ్యూల్ ఉండాలని చెప్తున్నాయి.


మీ ఆదరణకు కృతజ్ఞతలు

సోషల్ మీడియాలో ఫాలోవర్స్ నుంచి అందుతున్న ఆదరణకు ఎప్పటికప్పుడు ప్రతిస్పందిస్తూ ‘మీ అభిమానానికి, ప్రేమకు కృతజ్ఞతతో ఉంటాను. ఈ చాలెంజ్‌లో నేను గెలుస్తాను’ అన్నది. కష్టం వచ్చినప్పుడు ధైర్యాన్ని కోల్పోకూడదు. అనారోగ్యం వస్తే డీలా పడిపోకూడదు. పోరాడి గెలవాలి అనే సందేశం ఇస్తున్న ఆమె వీడియోలు పలువురికి స్ఫూర్తినిస్తున్నాయి. వైద్యం ఎంతగా అభివృద్ధి చెందిందో వివరిస్తూ, క్యాన్సర్‌కు చికిత్స చేయించుకున్న తర్వాత సాధారణ వ్యక్తుల్లాగే క్వాలిటీ లైఫ్‌ను లీడ్ చేయడం మన చేతుల్లోనే ఉందని సమాజానికి ధైర్యం చెబుతున్న వారిలో హీనాఖాన్ ఒకరు.

ప్రతిఘటన

అర్ధరాత్రి స్వతంత్ర పోరాటం





క్యాండిల్స్‌తో డాక్టర్ల నిరసన

‘నైట్ ఈజ్ అవర్స్’ పేరుతో ఆగస్టు 14 అర్ధరాత్రి కోల్‌కతాలో మహిళలు పెద్ద ఎత్తున నిరసన తెలుపనున్నారు. అర్ధరాత్రి స్వతంత్రం వచ్చింది కాని అర్ధరాత్రి సురక్షితంగా జీవించే హక్కు స్త్రీలకు రాకపోవడంపై ఈ నిరసన. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్య జరిగిన నేపథ్యంలో రాత్రిని చూసి భయపడుతూ బతకవలసిందేనా అని నిలదీస్తున్నారు స్త్రీలు. ఈ నిరసన, గతంలో ఇలాంటి ప్రతిఘటనలపై కథనం.

‘ఏ రోజైతే అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా రోడ్డు మీద నడవగలదో ఆ రోజు ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు’ అన్నారు గాంధీజీ. ఆయన కలలుగన్న స్వాతంత్ర్యం ఇంకా ఒడిదుడుకుల్లోనే ఉంది. డిసెంబర్ 16, 2012లో ఢిల్లీలో అర్ధరాత్రి ఒక నిర్భయ దారుణంగా లైంగికదాడికి లోనై మరణిస్తే మొన్న గురువారం (ఆగస్టు 8) అర్ధరాత్రి కోల్‌కతాలోని ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో ఒక ట్రయినీ డాక్టర్ దారుణంగా అత్యాచారానికీ హత్యకూ లోనైంది. దీంతో దేశవ్యాప్తంగా వైద్యబృందాలు భగ్గుమన్నాయి. నిరసనలు సాగుతున్నాయి. వైద్యులు వైద్యసేవలు మాని ఈ అన్యాయానికి జవాబేమిటని ప్రశ్నిస్తున్నారు. తక్షణ న్యాయం కోసం డిమాండ్ చేస్తున్నారు.

అర్ధరాత్రి నిరసన

‘ఆగస్టు 14 అర్ధరాత్రి మనకు స్వాతంత్ర్యం వచ్చింది. కాని స్త్రీలకు తమ ఇంట్లో, పని చోట, బహిరంగ ప్రదేశాల్లో రాత్రుళ్లు ఎటువంటి స్వేచ్ఛ లేని బానిసత్వమే మిగిలింది. కోల్‌కతాలో జరిగిన దారుణకాండకు నిరసనగా ఈ ఆగస్టు 14 అర్ధరాత్రి మహిళలందరం నిరసన చేయనున్నాం’ అని కోల్‌కతాలోని మహిళలు తెలియచేస్తున్నారు. ఈ నిరసకు స్త్రీలు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. మనదేశంలో సూర్యుడు అస్తమించగానే స్త్రీలలో, వారి కుటుంబ సభ్యుల్లో ఆ స్త్రీలు ఇంటికి చేరే వరకు ఆందోళన ఉంటుంది. వారి మీద ఏదోవిధమైన దాడి జరిగే వాతావరణం ఉండటమే ఇందుకు కారణం. ఒంటరి స్త్రీ బహిరంగ ప్రదేశాలలో కనిపిస్తే ఆమెతో ఎలాగైనా వ్యవహరించవచ్చనే తెగింపు కొన్ని మూకలలో ఈ సమాజంలో ఉంది. స్త్రీలకు పరిమిత సమయాలలో పరిమిత స్థలాలలోనే రక్షణ. లేదంటే లేదు. అయితే నిర్భయ ఘటన ఆమె రోడ్డు మీద ఉన్నప్పుడు జరిగితే కోల్‌కతాలో బాధితురాలు ఆస్పత్రిలో తన డ్యూటీలో ఉండగా దాడి జరగడం తీవ్రమైన ప్రశ్నను లేవదీసేలా ఉంది.

మీట్ టు స్లీప్

నిర్భయ ఘటన జరిగాక ఆమెను తలుచుకుంటూ ప్రతి డిసెంబర్ 16న పార్కుల్లో మహిళలు బృందాలుగా నిదురించే కార్యక్రమం ‘మీట్ టు స్లీప్’ నిర్వహించాలని బెంగళూరుకు చెందిన ‘బ్లాక్ నాయిస్’ అనే సంస్థ పిలుపునిస్తే దేశంలోని అన్ని మెట్రో నగరాలలో ఆ కార్యక్రమం కొనసాగుతోంది. ‘పబ్లిక్ ప్లేసులపై మా హక్కు కూడా ఉంది. మేము అక్కడ సురక్షితంగా ఉంచే పరిస్థితిని డిమాండ్ చేస్తున్నాం’ అని ఈ కార్యక్రమం కోరుతోంది. బ్లాక్ నాయిస్ ఫౌండర్ జాస్మిన్ పతేజా దీని రూపకర్త.

విమెన్ వాక్ ఎట్ మిడ్‌నైట్:

ఢిల్లీ రోడ్ల మీద అర్ధరాత్రి స్వేచ్ఛగా నడిచే హక్కు స్త్రీలకు ఉంది అని ‘విమెన్ వాక్ ఎట్ మిడ్‌నైట్’ పేరుతో అక్కడి మహిళా బృందాలు రాత్రుళ్లు నడిచి తమ గళాన్ని వినిపించాయి. మల్లికా తనేజా అనే థియేటర్ ఆర్టిస్ట్ ఇందుకు పిలుపునిచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ‘రాత్రిపూట ఖాళీ ఫుట్‌పాత్ మీద స్వేచ్ఛగా కూచునే అనుభూతి ఇప్పుడు పొందాను’ అని ఈ అర్ధరాత్రి నడకలో పాల్గొన్న ఒక మహిళ అంది.

సమాజంలో స్త్రీకి గౌరవం దక్కాలన్నా ఆమె సురక్షితంగా ఉండాలన్నా ఇంటిలో బడిలో పని చోట్ల ప్రభుత్వ విధానాలలో సినిమాలలో కళల్లో ఆమెను గౌరవించే వాతావరణం, బౌద్ధిక శిక్షణ అవసరం. కఠినమైన చట్టాలతో పాటు విలువల ఔన్నత్యం కూడా అవసరం. స్త్రీలను కించపరిచే భావజాలం ఎక్కడ ఉన్నా దానిని నిరసించడం అందరూ నేర్వాలి. లేని పక్షంలో అర్ధరాత్రి నిరసనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతూనే ఉంటాయి.

యోగం



విల్లులా వంచుదాం

వెన్నెముక కండరాలను బలోపేతం చేయడంలోనూ, శరీర సమతుల్యతను మెరుగుపరచడంలోనూ .. ఎన్నో ప్రయోజనాలను అర్ధచక్రాసన ద్వారా పొందవచ్చు.

ఈ ఆసనం విల్లు భంగిమను పోలిఉంటుంది. అర్ధ చక్రం (హాఫ్ వీల్ ఆసన) అంటే సగం చక్రం అన్నమాట.

చురుకైన కండరాలు

దీనిని సాధన చేయడానికి మ్యాట్ పైన నిటారుగా నిల్చోవాలి. చేతులను, తలను భుజాల నుంచి వెనక్కి తీసుకుంటూ నడుమును వంచాలి. దీని వల్ల వెన్ను భాగం సాగుతుంది. ఎంత వీలైతే అంతగా నడుము భాగాన్ని ముందుకు, తల భాగాన్ని వెనక్కి వంచుతూ కాళ్లను నిటారుగా ఉంచాలి. దీంతో కండరాలన్నీ పూర్తి చురుగ్గా అవుతాయి. వెనుకకు వంగేటప్పుడు దీర్ఘ శ్వాస పీల్చుకొని, నెమ్మదిగా వదలాలి. అదే విధంగా యథాస్థితికి చేరుకున్నప్పుడు దీర్ఘశ్వాస తీసుకుంటూ, వదలాలి.

మూడు నుంచి ఐదు సార్లు

సాధారణంగా శ్వాస తీసుకునేటప్పుడు సమతుల్యతను కోల్పోకుండా ఉండేలా చూసుకోవాలి. మూడు నుంచి ఐదు సార్లు ఈ భంగిమను తిరిగి చేయాలి. తర్వాత విశ్రాంతి తీసుకోవడానికి కొంత సమయం కేటాయించాలి. ఈ ఆసనం వల్ల వెన్నెముక నొప్పి తీవ్రత తగ్గుతుంది. కడుపుపై ఒత్తిడి పెరిగి, అదనపు కొవ్వు తగ్గిపోతుంది. ఊబకాయంపై ప్రభావవంతంగా పనిచేస్తుంది. హృదయ స్పందన రేటును సమర్థంగా నిర్వహిస్తుంది. ఫలితంగా గుండె పనితీరు మెరుగుపడుతుంది.



– జి.అనూషా రాకేష్, యోగా ట్రైనర్

లీగల్

రెండవ భార్యకు, పిల్లలకు ఆస్తి వస్తుందా?



భార్య లేదా భర్త బతికి ఉండగా, చట్టరీత్యా విడాకులు తీసుకోకుండా చేసుకున్న రెండవ పెళ్లి చెల్లదు. ప్రస్తుతం ఉన్న చట్టాలలో, (ముస్లింలకు, కొన్ని ప్రత్యేక మతాచారాలు వున్నవారికి తప్ప) అది నేరం కూడా. అందుకనే రెండవ భార్యకి భర్త ఆస్తిలో ఎటువంటి హక్కు ఉండదు. మొదటి భార్య సంతానానికి, రెండవ భార్య సంతానానికి మాత్రం ఆస్తిలో సమాన హక్కు ఉంటుంది. అయితే మొదటి భార్య చనిపోయిన తర్వాత లేదా విడాకులు తీసుకున్న తర్వాత రెండో పెళ్లి చేసుకుంటే, ఆ రెండవ భార్యకి కూడా మొదటి భార్య సంతానం – రెండవ భార్య సంతానంతో పాటు ఆస్తిలో సమాన హక్కు ఉంటుంది. ఉదాహరణకు: చనిపోయిన మొదటి భార్యకి భర్తకి కలిపి ఇద్దరు సంతానం ఉన్నారు. అలాగే రెండవ భార్యకి ఇద్దరు సంతానం ఉన్నారు. ఎటువంటి వీలునామా రాయకుండా చనిపోయిన భర్త స్వార్జితంలో – పూర్వీకుల ద్వారా సంక్రమించిన ఆస్తిలో 5 భాగాలు అవుతాయి. అందులో నాలుగు భాగాలు మొదటి – రెండవ భార్య సంతానానికి, ఒక భాగం రెండవ భార్యకి చెందుతుంది.

ప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ – పదోన్నతి తర్వాత సంక్రమించే సర్వీస్ బెనిఫిట్స్‌కి సంబంధించి మాత్రం చట్టం కొంత వేరుగా ఉంటుంది. సాధారణ పరిస్థితులలో, పైన తెలిపిన విధంగా చెల్లుబాటు కాని పెళ్లి చేసుకున్న రెండవ భార్యకి పెన్షన్, సర్వీస్ బెనిఫిట్స్ లో ఎటువంటి హక్కు ఉండదు. కానీ అన్నివేళలా అలా వుండదు. ఇటీవలే 2023లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఒక తీర్పులో మొదటి భార్య బతికి ఉన్నప్పటికీ, చట్టరీత్యా విడాకులు తీసుకోనప్పటికీ రెండవ భార్యకి కూడా పెన్షన్ – సర్వీస్ బెనిఫిట్స్‌లో సమాన హక్కు కల్పించింది. మొదటి భార్య నుంచి విడాకులు కావాలి అంటూ చనిపోయిన ప్రభుత్వ ఉద్యోగి డైవర్స్ కేసు ఫైల్ చేసి ఉండడం ఆ కేసులో గమనించదగ్గ అంశం. అంతేకాక ఫ్యామిలీ పెన్షన్ ఉద్దేశానికి, మెయింటెనెన్స్ చట్టం వెనుక ఉన్న ఉద్దేశానికి తేడా ఏమీ లేదు అని అంటూ, మొదటి భార్యకి, రెండవ భార్యకి పెన్షన్ సమానంగా రెండు భాగాలుగా పంచాలి అని కోర్టు తన తీర్పు వెలువరించింది. రైల్వే విభాగంలో మాత్రం, పెన్షన్ రూల్స్ లోని సెక్షన్ 75 ప్రకారం, మొదటి భార్యకి – రెండవ భార్యకి కూడా పెన్షన్‌లో సమాన హక్కు ఉంటుంది అని గతంలో పలు హైకోర్టులు పేర్కొన్నాయి. కొన్ని హక్కులు రెండవ భార్యకి వర్తిస్తాయా లేదా అన్నది కేసు పూర్వాపరాలను బట్టి, ఆయా కేసులోని ప్రత్యేక అంశాలపైనా ఆధారపడి ఉంటుంది.



– శ్రీకాంత్ చింతల, హైకోర్ట్ అడ్వకేట్



కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో యూకీ బాంబ్రీ

అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో భారత అగ్రశ్రేణి క్రీడాకారుడు యూకీ బాంబ్రీ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో యూకీ 48వ ర్యాంక్‌లో నిలిచాడు. ఈ ఏడాది మూడు గ్రాండ్‌స్లామ్ టోర్నీలతో కలిపి మొత్తం 22 టోర్నీల్లో పాల్గొన్న 32 ఏళ్ల యూకీ స్విస్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో, మ్యూనిక్ ఏటీపీ–250 టోర్నీలో అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్)తో కలిసి డబుల్స్ టైటిల్స్ సాధించాడు.

శ్రీలంక జట్టు బ్యాటింగ్ కోచ్‌గా ఇయాన్ బెల్



ఇంగ్లండ్ జట్టుతో జరిగే మూడు టెస్టుల సిరీస్‌లో పాల్గొనే శ్రీలంక జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా ఇయాన్ బెల్ వ్యవహరించనున్నాడు. ఇంగ్లండ్‌కు చెందిన ఇయాన్ బెల్ 118 టెస్టులు ఆడి 7727 పరుగులు సాధించాడు. ఈనెల 16 నుంచి శ్రీలంక జట్టుతో కలిసి బెల్ పనిచేస్తాడని శ్రీలంక క్రికెట్ సీఈఓ ఆష్లే డిసిల్వా తెలిపారు. ఇంగ్లండ్, శ్రీలంక మధ్య తొలి టెస్టు ఈనెల 21 నుంచి 25 వరకు మాంచెస్టర్‌లో జరుగుతుంది. ఆ తర్వాత రెండో టెస్టు లార్డ్స్‌లో ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు... చివరిదైన మూడో టెస్టు సెప్టెంబర్ 6 నుంచి 10 వరకు ఓవల్‌లో జరుగుతాయి.

మూడు రోజుల తర్వాత...

వినేశ్ కేసు మరోసారి వాయిదా



పారిస్: భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్ రజత పతకం కోసం చేస్తున్న న్యాయ పోరాటం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆమెకు పతకం ఇవ్వాలా వద్దా అనే అంశంపై మంగళవారం రావాల్సిన కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) తీర్పు మరోసారి వాయిదా పడింది. దీనిని మరో మూడు రోజులకు వాయిదా వేస్తున్నట్లు సీఏఎస్ ప్రకటించింది. దీని ప్రకారం ఈ నెల 16న భారత కాలమానం ప్రకారం రాత్రి 9.30 గంటలకు తీర్పు వస్తుంది. 50 కేజీల కేటగిరీలో 100 గ్రాములు ఎక్కువగా ఉండటంతో అనర్హతకు గురైన వినేశ్ తాను అనుమతించిన బరువుతోనే ఫైనల్ వరకు చేరాను కాబట్టి తనకు సంయుక్తంగా రజత పతకం అందించాలని సీఏఎస్‌ను ఆశ్రయించింది. మరోవైపు ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమం వరకు పారిస్ క్రీడా గ్రామంలోనే ఉన్న వినేశ్ అక్కడి నుంచి బయలుదేరి మంగళవారమే భారత్‌కు చేరుకుంది.

అంతా అబద్ధం

నాపై రూ. కోటిన్నర ఖర్చు చేయలేదు


- కేంద్ర క్రీడా శాఖ వ్యయ నివేదికపై షట్లర్ అశ్విని పొన్నప్ప అసంతృప్తి

న్యూఢిల్లీ: కేంద్ర క్రీడాశాఖ ఒలింపిక్స్ లక్ష్యంగా ఒక్కో క్రీడాకారుడిపై చేసిన ఖర్చుపై నివేదికను విడుదల చేస్తుంది. అయితే మహిళా డబుల్స్ స్టార్ షట్లర్ అశ్విని పొన్నప్పపై ఆ శాఖ విడుదల చేసిన వ్యయ నివేదికపై ఆమె మండిపడింది. అత్తెసరు, అరకొర సాయం తప్ప అవసరమైన వ్యక్తిగత కోచ్‌నే ఇవ్వలేదని... అలాంటపుడు ఏకంగా రూ. కోటిన్నర తనపై ఖర్చు చేసినట్లు ఎలా చెబుతారని కేంద్ర క్రీడా శాఖ నిర్వాకంపై అసంతృప్తి వెలిబుచ్చింది. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్) కింద రూ. 4.5 లక్షలు, అలాగే వార్షిక శిక్షణ, టోర్నీల్లో పాల్గొనడం (ఏసీటీసీ) కోసం రూ. 1 కోటి 48.04 లక్షలను అశ్వినిపై ఖర్చు చేసినట్లుగా 'సాయ్' వ్యయ నివేదికలో పేర్కొంది. దీనిపై స్పందించిన షట్లర్ 'ఇది చూసి నేనైతే తేరుకోలేనంత షాక్‌కు గురయ్యాను. నాకు ఆర్థిక సాయం అందలేదనే చింత లేదు కానీ అంత మొత్తం నాకు కేటాయించారనే తప్పుడు నివేదిక ఇవ్వడం ఏంటి. నిజంగా చెబుతున్నా. 'సాయ్'... క్రీడా శాఖ నివేదికలో వివరించినట్లుగా నేనెలాంటి నిధులు అందుకోలేదు. జాతీయ శిక్షణ విషయానికొస్తే... రూ. కోటిన్నర నిధుల్ని మొత్తం శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులపై ఖర్చు పెట్టారు. అంతేతప్ప నా ఒక్కరికే అంత మొత్తం ఇవ్వనేలేదు. ఇంకా చెప్పాలంటే నాకు వ్యక్తిగత కోచే లేడు. క్రీడా శాఖ నియమించనూ లేదు. నా వ్యక్తిగత ట్రెయినర్‌ను సొంతడబ్బులతో నేనే ఏర్పాటు చేసుకున్నా. ఇలా చెబుతున్నది నిజం తెలియాలనే తప్పా నాకు డబ్బులు ఇవ్వాలని కానే కాదు. 2023 నవంబర్ వరకు కూడా నా సొంత ఖర్చులతోనే శిక్షణ తీసుకున్నా, పోటీల్లో పాల్గొన్నా... ఆ తర్వాతే టాప్స్‌కు ఎంపికయ్యా' అని 34 ఏళ్ల అశ్విని వివరించింది. మేటి డబుల్స్ షట్లర్‌గా ఎదిగిన అశ్విని కామన్వెల్త్ క్రీడల్లో 2010లో స్వర్ణం, 2014లో రజతం, 2018లో కాంస్యం గెలిచింది. 2011 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో గుత్తా జ్వాలతో కలిసి మహిళల డబుల్స్‌లో కాంస్య పతకాన్ని గెల్చుకుంది. జ్వాలతోనే కలిసి 2012 లండన్ ఒలింపిక్స్, 2016 రియో ఒలింపిక్స్‌లలో డబుల్స్‌లో పోటీపడింది. పారిస్ ఒలింపిక్స్‌లో తనీషాతో కలిసి బరిలోకి దిగిన అశ్విని గ్రూప్ దశలోనే వెనుదిరిగింది.



పారాలింపిక్స్‌కు ముందే భారత్‌కు ఎదురుదెబ్బ

- బ్యాడ్మింటన్ స్టార్ ప్రమోద్ భగత్‌పై 18 నెలలు నిషేధం
- పారాలింపిక్స్‌కు దూరమైన డిఫెండింగ్ చాంపియన్
- డోపింగ్ నియమావళి ఉల్లంఘనతో బీడబ్ల్యూఎఫ్ చర్యలు



భువనేశ్వర్: పారాలింపిక్స్ ప్రారంభం కాకముందే భారత్‌కు గట్టి దెబ్బ తగిలింది. కచ్చితంగా పతకంతో తిరిగి వస్తాడనుకున్న భారత పారా షట్లర్, టోక్యో పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత ప్రమోద్ భగత్‌పై నిషేధం పడింది. డోపింగ్ నియమావళిని ఉల్లంఘించినందుకు ప్రమోద్‌పై 18 నెలలపాటు సస్పెన్షన్ విధిస్తున్నట్లు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మంగళవారం వెల్లడించింది. దీంతో 2020 టోక్యో పారాలింపిక్స్‌లో పసిడి పతకం గెలిచిన ప్రమోద్.. ఈ నెల 28న ప్రారంభం కానున్న పారిస్ పారాలింపిక్స్‌కు దూరమయ్యాడు. పోటీలు లేని సమయంలో క్రీడాకారులు డోపింగ్ పరీక్షలకు అందుబాటులో ఉండేందుకు తాము ఎక్కడ ఉన్నామనే వివరాలు అందించాల్సి ఉంటుంది. మూడుసార్లు వివరాలు ఇవ్వని పక్షంలో ఆ క్రీడాకారుడిపై చర్యలు తీసుకుంటారు. ఈ విషయంలో ప్రమోద్ విఫలమయ్యాడు. ఏడాది వ్యవధిలో ఎక్కడెక్కడ ఉన్నారనే వివరాలు ప్రమోద్ అందించని కారణంగా అతడిపై బీడబ్ల్యూఎఫ్ సస్పెన్షన్ విధించింది. 'టోక్యో పారాలింపిక్స్ చాంపియన్ ప్రమోద్ భగత్‌పై ఏడాదిన్నర పాటు సస్పెన్షన్ విధించాం. బీడబ్ల్యూఎఫ్ డోపింగ్ నిరోధక నిబంధనల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నాం. గత 12 నెలల్లో ఎక్కడ ఉన్నాడనే వివరాలు ఇవ్వకపోవడంతోనే నిషేధం విధించాం' అని బీడబ్ల్యూఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. 'ఇది చాలా కఠిన నిర్ణయం. ఎక్కడున్నానో చెప్పడంలో జరిగిన పొరపాటుకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. గత ఏడాదిలో రెండుసార్లు టెస్టుకు అందుబాటులో లేను. మూడోసారి పూర్తి వివరాలు సమర్పించా. అయినా నా అప్పీల్‌ను స్వీకరించలేదు. పారిస్ పారాలింపిక్స్ కోసం సిద్ధమవుతున్న సమయంలో ఇలాంటి అనూహ్య ఘటన ఎదురవడం చాలా బాధగా ఉంది. గుండె పగిలినట్లయింది. నా బృందం ఎంతో ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఆఫ్ స్పోర్ట్స్ (సీఏఎస్) నిర్ణయాన్ని గౌరవిస్తున్నా' అని ప్రమోద్ వివరించాడు. నిషేధం విషయంలో గత నెలలో సీఏఎస్‌లో ప్రమోద్ అప్పీల్ చేసుకోగా.. సీఏఎస్ డోపింగ్ నిరోధక విభాగం దాన్ని తాజాగా తోసిపుచ్చింది. ఈ ఏడాది మార్చి 1 నుంచే ఈ నిషేధం అమల్లోకి రాగా.. వచ్చే ఏడాది సెప్టెంబర్ ఒకటి వరకు కొనసాగనుంది. ఒడిశాకు చెందిన ప్రమోద్ కేంద్రం నుంచి 2021లో దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ఖేల్‌రత్న'... 2022లో 'పద్మశ్రీ' అందుకున్నాడు. టోక్యో పారాలింపిక్స్ సింగిల్స్ ఎస్‌ఎల్ 3 విభాగంలో స్వర్ణం గెలిచిన ప్రమోద్... పారా ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో ఐదుసార్లు టైటిల్స్ గెలిచాడు.

తదుపరి లక్ష్యం స్వర్ణ పతకం: అమన్



న్యూఢిల్లీ: వచ్చే ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడమే తన లక్ష్యమని 'పారిస్' క్రీడల్లో కాంస్యం నెగ్గిన భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ పేర్కొన్నాడు. పురుషుల 57 కేజీల విభాగంలో కాంస్యం గెలవడం ద్వారా భారత్ తరఫున అతి పిన్న వయసులో ఒలింపిక్ మెడల్ సాధించిన అథ్లెట్‌గా రికార్డుల్లోకెక్కిన అమన్... భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేస్తానని అన్నాడు. 'తదుపరి ఒలింపిక్స్‌లో పసిడి పతకం గెలవాలనుకుంటున్నా. దాని కోసం మరింత కఠిన సాధన చేస్తా. పారిస్ క్రీడల్లో కాంస్యం గెలవడం ఆనందంగా ఉంది. పతక పోరుకు ముందు బరువు పెరిగినా... పెద్దగా ఆందోళన చెందలేదు' అని అమన్ అన్నాడు. మంగళవారం స్వదేశానికి చేరుకున్న అమన్‌ను కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సన్మానించి రూ. 30 లక్షల చెక్ అందజేశారు.

పతక విజేతలపై నజరానాల వర్షం

- ఫిలిప్పీన్స్ ఒలింపిక్ విజేతకు ఏకంగా 'రిసార్ట్ హోమ్' బహుమతి
- పాకిస్తాన్ జావెలిన్ త్రోయర్ నదీమ్‌కు రూ. 10 కోట్లు అందజేత



మనీలా: విశ్వక్రీడల పతకాలకు ఉన్న ప్రతిష్టకు ఇదొక మచ్చుతునక. ఫిలిప్పీన్స్‌కు చెందిన జిమ్నాస్ట్ కార్లోస్ యులో పారిస్ ఒలింపిక్స్‌లో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, వాల్ట్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించాడు. దాంతో ఆ దేశ ప్రభుత్వం 'రిసార్ట్ హోమ్'ను బహూకరించాలని నిర్ణయించింది. సాధారణంగా విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, క్రీడా అవార్డులు, స్థానిక ప్రభుత్వాలైతే విలువైన ఇంటి స్థలాల్ని ఇవ్వడం పరిపాటి! కానీ ఫిలిప్పీన్స్ మాత్రం కార్లోస్‌కు అద్వితీయ కానుకను సిద్ధం చేస్తోంది. అంతేనా... తమ దేశ చరిత్రలోనే కనీవిని ఎరుగని రీతిలో ఘనస్వాగతం పలికింది. పారిస్ నుంచి మంగళవారం స్వదేశం చేరుకున్న 24 ఏళ్ల చాంపియన్‌కు అసాధారణ ఏర్పాట్లతో వెల్‌కమ్ చెప్పిన ఆ దేశాధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ 10 లక్షల అమెరికా డాలర్లు (రూ. 8.39 కోట్లు) చెక్ ఇవ్వడంతోపాటు ఒక రిసార్ట్ హోమ్‌నే బహుమతి ఇస్తామని ఆ రిసార్టులో జీవితకాలం ఉచిత భోజన సౌకర్యం ఉంటుందని ప్రకటించారు. కార్లోస్ రెండు స్వర్ణాలతో పారిస్ గేమ్స్ పతకాల పట్టికలో ఫిలిప్పీన్స్ 37వ స్థానంలో నిలిచింది.



నదీమ్‌కు కారు 92.97

లాహోర్: పారిస్ ఒలింపిక్స్‌లో పసిడి పతకం నెగ్గిన పాకిస్తాన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్‌కు పాక్ కరెన్సీలో రూ. 10 కోట్లు (భారత్ కరెన్సీలో రూ. 3 కోట్లు) నజరానాను మంగళవారం బహూకరించారు. పంజాబ్ (పాక్) ముఖ్యమంత్రి మరియం నవాజ్ (మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె) నదీమ్ స్వగ్రామానికి వెళ్లి మరీ ప్రోత్సాహకాన్ని చెక్ రూపంలో అందజేసింది. వారి కుటుంబసభ్యులతో ముచ్చటించిన ఆమె ఒలింపిక్ చాంపియన్‌ను తయారు చేసిన కోచ్ సల్మాన్ ఇక్బాల్ భట్‌కూ రూ. 50 లక్షల (రూ.15 లక్షలు) చెక్‌కు అందజేసింది. ఈ నెల 8న పారిస్‌లో జరిగిన ఫైనల్ ఈవెంట్‌లో భారత హాట్ ఫేవరెట్ నీరజ్ చోప్రా (89.45 మీటర్లు; రజతం)ను వెనక్కినెట్టి 92.97 మీటర్లతో కొత్త ఒలింపిక్ రికార్డును నెలకొల్పాడు. ఈ ఒలింపిక్ రికార్డు స్కోరుతో కూడిన నేమ్ ప్లేట్ ఉన్న కారును కూడా నదీమ్‌కు అందజేశారు.



ధర్మశాలలో కాదు... గ్వాలియర్‌లో తొలి టి20

కొత్త స్టేడియంలో భారత్, బంగ్లాదేశ్ పోరు



న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గ్వాలియర్‌లో కొత్త స్టేడియాన్ని ముస్తాబు చేసింది. బంగ్లాదేశ్‌తో త్వరలో జరగబోయే టి20 సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను ఈ కొత్త మైదానంలో నిర్వహించనుంది. షెడ్యూలు ప్రకారం అక్టోబర్ 6న తొలి టి20 ధర్మశాలలో జరగాలి. కానీ అక్కడ నవీకరణ పనులు మ్యాచ్ సమయానికల్లా పూర్తయ్యే పరిస్థితి కనిపించకపోవడంతో బోర్డు వేదికను మార్చింది. గ్వాలియర్ నగరంలో కొత్తగా నిర్మించిన 'శ్రీమంత్ మాధవరావు సింధియా క్రికెట్ స్టేడియం'లో భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్ జరుగుతుంది. వచ్చే జనవరిలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య చెన్నై, కోల్‌కతాల్లో జరగాల్సిన మ్యాచ్ వేదికల్ని పరస్పరం మార్చారు. జనవరి 22న చెన్నైలో జరగాల్సిన మొదటి టి20 కోల్‌కతాలో, 25న కోల్‌కతాలో జరగాల్సిన మ్యాచ్‌ను చెన్నైలో నిర్వహిస్తారు.

సినిమా



ఫెమీనా మిస్ ఇండియా ఎర్త్ (2013) విజేతగా, మోడల్‌గా 'గూఢచారి, మేజర్' వంటి తెలుగు చిత్రాలతో, హిందీ 'రామన్ రాఘవ్ 2.ఓ' చిత్రంతో, 'మేడ్ ఇన్ హెవెన్, ది నైట్ మేనేజర్' వంటి సిరీస్‌లతో... ఇలా శోభితా ధూళిపాళ్ల చాలా పాపులార్టీ సంపాదించుకున్నారు. అయితే హీరో నాగచైతన్యతో ఎంగేజ్‌మెంట్ తర్వాత ఒక్కసారిగా వార్తల్లో ట్రెండింగ్‌గా నిలిచారామె. అందుకు నిదర్శనం ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ 'ఐఎండీబీ' (ఇంటర్నెట్ మూవీ డేటా బేస్) తాజాగా రిలీజ్ చేసిన భారతీయ సెలబ్రిటీల జాబితా. ఈ జాబితాలో శోభిత రెండో స్థానంలో నిలిచారు. గత వారానికి సంబంధించిన పాపులర్ ఇండియన్ సెలబ్రిటీల లిస్టును ఐఎండీబీ తాజాగా విడుదల చేసింది. బాలీవుడ్ నటి శార్వరీ వాఘ్ ('ముంజ్యా' మూవీ ఫేమ్) తొలి స్థానంలో నిలవగా, శోభిత ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలీవుడ్ స్టార్ హీరో షారుక్ ఖాన్‌కి మూడో స్థానం దక్కింది. నాగచైతన్య–శోభితల నిశ్చితార్థం ఈ నెల 8న హైదరాబాద్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు నెటిజన్లు ఆమె గురించి గూగుల్‌లో సెర్చ్ చేశారు. ఈ కారణంగా గత వారం ఇండియన్ పాపులర్ సెలబ్రిటీగా నిలిచారు శోభిత. ఇక 'ఐఎండీబీ' జాబితాలో కాజోల్ నాలుగో స్థానం, జాన్వీ కపూర్ ఐదో స్థానం, బ్యాడ్మింటన్ ప్లేయర్ లక్ష్యసేన్ ఆరు, దీపికా పదుకోన్ ఏడు, విజయ్ సేతుపతి ఎనిమిది, మృణాల్ ఠాకూర్ తొమ్మిది, ఐశ్వర్యా రాయ్ పదో స్థానాల్లో నిలిచారు.

ఐఎండీబీలో...
రెండో స్థానంలో శోభిత... మూడో స్థానంలో షారుక్

మన సినిమాతో ఈ నెలాఖరు అదిరిపోతుంది

– నాని



● ఎస్‌జే సూర్య, ప్రియాంక, డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్, నాని, హన్షిత, హర్షిత్

''హైదరాబాద్‌లోని సుదర్శన్ థియేటర్ నాకు చాలా స్పెషల్. ఈ థియేటర్‌లో మీ అందరితో (అభిమానులు, ప్రేక్షకులు) కలసి 'సరిపోదా శనివారం' ట్రైలర్ లాంచ్ వేడుక చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. మన సినిమాతో ఈ నెలాఖరు అదిరిపోతుంది. మీ ప్రేమను నాపై ఇలానే చూపిస్తూ ఉంటే వంద శాతం కష్టపడి మరిన్ని మంచి చిత్రాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తూనే ఉంటా'' అని హీరో నాని అన్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో నాని, ప్రియాంకా అరుళ్ మోహన్ జంటగా నటించిన చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ– ''29న థియేటర్స్‌లో 'సరిపోదా శనివారం'ని సెలబ్రేట్ చేసుకుందాం'' అన్నారు. నటుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ– ''చాలా మంచి కంటెంట్ ఉన్న చిత్రం ఇది.. తప్పకుండా పెద్ద హిట్ అవుతుంది'' అని పేర్కొన్నారు. ''గ్యాంగ్ లీడర్' సినిమా తర్వాత నానీగారితో 'సరిపోదా శనివారం' చేశాను. అందరూ కుటుంబంతో వెళ్లి మా సినిమా చూడండి'' అని ప్రియాంకా అరుళ్ మోహన్ చెప్పారు. ''మా సినిమా మైండ్ బ్లోయింగ్‌గా ఉంటుంది'' అన్నారు డీవీవీ దానయ్య.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'పేరడైజ్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

పేరడైజ్‌లో దొంగతనం



ప్రముఖ దర్శకులు మణిరత్నం సమర్పించిన సినిమా 'పేరడైజ్'. శ్రీలంక, ఇండియా రచయితలు కలిసి రాసిన కథతో రూపొందిన చిత్రం ఇది. ఈ సినిమాకు ప్రసన్న దర్శకుడు. రోషన్ మాథ్యూ, దర్శనా రాజేంద్రన్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ 'పేరడైజ్' పూర్తిగా శ్రీలంకలో తీసిన సినిమా. పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... ఓ జంట తమ ఐదో వివాహ మహోత్సవాన్ని జరుపుకోవడానికి శ్రీలంకలోని ఓ సుదూర గెస్ట్ హౌస్‌కు వెళుతుంది. ఆ గెస్ట్ హౌస్ కొండల మధ్యలో చాలా మారుమూల ప్రాంతంలో ఉంటుంది. దానికి దరిదాపుల్లో ఓ చిన్న గ్రామం ఉంటుంది. వీళ్ళు వెళ్ళేటప్పటికీ శ్రీలంక దేశం మొత్తం ఉద్యమంతో ఉద్రిక్తత నెలకొని ఉంటుంది. ఈ జంట నివసిస్తున్న గెస్ట్ హౌస్‌లో ఓ రాత్రి దొంగతనం జరిగి వారి వస్తువులన్నీ దొంగలు ఎత్తుకెళ్తారు. ఆ దొంగలను పట్టుకునే క్రమంలో వీరు ఎదుర్కొన్న పరిస్థితులేంటి? అన్నదే కథ. ఈ సినిమా మొత్తంలో స్క్రీన్‌ప్లే కొంత ల్యాగ్ అపించినా ఆఖరి ట్విస్ట్ మాత్రం ఎవరూ ఊహించనిది. అలాగే సినిమా మొత్తంలో సీతమ్మ, హనుమంతులు తిరిగిన ప్రదేశాలు చూపించడం, వాటి వివరణ ఇవ్వడం బావుంది. సినిమా మొత్తం చాలావరకు గ్రీనరీ చూడవచ్చు. ఎందుకంటే లంక అనేది రావణుని పేరడైజ్ కాబట్టి. మరి... మీరు కూడా ఈ 'పేరడైజ్'ని ప్రైమ్ వీడియోలో చూసేయండి.

– ఇంటూరు హరికృష్ణ

"సినిమాలు చూసి ప్రేక్షకులు ప్రభావితమవుతారంటే అంతగా నమ్మను. 'పుష్ప' సినిమా చూసి గొడ్డలి పట్టుకుని ఎవరూ అడవులకు వెళ్లలేదు. గాంధీగారి సినిమాలు చూసి ఎవరూ గాంధీగారిలా మారలేదు. సినిమాల ప్రభావం ప్రేక్షకులపై కొన్ని గంటల పాటు మాత్రమే ఉంటుందన్నది నా అభిప్రాయం" అని దర్శకుడు హరీష్ శంకర్ అన్నారు. హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన తాజా సినిమా 'మిస్టర్ బచ్చన్'. ఈ చిత్రం రేపు (గురువారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో హరీష్ శంకర్ చెప్పిన విశేషాలు.

పాత రవితేజను కొత్తగా చూస్తారు

– హరీష్ శంకర్



● ఉత్తర భారతదేశంలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా 'మిస్టర్ బచ్చన్' సినిమా ఉంటుంది. కొంత సినిమాటిక్ లిబర్టీ తీసుకున్నాను. ఈ సినిమాలో హీరో బచ్చన్ పాత్రలో నిజాయితీ ఉన్న హీరోయిజమ్ ఉంటుంది. 1980లో లక్షల రూపాయలంటే పెద్ద మొత్తం. అంత మొత్తం లంచం రూపంలో వస్తుందన్నా కూడా ఓ అధికారి ఒప్పుకోలేదు.. లొంగలేదు. నాకు ఈ పాయింట్ నచ్చింది. ఇలాంటి నిజాయితీ గల ఆఫీసర్ జీవితంలో ప్రేమ, ఫ్యామిలీ, రొమాంటిక్ యాంగిల్స్ కూడా ఉంటే ఎలా ఉంటుందని ఆలోచించి రవితేజగారి క్యారెక్టర్‌ను డిజైన్ చేశాను. ప్రేక్షకులు బాగా ఎంటర్‌టైన్ అవుతారు. హిందీ 'రైడ్'కు, 'మిస్టర్ బచ్చన్'కు...అజయ్ దేవగన్‌కు, రవితేజకు మధ్య ఉన్నంత తేడా ఉంది. 'రైడ్'లో అజయ్ దేవగన్ రోల్ సెటిల్డ్‌గా ఉంటే... 'మిస్టర్ బచ్చన్'లో రవితేజగారి రోల్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో ఉంటుంది. ఇక ఈ కథకు ఓ కొత్త అమ్మాయి అయితే బాగుంటుందని భావించి భాగ్యశ్రీ బోర్సేను తీసుకోవడం జరిగింది. జిక్కీ పాత్రలో ఆమె ప్రేక్షకులను మెప్పిస్తారు. జగపతి బాబుగారు ఎంపీ పాత్రలో కనిపిస్తారు. ● నేను సినిమా చూడని రోజులు ఉన్నాయేమో కానీ పాటలు వినకుండా ఉన్న రోజులు లేవు. ఓ సినిమా దర్శకుడిగా నేను విఫలం అయ్యానేమో కానీ... సంగీతం విషయంలో కాదు. నా ఫ్లాప్ మూవీ 'షాక్'లోని 'మధురం..' పాట ఇంకా వినిపిస్తూనే ఉంది. ట్యూన్స్ సరైన సమయానికి ఇవ్వకపోవడం వల్ల లిరికల్ వీడియోలు లేట్‌గా విడుదల అవుతున్న రోజులివి. అలాంటిది వారం రోజుల్లో నాలుగు ట్యూన్స్ ఇచ్చారు మిక్కీ జే మేయర్. ఆయన చాలా ప్రతిభావంతుడు. మాస్ సాంగ్స్ చేయలేదు అంటే ఆయనకు రాక కాదు... చాన్స్ రాలేదు అంతే. ● చలం, యండమూరిగార్ల నవలలు చదివి సినిమా ఇండస్ట్రీకి వచ్చాను. సాహిత్యంలో మంచి పట్టు ఉంది నాకు. అలాంటి నేను 'షాక్' సినిమా తీస్తే మూడేళ్లు ఆడియన్స్ నన్ను షాక్‌లో ఉంచారు. ఆ వెంటనే 'మిరపకాయ్' సినిమా తీశాను. ఇక 'ఇడియట్, 'అమ్మానాన్న ఓ తమిళ అమ్మాయి' వంటి సినిమాలు చేసిన రవితేజగారు ఎప్పటికప్పుడు కొత్తగా కనిపించాలని అప్పట్లో 'నా ఆటోగ్రాఫ్..', ఇటీవల 'టైగర్ నాగేశ్వరరావు, ఈగల్' సినిమాలు చేస్తే ఆడియన్స్ ఆదరణ దక్కలేదు. కానీ 'ధమాకా' అంటే హిట్ ఇచ్చారు. అందుకే 'మిస్టర్ బచ్చన్'లో పాత రవితేజనే కొత్తగా చూపిస్తున్నాం. నిర్మాత విశ్వప్రసాద్ గారు లేకపోతే 'మిస్టర్ బచ్చన్' సినిమా ఇంత గ్రాండ్‌గా వచ్చేది కాదు. ఆగస్టు 15న రిలీజ్ చేసేవాళ్లం కాదు. ఆడియన్స్‌కు ఒక్కటే చెప్పాలనుకుంటున్నాను. 'మిస్టర్ బచ్చన్' మళ్లీ మళ్లీ చూసేలా ఉంటుంది. ఈ రోజు సాయంత్రం నుంచి ప్రీమియర్స్ వేస్తున్నాం.

తాల్... ఓ మర్చిపోలేని అనుభూతి

– అనిల్ కపూర్



● అనిల్ కపూర్, ఐశ్వర్యా రాయ్

ఐశ్వర్యా రాయ్, అక్షయ్ ఖన్నా, అనిల్ కపూర్ లీడ్ రోల్స్‌లో నటించిన హిందీ మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా 'తాల్' (1999). సుభాష్ ఘయ్ దర్శకత్వం వహించి, నిర్మించిన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ కావడంతో పాటు అవార్డులు, రివార్డులను సాధించింది. ఈ చిత్రం విడుదలై పాతికేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు అనిల్ కపూర్. ''తాల్' గురించి ప్రేక్షకులు ఇప్పటికీ మాట్లాడుకుంటూనే ఉన్నారు. విక్రాంత్ కపూర్ ('తాల్'లో అనిల్ కపూర్ పాత్ర) రోల్ నా కెరీర్‌లో ఓ మర్చిపోలేని జ్ఞాపకం. ఈ పాత్రను నాకు ఇచ్చిన సుభాష్‌ను గుర్తుపెట్టుకుంటాను. 'రమ్తా జోగి..' నా ఫేవరెట్ సాంగ్. అయితే ఈ పాట నా ఫేవరెట్‌గా మారడం వెనక పెద్ద కథ ఉంది. నిజానికి ఈ పాటకు ఫరా ఖాన్ కొరియోగ్రఫీ చేయాలి. కానీ చివరి నిమిషంలో ఆమె తప్పుకున్నారు. దీంతో ఈ పాటను రేపు చిత్రీకరిస్తామనగా, ముందు రోజు రాత్రి ప్రముఖ కొరియోగ్రాఫర్ సరోజ్ ఖాన్ వచ్చారు. నేను ఎటువంటి రిహార్సల్స్ లేకుండానే ఈ పాటను పూర్తి చేశాను. అదీ... ఐశ్వర్యా రాయ్ వంటి అద్భుతమైన డ్యాన్సర్ సరసన డ్యాన్స్ చేశాను. చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఇంకో విశేషం ఏంటంటే...ఫిల్మ్‌ఫేర్, జీ, ఐఎఫ్ఎఫ్ఏ, స్క్రీన్ అవార్డ్స్... ఇలాంటి అవార్డ్స్ ఫంక్షన్స్‌లో ఉత్తమ సహాయనటుడి విభాగం ('తాల్'లో నటనకు గాను...)లో నాకు మేజర్ అవార్డులు వచ్చాయి. ఇలా అన్ని రకాలుగా 'తాల్' మర్చిపోలేని అనుభూతిని మిగిల్చింది'' అంటూ ఇన్‌స్టా వేదికగా పేర్కొన్నారు అనిల్ కపూర్. 12 పాటలు ఉన్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

ఆ మ్యాజిక్ రిపీట్ అవుతుంది

– జీవీ ప్రకాశ్‌కుమార్



''టెక్నాలజీని మనం ఎంత వరకూ సద్వినియోగం చేసుకుంటున్నాం అన్నది ముఖ్యం. కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ఉపయోగించి కొందరు ప్రముఖ సంగీత దర్శకులు చేసిన సంగీతం, పాటలు శ్రోతలను ఎందుకు మెప్పించలేకపోయాయి? అనే విషయాలపై నేను మాట్లాడను. కానీ సినిమా స్క్రిప్ట్, అందులో నుంచి వచ్చే సందర్భాలపైనే సంగీత దర్శకులు ఇచ్చే సంగీతం ఆధారపడి ఉంటుంది'' అన్నారు సంగీత దర్శకుడు–నటుడు జీవీ ప్రకాశ్‌కుమార్. విక్రమ్ హీరోగా నటించిన తాజా పీరియాడికల్ ఫిల్మ్ 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ చిత్రం రేపు (గురువారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జీవీ ప్రకాశ్‌కుమార్ మాట్లాడుతూ– ''తంగలాన్' కథ ప్రధానంగా ట్రైబల్స్ నేపథ్యంలో ఉంటుంది. దాంతో ఆఫ్రికన్, ఆస్ట్రేలియన్ ట్రైబ్స్‌కు చెందిన సంగీతాన్ని కూడా పరిశీలించాను. సినిమా సంగీతానికి, ట్రైబల్స్ సంగీతానికి మధ్యలో నేను ఓ వారధిగా ఉంటూ ఈ సినిమా మ్యూజిక్‌ను ప్రేక్షకులకు చేరువ చేయడం సవాల్‌గా అనిపించింది. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా అద్భుతంగా ఉంటుంది. విక్రమ్‌గారితో ఇది నా మూడో సినిమా. నా సంగీత దర్శకత్వంలో వచ్చిన 'అసురన్, ఆకాశం నీ హద్దురా!' లాంటి మ్యాజిక్ 'తంగలాన్'తో రిపీట్ అవుతుందని అనుకుంటున్నాను'' అని అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
14-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	693	78,956
నిఫ్టీ ▼	208	24,139

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,318	▲ 357
డోజోన్స్	39,664	▲ 307
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,235	▲ 25
డాక్స్	17,812	▲ 86
షాంఘై	2,867	▲ 10
నికాయ్	36,232	▲ 1,208

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	70,444	▲ 554
బంగారం (99.5 స్వచ్ఛత)	70,162	▲ 552
వెండి (కేజీ)	80,702	▼ 422

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.55	84.57
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.98	108.53
€	యూరో	ఎస్‌బీఐ	90.56	92.95
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.56	57.83
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.41	56.34
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.09	65.74
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.98	23.76
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.83	12.65

స్పామ్ కాల్స్ టెలీమార్కెటర్లను బ్లాక్‌లిస్ట్ చేయండి

టెల్కోలకు ట్రాయ్ ఆదేశాలు



న్యూఢిల్లీ: స్పామ్ కాల్స్ చేసే టెలీమార్కెటర్లపై టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ కఠిన చర్యలు ప్రకటించింది. అన్‌రిజిస్టర్డ్ టెలీ మార్కెటింగ్ సంస్థలు వ్యాపారపరమైన స్పామ్ కాల్స్ చేస్తున్నట్లుగా తేలినట్లయితే వాటి టెలికం వనరులన్నింటినీ డిస్కనెక్ట్ చేయాలని, రెండేళ్ల పాటు వాటిని బ్లాక్‌లిస్ట్‌లో ఉంచాలని టెల్కోలను ఆదేశించింది. బ్లాక్‌లిస్ట్‌లో ఉంచినప్పుడు ఆయా సంస్థలకు కొత్తగా టెలికం వనరులను కేటాయించరాదని పేర్కొంది. ఎస్ఐపీ, పీఆర్ఐ వంటి టెలికం వనరులను ఉపయోగిస్తున్న అన్‌రిజిస్టర్డ్ టెలీమార్కెటర్లు ఈ ఆదేశాలు వచ్చిన నెల రోజుల్లోగా డీఎల్‌టీ ప్లాట్‌ఫాంనకు మారాలని తెలిపింది. ఈ ఆదేశాలను తక్షణం పాటించాలని, ఈ విషయంలో తీసుకున్న చర్యలపై ప్రతి పదిహేను రోజులకు ఓసారి (ప్రతి నెలా ఒకటి, పదహారో తారీఖుల్లో) అప్‌డేట్ ఇవ్వాలని టెల్కోలకు ట్రాయ్ సూచించింది. ఈ 'నిర్ణయాత్మక చర్య'తో స్పామ్ కాల్స్ బెడద గణనీయంగా తగ్గగలదని, వినియోగదారులకు ఉపశమనం కలగగలదని అభిప్రాయపడింది.

హీరో మోటో లాభం జూమ్

క్యూ1లో రూ. 1,032 కోట్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాది తొలి త్రైమాసికం (2024–25, క్యూ1)లో హీరోమోటో కార్ప్ కన్సాలిడేటెడ్ నికర లాభం 47% పెరిగి రూ. 1,032 కోట్లను తాకింది. వాహన అమ్మకాల జోరు ఇందుకు దోహదపడింది. గతేడాది క్యూ1లో కేవలం రూ. 701 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 8,851 కోట్ల నుంచి రూ. 10,211 కోట్లకు ఎగసింది.కంపెనీ చరిత్రలో తొలిసారి ఒక క్వార్టర్లో రూ. 10,000 కోట్ల టర్నోవర్ అందుకున్నట్లు హీరో మోటో సీఈవో నిరంజన్ గుప్తా పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో హీరో మోటో షేరు 1.4% తగ్గి రూ. 5,240 వద్ద ముగిసింది.

హైదరాబాద్‌లో ట్రైనెట్ జీసీసీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు హ్యూమన్ రిసోర్సెస్ సొల్యూషన్స్ అందించే ట్రైనెట్ తాజాగా హైదరాబాద్‌లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ని ప్రారంభించింది. సుమారు 600 మంది సిబ్బంది సామర్థ్యంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రెసిడెంట్ మైక్ సిమండ్స్ తెలిపారు. తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించే ప్రణాళికల్లో ఉన్నట్లు వివరించారు. తమ వ్యాపారానికి, సాంకేతిక ఆవిష్కరణలకు, క్లయింట్లకి మెరుగైన సేవలు అందించేందుకు హైదరాబాద్ కార్యాలయం హబ్‌గా ఉపయోగపడగలదని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ మేకల పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

స్మార్ట్ ఫోన్స్ మార్కెట్ జోరు | 350 బిలియన్ డాలర్లకు ఈ-కామర్స్ ఎగుమతులు!

పండుగ డిమాండ్.. లక్షల్లో గిగ్ జాబ్స్!

పండుగ సీజన్ కోసం కంపెనీల తాత్కాలిక హైరింగ్ జోరు

- 7 లక్షల గిగ్ వర్కర్లను నియమించుకునే చాన్స్
- గతేడాదితో పోలిస్తే 15–20% అధికం..
- ఈ-కామర్స్, లాజిస్టిక్స్ టాప్
- తర్వాత స్థానాల్లో బీఎఫ్ఎస్ఐ, రిటైల్, ఆతిథ్యం

పండుగల సీజన్‌లో కంపెనీల తాత్కాలిక హైరింగ్ జోరందుకుంటోంది. పరిశ్రమలవ్యాప్తంగా ఈ ఏడాది దాదాపు 7 లక్షల గిగ్ వర్కర్లకు ఉద్యోగావకాశాలు లభించను... గతేడాది పండుగ సీజన్‌తో పోలిస్తే ఇది 15–20 శాతం అధికం కావడం గమనార్హం. ఆర్థిక వ్యవస్థ ప్రగతి పథంలో దూసుకెళ్తుం... [illegible] ... గ్రామీణ డిమాండ్ కూడా దన్నుగా నిలుస్తుందని లెక్కలేస్తున్నాయి. ... సంస్థలు చెబుతున్నాయి. ...

ఈ రంగాల్లో జోష్...

ఆగస్టులో మొదలయ్యే పండుగ సీజన్.. కేరళ ఓనమ్, వినాయక చవితి, దసరా, దీపావళి, చివర్లో క్రిస్మస్, కొత్త సంవత్సరం వేడుకలతో ముగుస్తుంది. దీంతో ఈకామర్స్ సంస్థలు, రిటైల్ స్టోర్లు రకరకాల ఆఫర్లతో ... [illegible] ... సుదీర్ఘ ఎన్నికల ... కుంటోంది. ... డుగా ఉంది. అన్ని రంగాల్లోనూ కలిపి 6 లక్షల నుంచి 7 లక్షల మేర తాత్కాలిక ఉద్యోగాలు వెల్లువెత్తొచ్చని భావిస్తున్నాం' అని క్వెస్ ... [illegible] ... కన్జూమర్ డ్యూరబుల్స్ ... బ్యాంకులు/ఎన్‌బీఎఫ్‌సీలు సైతం లోన్లు, క్రెడిట్ కార్డుల జారీపై మరింత దృష్టి సారిస్తున్నాయి. రిటైల్ స్టోర్లలో ... ప్లాన్. దేశంలోని ... చనా.

చిన్న నగరాల్లో మరింత అధికం

పట్టణీకరణ శరవేగంగా పెరుగుతుం... [illegible] ... స్తున్నాయి. గత సీజన్‌తో పోలిస్తే ఇక్కడ గిగ్ వర్కర్ల డిమాండ్‌లో 25–30 శాతం వృద్ధి కనిపిస్తోంది. ... [illegible] ... చండీగఢ్ వంటి పలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు తాత్కాలిక ఉద్యోగులకు హాట్ స్పాట్లుగా నిలు... క్వాలిటీ కంట్రోల్, ఆర్డర్ ఫుల్‌ఫిల్మెంట్ సిబ్బంది నియామకాలు జోరందుకున్నాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణియన్ తెలిపారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



గిగ్ వర్కర్లకు జీతాల రేంజ్... (రూ.లలో)

డెలివరీ	15,000-18,000
గిడ్డంగులు	15,000-18,000
రిటైల్ స్టోర్ సేల్స్	18,000-22,000
బీఎఫ్ఎస్ఐ సేల్స్	22,000-24,000
అసెంబ్లింగ్ లైన్ వర్కర్లు	16,000-19,000

*దీనికి ఇతర ప్రోత్సాహకాలు అదనం. సేల్స్, డెలివరీ రంగాల్లోని వారు మరిన్ని ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది.

79,000 దిగువకు సెన్సెక్స్

- నిఫ్టీకి 208 పాయింట్ల నష్టం
- సూచీలకు రెండోరోజూ నష్టాలు
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ షేర్లు పడేశాయ్
- రూ.4.52 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి



ముంబై: అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ, ఐటీసీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ పడ్డాయి. ఎఫ్ఐఐల విక్రయాలు కూడా సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.50% నష్టపోయి సూచీల పతనాన్ని శాసించింది. ఫలితంగా సెన్సెక్స్ 693 పాయింట్లు క్షీణించి 79 వేల స్థాయి దిగువన 78,956 వద్ద నిలిచింది. నిఫ్టీ 208 పాయింట్లు నష్టపోయి 24,139 వద్ద స్థిరపడింది. కన్జూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 760 పాయింట్లు పతనమై 78,889 వద్ద, నిఫ్టీ 231 పాయింట్లు క్షీణించి 24,116 వద్ద కనిష్టాలు తాకాయి.

- హిండెన్‌బర్గ్ ఆరోపణల ప్రభావంతో అదానీ గ్రూపులోని మొత్తం 11 లిస్టెడ్ కంపెనీల షేర్లలో 8 నష్టపోయాయి.
- సెన్సెక్స్ దాదాపు శాతం పతనంతో ఒక్కరోజులో రూ.4.52 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.445 లక్షల కోట్ల(5.30 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది.

ఈకామర్స్ ప్లాట్‌ఫామ్ ఫస్ట్‌క్రై మాతృసంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ లిస్టింగ్ విజయవంతమైంది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.465)తో పోలిస్తే 34% ప్రీమియంతో రూ.625 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 52% పెరిగి రూ.707 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 46% లాభంతో రూ.678 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.35,214 కోట్లుగా నమోదైంది.



సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు పెట్టిన యూనికామర్స్ ఈ సొల్యూషన్ షేరు లిస్టింగ్‌లో అదరగొట్టింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.108)తో పోలిస్తే 113% ప్రీమియంతో రూ.230 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 137% పెరిగి రూ.256 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆఖర్లో లాభాల స్వీకరణతో చివరికి 95% లాభంతో రూ.210 వద్ద స్థిరపడింది.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

హెచ్ఏఎల్ నాసిక్‌లో 324 అప్రెంటిస్‌లు

నాసిక్(మహారాష్ట్ర)లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. ఎయిర్‌క్రాఫ్ట్ డివిజన్‌లో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఐటీఐ స్ట్రీమ్‌లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 324.
» ట్రేడులు: ఫిట్టర్, టూల్–డై మేకర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్, పెయింటర్, కార్పెంటర్, షీట్ మెటల్ వర్కర్, కంప్యూటర్ ఆపరేటర్–ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, వెల్డర్, స్టెనోగ్రాఫర్.
» అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» స్టైపెండ్: నెలకు ఏడాది కోర్సుకు రూ. 7700, రెండేళ్ల కోర్సుకు రూ.8,050.

ముఖ్య సమాచారం

» గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తు ప్రారంభతేది: 08.08.2024.
» దరఖాస్తులకు చివరితేది: 31.08.2024.
» డాక్యుమెంట్ వెరిఫికేషన్ తేదీలు: సెప్టెంబర్ రెండు/మూడో వారం, 2024.
» ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడితేది: సెప్టెంబర్ నాలుగో వారం.
» జాయినింగ్ తేది: అక్టోబర్ రెండో వారం, 2024.
» వెబ్‌సైట్: https://hal-india.co.in

ఆర్ఆర్‌బీలో 1,376 పారా మెడికల్ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) దేశవ్యాప్తంగా వివిధ రైల్వే రీజియన్లలో వివిధ కేటగిరీల్లో పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 1,376.
» పోస్టుల వివరాలు: డైటీషియన్(లెవల్–7)–05, నర్సింగ్ సూపరింటెండెంట్–713, ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ థెరపిస్ట్–04, క్లినికల్ సైకాలజిస్ట్–07, డెంటల్ హైజీనిస్ట్–03, డయాలసిస్ టెక్నీషియన్–20, హెల్త్ అండ్ మలేరియా ఇన్‌స్పెక్టర్ గ్రేడ్–3–126, ల్యాబొరేటరీ సూపరింటెండెంట్–27, పెర్ఫ్యూషనిస్ట్–02, ఫిజియోథెరపిస్ట్ గ్రేడ్ 2–20, ఆక్యుపేషనల్ థెరపిస్ట్–02, క్యాథ్ ల్యాబొరేటరీ టెక్నీషియన్–02, ఫార్మసిస్ట్ (ఎంట్రీ గ్రేడ్)–246, రేడియోగ్రాఫర్ ఎక్స్–రే టెక్నీషియన్–64, స్పీచ్ థెరపిస్ట్–01, కార్డియాక్ టెక్నీషియన్–04, ఆప్టోమెట్రిస్ట్–04, ఈసీజీ టెక్నీషియన్–13, ల్యాబొరేటరీ అసిస్టెంట్ గ్రేడ్2–94, ఫీల్డ్ వర్కర్–19.
» ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, చెన్నై, ముజఫర్‌నగర్, అజ్మీర్, గోరఖ్‌పూర్, పాట్నా, బెంగళూరు, గువాహటి, ప్రయాగ్‌రాజ్, భోపాల్, జమ్ము–శ్రీనగర్, రాంచీ, భువనేశ్వర్, కోల్‌కతా, సికింద్రాబాద్, బిలాస్‌పూర్, మాల్దా, సిలిగురి, ముంబై, తిరువనంతపురం.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 10+2, జీఎన్ఎం, డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: సీబీటీ(కంప్యూటర్ ఆధారిత పరీక్ష), రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష. మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ప్రొఫెషనల్ ఎబిలిటీ(70 ప్రశ్నలు–70 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(10 ప్రశ్నలు–10 మార్కులు), జనరల్ అర్థమేటిక్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(10 ప్రశ్నలు–10 మార్కులు), జనరల్ సైన్స్(10 ప్రశ్నలు–10 మార్కులు). పరీక్ష సమయం 90 నిమిషాలు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 17.08.2024.
» దరఖాస్తు ఫీజు చెల్లింపు, దరఖాస్తులకు చివరి తేది: 16.09.2024.
» దరఖాస్తు సవరణ తేదీలు: 17.09.2024 నుంచి 26.09.2024 వరకు
» వెబ్‌సైట్: https://indianrailways.gov.in

ఐఐఎస్ఈఆర్, బరంపూర్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

బరంపూర్(ఒడిశా)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్–రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్)లో.. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 05.
» పోస్టుల వివరాలు: ప్రొఫెసర్(కెమికల్ సైన్సెస్)–01, అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ–1(ఎర్త్–ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్)–02, అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ–1(కంప్యూటర్ సైన్సెస్)–01, అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ–1(బయోలాజికల్ సైన్సెస్)–01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 12.08.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.09.2024
» వెబ్‌సైట్: https://iiserbpr.ac.in

స్టెమ్‌కు కేరాఫ్ యూఎస్

» అమెరికాలో స్టెమ్ విభాగాల్లో నిపుణుల కొరత
» ఈ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ప్రోత్సాహకాలు
» స్టెమ్ ప్రోగ్రామ్స్‌పై భారత విద్యార్థుల ఆసక్తి

స్టడీ అబ్రాడ్ అనగానే ఎక్కువ మంది భారతీయ విద్యార్థుల తొలి ప్రాధాన్యం.. అమెరికా యూనివర్సిటీలు! యూఎస్‌కు వెళ్లే మన విద్యార్థులు స్టెమ్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్.. సంక్షిప్త రూపమే స్టెమ్!! అక్కడి ఇన్‌స్టిట్యూట్స్ సైతం విదేశీ విద్యార్థులను స్టెమ్ కోర్సుల్లో సాదర స్వాగతం పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో.. స్టెమ్ ప్రోగ్రామ్స్ .. అమెరికాలో ఈ కోర్సులతో ప్రయోజనాలు.. కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

అగ్రరాజ్యం అమెరికాలో ప్రస్తుతం స్టెమ్ రంగాల్లో స్కిల్ గ్యాప్ సమస్య నెలకొంది. ముఖ్యంగా హయ్యర్ డిగ్రీ (గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్) ఉద్యోగాల స్థాయిలో స్టెమ్ విభాగాల్లో నైపుణ్యాల కొరత ఎక్కువగా ఉంది. మరోవైపు జపాన్, జర్మనీ, చైనా వంటి దేశాలు సైన్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణల్లో దూసుకుపోతున్నాయి. దీంతో భవిష్యత్తు అవసరాల కోసం స్టెమ్ ప్రోగ్రామ్స్‌కు యూఎస్ ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

స్టెమ్ ప్రోగ్రామ్‌లకే

అమెరికాలో ఉన్నత చదువులకోసం పయనమవుతున్న భారతీయ విద్యార్థుల్లో ఎక్కువ మంది స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకే ఆసక్తి చూపుతున్నారు. 2022–23లో యూఎస్‌లో అడుగు పెట్టిన మొత్తం విద్యార్థుల్లో 41 శాతం మంది మ్యాథమెటిక్స్ /కంప్యూటర్ సైన్స్‌లో, 26.9 శాతం మంది ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లలో చేరడమే ఇందుకు నిదర్శనం. అదే విధంగా స్టెమ్ ప్రోగ్రామ్స్ ఆధారంగా లభించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీలో) కూడా దాదాపు 69 వేల మంది భారత విద్యార్థులు అవకాశం దక్కించుకోవడం విశేషం.

సరళీకృత నిబంధనలు

ప్రస్తుతం అమెరికాలో స్టెమ్ విభాగాల్లో మానవ వనరులకు భారీగా డిమాండ్ నెలకొంది. దీంతో ఈ విభాగాల్లో నియామకాలు ఏటేటా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్టెమ్ కోర్సుల్లో ఉన్నత విద్యకు దరఖాస్తు చేసుకుంటున్న భారత విద్యార్థులకు స్టూడెంట్ వీసా ఎఫ్–1 మంజూరులో సరళీకృత నిబంధనలతో వెసులుబాట్లు కల్పిస్తున్నారు. అదేవిధంగా యూఎస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలోనూ నిపుణుల కొరత ఎక్కువగా ఉంది. అందుకే ఈ విభాగంలోనూ విదేశీ విద్యార్థులకు స్వాగతం పలకాలని, ముఖ్యంగా భారత విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వాలని యూఎస్ సర్కారు నిర్ణయించింది.

36 నెలల ఓపీటీ

అమెరికాలో కోర్సు పూర్తయ్యాక అక్కడ ఉద్యోగానికి మార్గం.. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ). స్టెమ్ ప్రోగ్రామ్స్ ఉత్తీర్ణులకు ఓపీటీ ద్వారా ఎక్కువ కాలం అక్కడే ఉద్యోగం చేసే అవకాశం కల్పిస్తున్నారు. స్టెమ్ కోర్సుల విద్యార్థులు 36 నెలలు ఓపీటీ పేరుతో సంబంధిత సంస్థల్లో పని చేసే అవకాశం అందుబాటులో ఉంది. దీనికి ప్రధాన కారణం.. అమెరికాలో నెలకొన్న స్టెమ్ నిపుణుల కొరతే. అందుకే ముందుగా ఏడాది వ్యవధికే ఓపీటీకి అనుమతిచ్చినా.. దాన్ని మరో 24 నెలలు పొడిగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు.

హెచ్–1బీలోనూ ప్రాధాన్యం


ఉద్యోగ వీసాగా పేర్కొనే హెచ్–1బీ మంజూరులోనూ స్టెమ్ నిపుణులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అమెరికాలో ఉద్యోగానికి అవసరమైన హెచ్1–బీ వీసా నిబంధనల ప్రకారం–12 పాయింట్ల స్కోర్‌గా పేర్కొనే వీసా నిబంధనల్లో బ్యాచిలర్ డిగ్రీలోని ఒక్కో సంవత్సరానికి మూడు పాయింట్లు కేటాయిస్తారు. ముఖ్యంగా బోధన, పరిశోధన విభాగాల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి వీలైనంత సులువుగా వీసా ప్రక్రియ ముగిస్తున్నారు. ఆర్ అండ్ డీ రంగ బలోపేతానికి గ్లోబల్ టాలెంట్‌ను ఆకర్షించేందుకు ఆకర్షణీయమైన వేతనాలు ఆఫర్ చేయడం వంటి ప్రోత్సాహక చర్యలను యూఎస్ చేపడుతోంది.

ముఖ్యమైన కోర్సులు ఇవే

అమెరికాలో ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ మొదలు.. 4.0 స్కిల్స్‌గా పేర్కొనే ఏఐ, రోబోటిక్ వరకూ.. పలు నూతన విభాగాల్లో కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, బయాలజీ వంటి సంప్రదాయ కోర్సులతోపాటు సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సస్టెయినబుల్ ఎనర్జీ సిస్టమ్స్ వంటి కోర్సులను పలు యూనివర్సిటీలు ఆఫర్ చేస్తున్నాయి.

ఇన్‌స్టిట్యూట్ ఎంపిక కీలకం

స్టెమ్ విభాగాల్లో దాదాపు అన్ని యూనివర్సిటీలు లేటెస్ట్ టెక్నాలజీస్‌పై కోర్సులు అందిస్తున్నాయి. వీటిల్లో బెస్ట్ ఇన్‌స్టిట్యూట్‌ను ఎంచుకోవడం కీలకంగా మారిందని నిపుణులు అంటున్నారు. విద్యార్థులు ఆయా వర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్స్ ర్యాంకింగ్స్‌ను, ఫ్యాకల్టీ, రీసెర్చ్, క్యాంపస్‌లో భద్రత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. స్టెమ్ ప్రోగ్రామ్స్‌కు సంబంధించి ప్రస్తుతం ఎంఐటీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, కాల్‌టెక్ యూనివర్సిటీలకు మంచి పేరుంది. వీటితోపాటు స్టెమ్ ప్రోగ్రామ్స్ బోధనకు ప్రాధాన్యం ఇస్తున్న ఇతర కళాశాలల గురించి అన్వేషించడం మేలు.



స్కాలర్‌షిప్స్

స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో చేరే విద్యార్థులకు ఇన్‌స్టిట్యూట్స్‌తోపాటు యూఎస్ ప్రభుత్వం నుంచి కూడా ప్రోత్సాహకాలు లభిస్తున్నాయి. ఫుల్‌బ్రైట్ సైన్స్ అండ్ టెక్నాలజీ స్కాలర్‌షిప్స్, నేషనల్ సైన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్స్ వంటివి అందుకునే అవకాశముంది. వీటితోపాటు ఇన్‌స్టిట్యూట్స్ స్థాయిలో ఫెడరల్ లోన్స్, వర్క్ అండ్ స్టడీ ప్రోగ్రామ్స్, నీడ్ బేస్డ్ అలవెన్స్ తదితర ఆర్థిక సహకారం సైతం అందుతుంది.

వేతనాలు ఆకర్షణీయం

స్టెమ్ ప్రోగ్రామ్స్ ఉత్తీర్ణులకు వేతనాలు కూడా భారీగానే లభిస్తున్నాయి. కనిష్టంగా గంటకు 35 డాలర్లు, గరిష్టంగా గంటకు 45 డాలర్ల వేతనం లభిస్తుంది. కంప్యూటర్ సైన్స్, ఐటీ, రోబోటిక్స్, ఏఐ–ఎంఎల్, పెట్రోలియం ఇంజనీరింగ్, న్యూక్లియర్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ రీసెర్చ్ సైంటిస్ట్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, మెరైన్ ఆర్కిటెక్ట్, మెడిసిన్ టెక్నాలజిస్ట్, బిజినెస్ ఇంటెలిజెన్స్ అనలిస్ట్, సాఫ్ట్‌వేర్/సిస్టమ్ డెవలప్‌మెంట్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఈ విభాగాల్లో సగటున 50 వేల డాలర్ల నుంచి 88 వేల డాలర్ల వార్షిక వేతనం అందుతుంది.

ప్రవేశానికి సమయమిదే

యూఎస్‌లోని యూనివర్సిటీలు ఫాల్, స్ప్రింగ్ సెషన్లుగా ప్రవేశాలు కల్పిస్తాయి. ఫాల్ సెషన్‌కు దరఖాస్తులను సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు; స్ప్రింగ్ సెషన్‌కు జనవరి నుంచి మే నెల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులు సంబంధిత సెషన్‌కు కనీసం 15 నుంచి 18 నెలల ముందుగా కసరత్తు ప్రారంభించాలి.

ప్రామాణిక టెస్ట్‌లు

స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం కోసం విద్యార్థులు స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్ నిబంధనలపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలి. సైన్స్, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగాల విద్యార్థులు జీఆర్ఈ, టోఫెల్ స్కోర్లు పొందాల్సి ఉంటుంది. జీఆర్ఈలో సబ్జెక్ట్ టెస్ట్ స్కోర్లను కూడా అక్కడి ప్రముఖ యూనివర్సిటీలు తప్పనిసరి చేస్తున్నాయి. జీఆర్ఈలో కనీసం 300కుపైగా పాయింట్లు సొంతం చేసుకోవడం వల్ల అడ్మిషన్ అవకాశాలు మెరుగవుతాయి. ప్రవేశాల్లో లెటర్ ఆఫ్ రికమండేషన్(ఎల్ఓఆర్),స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ)లు కూడా కీలకంగా మారుతున్నాయి.

గరిష్టంగా 50 వేల డాలర్ల ఫీజు

అమెరికాలోని యూనివర్సిటీల్లో ఎంఎస్ స్థాయిలో స్టెమ్, ఇతర ప్రోగ్రామ్‌ల ఫీజులు గరిష్టంగా 50 వేల డాలర్ల వరకు ఉంటున్నాయి. కొన్ని యూనివర్సిటీల్లో 30 వేల డాలర్ల ఫీజు ఉంటోంది. హార్వర్డ్, ఎంఐటీ వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో చదవాలంటే.. ఏడాదికి కనీసం యాభై వేల డాలర్ల ఫీజు చెల్లించాల్సిందే. కాబట్టి అభ్యర్థులు అకడమిక్ సెషన్ ప్రారంభానికి వీలైనంత ముందుగానే సన్నాహకాలను ప్రారంభించాలని నిపుణులు సూచిస్తున్నారు.

అమెరికా ఉన్నత విద్య.. అవసరమైన పత్రాలు

- అకడమిక్ ట్రాన్స్‌క్రిప్ట్స్ (విద్యార్హతల సర్టిఫికెట్లు)
- జీఆర్ఈ/జీమ్యాట్/టోఫెల్ /ఐఈఎల్‌టీఎస్ తదితర టెస్ట్ స్కోర్లు
- లెటర్ ఆఫ్ రికమండేషన్
- స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్
- వర్క్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్
- ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ (బ్యాంక్ స్టేట్‌మెంట్)
- రెజ్యూమే/సీవీ
- ఐ–20,సెవిస్ రిసీప్ట్ (ఐ–901)(వీసా కోసం)
- వీటితోపాటు ఆర్థిక వనరుల రుజువులు.

మూసీ నది మురిసేలా..

అటు వాణిజ్యం, ఇటు పర్యాటకానికి ఊతమిచ్చేలా రివర్ ఫ్రంట్ అభివృద్ధి

దక్షిణకొరియా రాజధాని సియోల్‌లోని 'చంగ్ యే చున్' నదిని శుద్ధి చేసిన తీరే ఆదర్శం	గోదావరి జలాలు తరలించి.. నిరంతరం మూసీలో నీరు పారేలా ప్రణాళిక	నదీతీరం వెంబడి రోడ్లు, వంతెనలు, స్కైవాక్‌లు వంటివెన్నో..	రియల్ ఎస్టేట్ అవసరాలకు 25 వేల ఎకరాల కేటాయింపు


మూసీ పక్కన వెళ్తుంటే.. ముక్కుపుటాలు అదిరే దుర్వాసన. మురికి కలిసి నల్లగా మారిన నీళ్లు.. నది పొడవునా చెత్తా చెదారం.. ఇదంతా ఇప్పుడు..

అదే రాష్ట్ర ప్రభుత్వం అనుకున్నట్టుగా జరిగితే..

మూసీ పక్కన వెళ్తుంటే.. పచ్చని గ్రీనరీ, స్కైవాక్‌లు.. నదిలో శుభ్రమైన నీళ్లు, అందులో బోటింగ్.. వ్యాపార, వాణిజ్య సంస్థలు, విశాలమైన రోడ్లు, లాజిస్టిక్ కారిడార్లు..

మరి ఈ మురికి కూపం.. మంచినీటి నది అయ్యేదెలా?

దక్షిణ కొరియాలోని సియోల్‌లో 'చంగ్ యే చున్' నదిని శుద్ధి చేసిన తీరే దీనికి ఆదర్శం. ఇతర నదుల నుంచి నీటిని 'చంగ్ యే చున్' నదికి తరలించి.. నిత్యం నీరు పారేలా చేసి.. చెత్తా చెదారాన్ని తొలగించి 'క్లీన్ రివర్'గా మార్చారు.



సాక్షి, హైదరాబాద్: మురికికూపంగా మారిన మూసీ నది సుందరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. ఓ వైపు వాణిజ్యం , మరోవైపు పర్యాటకానికి ఊతమిచ్చేలా రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయాలని.. దీనితో ఉపాధి, ఉద్యోగ అవకాశాలూ లభిస్తాయని భావిస్తోంది. ఈ క్రమంలో మూసీ చుట్టూ 25 వేల ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ అవసరాలకు కేటాయించాలని నిర్ణయించినట్టు తెలిసింది. దీనితో మూసీ వెంబడి సుమారు 120 కోట్ల చదరపు అడుగుల స్థలం అందుబాటులోకి వస్తుందని అంచనా. ఇటీవల ఓ హోటల్‌లో 'రీ–ఇమేజింగ్ హైదరాబాద్' పేరిట నగరానికి చెందిన పలువురు డెవలపర్లతో జరిపిన సమావేశంలో సీఎం రేవంత్ ఈ ప్రస్తావన చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

నిరంతరం నీటి ప్రవాహంతో...

దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆ దేశ రాజధాని సియోల్‌లోని 'చంగ్ యే చున్' నదిని సందర్శించారు. అది కూడా గతంలో మన మూసీలాగే మురికికూపంగా ఉండేది. అక్కడి ప్రభుత్వం ఆ నదిపై ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. పూర్తిగా శుద్ధి చేసి, సుందరీకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసింది. తాజాగా సీఎం బృందం ఆ నదిని సందర్శించింది. సుందరీకరణ, అభివృద్ధి దిశగా చేపట్టిన చర్యలు, ఎదురైన సమస్యలు, తీసుకున్న జాగ్రత్తలు, సాంకేతిక అంశాలను అక్కడి అధికారులతో కూలంకషంగా చర్చించింది. దక్షిణ కొరియాలోని హాన్ నది, దాని ఉప నదులు, భూగర్భ జలాలను 'చంగ్ యే చున్' నదిలోకి తరలించి దాన్ని శుద్ధి చేశారు. అంతకన్నా ముందే ఆ నది వెంట ఉన్న చెత్తాచెదారం , రోడ్లు, ఫ్లైఓవర్లనూ తొలగించారు. ఆ ప్రాంతంలో చెట్లు, మొక్కలను పెంచి.. అందమైన ప్రదేశంగా మార్చారు.



ప్రపంచ బ్యాంకు నుంచి రుణం

మూసీ రివర్ ఫ్రంట్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను సమీకరించే మార్గాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఈ క్రమంలో ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకునేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తోంది. ఇటీవల ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా.. మూసీ రివర్ ఫ్రంట్ ప్రతిపాదనలు అందించామని, వారి నుంచి సానుకూల స్పందన వచ్చిందని అధికార వర్గాలు చెప్తున్నాయి. తొలిదశలో రూ.4 వేల కోట్ల రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొంటున్నాయి.

అటు వాణిజ్యం.. ఇటు పర్యాటకం..

పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో మూసీ సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. ఇటీవల బడ్జెట్‌లో ప్రభుత్వం మూసీ రీ–డెవలప్‌మెంట్‌కు రూ.1,500 కోట్లు కేటాయించింది. అయితే 2050 మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నది పరిసరాలను జోన్ల వారీగా విభజించి వాణిజ్య కార్యకలాపాలను అనుమతించడం ద్వారా వనరులను సేకరించాలని సర్కారు భావిస్తోంది. అందుకు అనుగుణంగా మూసీ వెంట రవాణా కారిడార్లు, లాజిస్టిక్ హబ్‌లను అభివృద్ధి చేయనున్నారు. తీరం వెంబడి రోడ్లు, వంతెనలు, స్కైవాక్‌లు, బోటింగ్, గ్రీనరీతో లంగ్ స్పేస్‌లు వంటివి ఏర్పాటు చేయనున్నారు.

మూసీ మురిసేందుకు.. రెండు సవాళ్లు..

హైదరాబాద్ నగరం పొడవునా సుమారు 57.5 కిలోమీటర్ల మేర మూసీ ప్రవహిస్తోంది. ఇందులో ఉస్మాన్‌సాగర్ డ్యాం డౌన్‌స్ట్రీమ్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు ఉత్తరం వైపున్న గౌరెల్లి, హిమాయత్‌సాగర్ మీదుగా బాపూఘాట్ వరకు సుందీరకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మురికికూపంగా మారిపోయిన మూసీ మురిసేలా చేసేందుకు ప్రభుత్వం ముందు రెండు సవాళ్లున్నాయి. ఒకటి కంపుకొట్టే మూసీ నదిని శుద్ధి చేయడం.. రెండోది పరిశ్రమలు, గృహాల నుంచి కలుషిత నీరు నదిలో కలవకుండా అడ్డుకోవడం..


1 గోదావరి నీటిని తరలించి..

మూసీ నదిని గోదావరి జలాలతో శుద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గుజరాత్‌లో నర్మదా నది నీటిని సబర్మతికి తరలించిన విధంగా.. రాష్ట్రంలో గోదావరి నీటిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలకు తరలించాలన్నది ప్రణాళిక. అలా తరలించే గోదావరి జలాలను.. ఈ రెండు జలాశయాల నుంచి నిరంతరం మూసీలోకి వదులుతూ, నదిని శుభ్రం చేసే పనులు కొనసాగిస్తారు. ఇలా గోదావరి జలాలను తరలించేందుకు రూ.5,600 కోట్ల నిధులు అవసరమని అంచనా వేశారు. రెండేళ్లలోనే ప్రక్రియ పూర్తిచేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

2 ఎస్టీపీలతో మురుగును శుద్ధి చేసి..

నగరంలోని పరిశ్రమలు, ఇళ్లు, వాణిజ్య సంస్థల నుంచి వెలువడే మురుగునీరు, వ్యర్థాలు మూసీలో కలుస్తూ కలుషితం చేస్తున్నాయి. దీంతో అమృత్ పథకం కింద 39 'సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్టీపీ)'ను నిర్మించాలని నిర్ణయించారు. అన్ని మురుగు కాల్వలను పూర్తిగా వాటికి అనుసంధానిస్తారు. వంద శాతం శుద్ధి చేసిన నీటిని నదిలోకి విడుదల చేస్తారు. మొత్తంగా మూసీ నదిలో స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా, పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేస్తారు.

'దుమ్ము' మింగేస్తున్న ప్రాణాలు



వాతావరణంలో చేరుతున్న పర్టిక్యులేట్ మేటర్, దుమ్ము, ధూళి వంటి కలుషితాలతో ఏటేటా మరణాల సంఖ్య పెరిగిపోతోంది. అందులోనూ చైనా, ఇండియాలలో మరణాలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. 'ఇనిస్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవల్యూషన్' సంస్థ చేసిన 'గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్' అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. అందులో కొన్ని ప్రధాన దేశాలకు సంబంధించిన వివరాలివీ..



'గుర్రపు' స్వారీ

శ్రీశైలం జలాశయానికి వరదనీటితో పాటు గుర్రపు డెక్క భారీగా చేరింది. చిన్న చిన్న కాలువలు, నదుల గుండా స్వారీ చేస్తూ ఇక్కడకు తరలివచ్చింది. దీంతో పచ్చని నిండు కుండలా ప్రాజెక్టు దర్శనమిస్తోంది. సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. - శ్రీశైలం ప్రాజెక్ట్

ఓరుగల్లులో 40 అడుగుల గణపతి



హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ గణేశ్ ప్రతిమ తరహాలో.. వరంగల్ నగరంలోనూ భారీ గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఓరుగల్లు భద్ర కాళీ హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 40 అడుగుల గణేశుడి ప్రతిమను రూపొందిస్తున్నారు. ఈ విగ్రహాన్ని పూర్తిగా మట్టితో తయారు చేస్తున్నారు. ఇందుకు కోల్‌కతానుంచి వచ్చిన కళాకారులు నెల రోజులుగా శ్రమిస్తున్నారు. విగ్రహ నిర్మాణానికి రేగడి మట్టి, వెదురు బొంగులు మాత్రమే ఉపయోగిస్తున్నట్లు మంగళవారం భద్రకాళి దేవస్థాన అర్చకుడు భద్రకాళి శేషు, నిర్వాహకుడు ఆకుతోట సంజీవ్ తెలిపారు.

- రామన్నపేట



ఇది ఏదైనా ప్లే స్కూల్‌లోని తరగతి గది అనుకుంటే పొరపాటే. పోలీస్‌స్టేషన్లకు వివిధ పనుల కోసం వచ్చే కక్షిదారుల వెంట చిన్న పిల్లలుంటే.. వారిని ఉంచేందుకు ఏర్పాటు చేసిన చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ ఇది. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఈ చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్‌ను డీజీపీ జితేందర్ మంగళవారం ప్రారంభించారు. యూనిసెఫ్, కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాలోని మొత్తం ఎనిమిది పోలీసుస్టేషన్లలో ఈ కార్నర్‌లను ఏర్పాటు చేశారు.

- సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

నిమ్స్‌లో హార్ట్ వాల్వ్ బ్యాంకు!

సహజసిద్ధమైన గుండె కవాటాలను అందించడమే లక్ష్యం	పేద రోగులకు ఉచితంగా హార్ట్ వాల్వులు పంపిణీ	త్వరలో హార్ట్ వాల్వ్ బ్యాంకును ప్రారంభించనున్న వైద్య మంత్రి



లక్డీకాపూల్: గుండెకు మరింత భరోసా కల్పించే దిశగా నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) అడుగులు వేస్తోంది. గుండె సమస్యలతో బాధపడుతున్న పేద రోగుల్లో అవసరమైన వారికి ఉచితంగా గుండె కవాటా(హార్ట్ వాల్వ్)లను అందించేందుకు నిమ్స్ సమాయత్తమైంది. ప్రస్తుతం ఆస్పత్రిలో గుండె సిరలు దెబ్బతిన్న వారికి కృత్రిమంగా తయారు చేసిన వాటిని అమరుస్తున్నారు. ఖర్చుతో కూడుకున్న ఈ వాల్వ్‌ల మార్పిడి ఆపరేషన్ నిరుపేదలకు పెనుభారంగా తయారైంది. దీంతో పేదలకు ఉచితంగా అందించేందుకు ఆస్పత్రిలో ప్రత్యేకంగా హార్ట్ వాల్వ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో స్థల పరిశీలన జరుగుతోంది. త్వరలోనే హార్ట్ వాల్వ్ బ్యాంక్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో ప్రారంభించాలని భావిస్తున్నారు.

బ్రెయిన్ డెడ్ అయిన వాళ్ల నుంచి సేకరణ..

బ్రెయిన్ డెడ్‌కు గురైన వాళ్ల నుంచి అవ యవాలను నిమ్స్ సేకరిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మృతుని కుటుంబసభ్యుల అంగీకారంతో కిడ్నీలు, కాలేయం, కళ్లు, గుండె తదితర కీలక అవయవాలను సేకరిస్తోంది. అదే విధంగా బ్రెయిన్ డెత్‌కు గురైన వాళ్ల నుంచి గుండె కవాటాలను కూడా సేకరించి.. వాటిని భద్రపర్చేందుకు ప్రత్యేక విభాగాన్ని(హార్ట్ బ్యాంక్) ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ బ్యాంకులో భద్రపరిచిన కవాటాలను పూర్తిగా ఉచితంగా అందించడంతో నిమ్స్‌కు వచ్చే రోగులు చాలా తక్కువ ఖర్చుతోనే శస్త్ర చికిత్సలు చేయించుకోవచ్చని నిమ్స్ అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ తెలిపారు.

వరదలో చిక్కిన ఎస్సై.. కాపాడిన స్థానికులు

చండూరు (గట్టుప్పల్): నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల పరిధిలో మంగళవారం సాయంత్రం గంటకుపైగా కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగాయి. గట్టుప్పల్ ఎస్సై గుత్తా వెంకట్‌రెడ్డి సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక వైపు కారులో వెళ్తుండగా మధ్యలో వాగులో చిక్కుకుపోయారు. ఆయనే స్వయంగా కారు నడుపుతూ వెళ్తున్నారు. దీంతో పోలీసు సిబ్బంది సమాచారం అందుకొని స్థానికుల సహకారంతో అర గంటకు పైగా శ్రమించి కారును, ఎస్సైని బయటకు తీసుకొచ్చారు. త్రుటిలో ప్రమాదం తప్పడంతో ఎస్సై ఊపిరి పీల్చుకున్నారు. అలాగే వెల్మకన్నె వాగు పొంగిపొర్లుతుండటంతో మునుగోడు మండలం చల్మెడ, మరికొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



వాగులో నుంచి కారును బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు, పోలీసు సిబ్బంది



తాము నిర్వహించనున్న రూరల్ విమెన్ లీడర్స్ ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని మంగళవారం మంత్రి సీతక్కను ఆహ్వానిస్తున్న నటి రెజీనా

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.